

నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 216 | ఆదివారం | 06-07-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




05

ట్రంపునకు మోదీ తలవంచుతారు


- భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందాలపై రాహుల్‌గాంధీ విమర్శ



05

20 ఏళ్ల తరువాత ఒకే వేదికపై..

- కలిసొచ్చిన ఉద్ధవ్, రాజ్ థాక్రేలు
- ప్రతిపక్షాల విజయోత్సవ ర్యాలీలో ప్రసంగాలు



05

అమెరికాలో నీరవ్‌మోదీ సోదరుడు

నేహల్ మోదీ అరెస్ట్..

- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000 కోట్ల మోసం కేసులో నిందితుడు

## చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడితే

# కఠిన శిక్షలు

## ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టం

## దోషులపట్ల ఎలాంటి జాలి చూపొద్దు

- మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- 'నిస్సహాయకులకు అండగా - లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ, హక్కులు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాపక్షం / హైదరాబాద్

పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల విషయంలో ఎలాంటి జాలి చూపకుండా దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసిహెచ్‌ఆర్‌డి) లోశనివారం 'నిస్సహాయకులకు అండగా లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ, హక్కులు' అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న హేయమైన నేరాలను నియంత్రించడమే కాకుండా బాధితులకు చట్టపరంగా, నైతికపరంగా మాత్రమే కాకుండా అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, వారి రక్షణ కోసం తెలంగాణలో భరోసా ప్రాజెక్టును చేపట్టామన్నారు. భరోసా ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పని చేస్తున్నాయని, ఈ కేంద్రాల ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా

తరువాయి 2లో



"బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. వారి రక్షణ కోసం రాష్ట్రంలో భరోసా ప్రాజెక్టును చేపట్టాం. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి.
పోక్సో చట్టం, జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి."

– సిఎం రేవంత్‌రెడ్డి






మహిళా సాధికారతలో దేశానికి

## తెలంగాణ రోల్ మోడల్

- ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాలు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు ఆర్‌టిసి అద్దె రూ.1.05 కోట్లు అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా సాధికారతలో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళా సంఘాలు అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంభన సాధించడం ద్వారా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాక్షించారు. శనివారం ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా 151 మండల

తరువాయి 2లో

## వ్యవసాయంలో ఎఐ టెక్నాలజీ



- మొబైల్ ద్వారా శాటిలైట్‌తో రైతులు వినియోగించుకోవాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులందరూ మొబైల్ ఫోన్ ద్వారా శాటిలైట్ తో ఎఐ టెక్నాలజీని వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ యాప్ వినియోగించడం వల్ల రైతుల విలువైన సమయం ఆదా కావడంతో పాటు, రైతులు తమ పంటలకు కచ్చితమైన నివారణ చర్యలు తీసుకునే వీలుకలుగుతుందని సూచించారు. సచివాలయంలో శనివారం మంత్రి కృషి వాస్ సంస్థ ప్రతినిధులతో తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. రైతులకు ఎఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషివాస్ సంస్థతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. ఈ టెక్నాలజీ రైతులకు పూర్తి ఉపయోగపడే విధంగా

తరువాయి 2లో

వచ్చే అసెంబ్లీ సమావేశంలో

## 'కొత్త స్టాంప్ సవరణ బిల్లు'



- శాస్త్రీయంగా భూముల ధరల సవరణ
- పాత అపార్ట్‌మెంట్లకు, మహిళలకు స్టాంప్ డ్యూటీలు తగ్గింపు..
- త్వరలోనే సిఎంతో చర్చించి తుది నిర్ణయం : మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్

సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండే విధంగా నూతన స్టాంప్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు భారతీయ స్టాంపు చట్టం 1899ను అనుసరించి, తెలంగాణ సవరణ బిల్లు–2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎటువంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని,దీనికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. 'తెలంగాణ సవరణ బిల్లు2025' అంశంపైన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శి వి. శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయవ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్‌డి వేముల శ్రీనివాస్ తదితరులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సమావేశాన్ని నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం,

తరువాయి 2లో



## సిఎం సవాల్ స్వీకరిస్తున్నాం

- రైతులపై చర్చించేందుకు ఎక్కడికి వచ్చేందుకైనా సిద్ధమే
- ఈనెల 8న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తాం.. మేమే ఏర్పాట్లు చేస్తాం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులపై చర్చించేందుకు సిఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బిఆర్‌ఎస్ తరపున తాము స్వీకరిస్తున్నామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రకటించారు. అసెంబ్లీ, అంబేద్కర్ విగ్రహం, కొండాపల్లి, కొడంగల్, గజ్వేల్ ఏ ప్రాంతంలో చర్చకు పెట్టినా తాము వస్తామన్నారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌కు వస్తామని, తామే ఏర్పాట్లు చేస్తామని, తాను చర్చకు 'రెడీ' అని కెటిఆర్ అన్నారు. తాము వ్యవసాయ రంగంలో

తరువాయి 2లో

రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా

# బిజెపిని అడ్డుకుంటాం

- గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నాయకులు
- దేశం కోసం ప్రాణాలొడ్డిన అమరుల వారసులు కమ్యూనిస్టులు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఘనంగా మహబూబాబాద్ జిల్లా మహాసభలు
- కురవిలో భారీ ర్యాలీ



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి

తెలంగాణలో మనువాద, ఫాసిస్ట్ బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా సిపిఐ తృతీయ మహాసభలు కురవి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన అనంతరం జరిగిన బహిరంగ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నాయకులని, అలాంటి పార్టీని తెలంగాణలో అధికారంలోకి రానివ్వం అన్నారు. దేశం కోసం ప్రాణాలొడ్డిన అమరుల వారసులు కమ్యూనిస్టులని చెప్పారు. కమ్యూనిస్టులను అంతం చేయాలని బిజెపి కలలు కంటున్నదని, కమ్యూనిస్టులను అంతం చేయడం బిజెపి తరం కాదని అన్నారు. ప్రజలంతా కమ్యూనిస్టులు బతకాలని కోరుకుంటుంటే మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావును అమిత్ షా అన్యాయంగా చంపించారని అన్నారు. కమ్యూనిస్టులను అంతంచేయడం అడాల్ఫ్ హిట్లర్ వల్లే సాధ్యం

తరువాయి 12లో

## సుప్రీంకోర్టుకు 'ఎడిఆర్'

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై సవాల్

ADR
Association for Democratic Reforms

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) కోసం ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్‌చేస్తూ ది అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిహార్‌లో అనర్హుల పేర్లను తొలగించి, అర్హులైన పౌరులను మాత్రమే ఓటర్ల జాబితాలో చేర్చాలని జూన్ 24న ఎన్నికల సంఘం (ఇసి) ఆదేశాలు జారీచేసింది. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 325, 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, ఓటర్ల నమోదు నియమాలు 1960సంవత్సరం రూల్ 21ఏ లోని నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని వాదిస్తూ ఆదేశాలను, కమ్యూనికేషన్‌ను పక్కకు పెట్టాలని ఎడిఆర్ సుప్రీంకోర్టును కోరింది. ఎన్నికల సంఘం ఉత్తర్వు ఏకపక్షంగా, తగిన ప్రక్రియ లేకుండా లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేయగలదని,

తరువాయి 12లో

నేడు రేపు రియో డీ జనీరోలో

## 'బ్రిక్స్ ప్లస్ గ్రూప్ దేశాల' భేటీ

పుతిన్, జిన్‌పింగ్ లేకుండానే సమావేశాలు




**రియో డి జనీరో :** అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలలో మార్పులు సంభవిస్తున్న ప్రస్తుత తరుణంలో బ్రిక్స్ దేశాల నాయకులు ఆది–సోమ వారాలలో బ్రెజిల్ నగరం రియో డీ జనీరోలో సమావేశమవుతున్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ రెండేళ్ళలో కొత్తగా మరో ఐదు దేశాలు బ్రిక్స్ సభ్యత్వం తీసుకోవడంతో ఇప్పుడు దీనిని ''బ్రిక్స్ ప్లస్ గ్రూపు''గా పిలుస్తున్నారు.రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇద్దరు ఈ సమావేశాలకు హాజరుకావడంలేదు. వారు లేకుండానే ఈ సమావేశాలు జరుగుతాయి. వీరిద్దరిస్థానంలో రష్యా తరపున విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్, చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్ హాజరవుతారు. పుతిన్,జిన్‌పింగ్ ఇద్దరూ ఈ సమావేశాల్లో పాల్గొనకపోవడంతో ఇక భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీపైనే ప్రధానంగా అందరూ దృష్టి సారించే అవకాశం ఉంది. ఆయనతోపాటు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో డ సిల్వా కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నాయకుడే కావడంతో వీరిద్దరూ ప్రధానంగా బ్రిక్స్ సమావేశాలను నడిపించే అకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవస్థాగతంగా ఉన్న అంతర్జాతీయ సంస్థలలో ప్రత్యేకించి సంక్షోభ సమయాలలో న్యాయం చేసేవిధంగా సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ ప్లస్ వేదిక ప్రధానంగా కోరుతున్నది. ప్రపంచంలో

తరువాయి 12లో

నకిలీ పత్రాలు, స్టాంపుల

## కుంభకోణం గుట్టురట్టు

- పలు శాఖల పత్రాలు, అధికారుల సంతకాలతో స్టాంపులు స్వాధీనం
- తండ్రీకొడుకులపై కేసు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్‌పి





ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి

ప్రభుత్వ నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులు తయారు చేస్తున్న కుంభకోణాన్ని ఆదిలాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారని, ఈ కేసులో పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి తండ్రీ కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## దాడుల్లో పాలస్తీనా వైద్యుడు, కుటుంబం మృతి



గాజా:గాజాలో శనివారం తెల్లవారుజామునుండి జరుగుతున్న దాడుల్లో సాయంత్రం వరకూ పాలస్తినా వైద్యుడు సహా ఆయన పిల్లలు, కుటుంబీకులతో కలిపి 42 మంది మరణించారు. నస్సర్ మెడికల్ కాంప్లెక్స్‌లో గైనకాలజీ, సంతానసాఫల్య విభాగాలలో ప్రత్యేక నిపుణుడైన మూసా హమ్దాన్ ఖాఫజాతో సహా ఆయన పిల్లలు, కుటుంబీకులు ఐడిఎఫ్ దాడుల్లో మరణించారు. పాలస్తీనియన్లపై యుద్ధం మొదలై జులై ఐదో తేదీకి 639 రోజులు గడిచాయి. గడచిన 45 రోజులుగా గాజాలో ఆహారంకోసం వేచి ఉంటున్న పాలస్తీనా ప్రజలపై ప్రతిరోజూ జరుగుతున్న దాడుల్లో ఇప్పటివరకూ 600 మంది మరణించారు. మార్చి 18వ తేదీన ఇజ్రాయెల్ సైన్యం యుద్ధం తిరిగి ప్రారంభించినప్పటినుండి 6000 మంది ప్రజలు మరణించారు.

## చర్చలకు మేం రెడీ : హమాస్ ప్రకటన

నెతన్యాహూ మంత్రివర్గం చర్చ

ఔనా..గుడ్..వచ్చేవారం ఒప్పందం:ట్రంప్



దుబాయ్: గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి మధ్యవర్తి దేశాల ప్రతిపాదనలకు తాము సానుకూలమైన సంకేతాలు ఇచ్చామని పాలస్తీనాకు చెందిన హమాస్ సాయుధ సంస్థ ప్రకటించింది. తక్షణం మొదటి విడత సంప్రదింపులు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేసింది. ఐతే సంబంధిత షరతులను సమ్మతించారా? లేదా? అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. "మేం చిత్తశుద్ధితో ఉన్నాం, తక్షణం సంప్రదింపుల్లోకి దిగేందుకు కట్టుబడి ఉన్నాం" అని చెప్పింది. ఖతార్, ఈజిప్టు దేశాల ప్రతినిధులు కొద్దినెలలుగా హమాస్‌ను ఒప్పించే బాధ్యతలు చేపట్టాయి. అమెరికాలో నిమగ్నమయ్యాయి. కొత్తగా ట్రంప్ ప్రతిపాదించిన 60 రోజుల కాల్పుల విరమణకు సంబంధించి తాము సుముఖంగా ఉన్నామని శుక్రవారం ప్రత్యుపాయాక చెప్పింది. బందీలను విడుదల చేయాలని, మృతదేహాలుంటే వాటిని కూడా స్వాధీనం చేయాలని ట్రంప్ ప్రతిపాదించారు.

హమాస్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు అమెరికా మీడియాతో మాట్లాడుతూ, "మళ్ళీ యుద్ధం రాకుండా చూడాలని మేం కోరాం, ఇజ్రాయెల్‌కు ఆయుధ సహాయం చేయకూడదని కోరాం, గాజాలో మానవతా సహాయ పంపిణీకి సంబంధించి చేసిన ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని కోరాం, మార్పులు అంటే సహాయం కేవలం ఐక్యరాజ్యసమితి, దాని భాగస్వామ్య సంస్థల నాయకత్వంలోనే జరగాలని కోరాం, చర్చలు విఫలమైతే తిరిగి యుద్ధం రాదని అమెరికా హామీ ఇచ్చింది, కానీ ఒప్పందం కుదిరితే గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యాన్ని ఉపసంహరించాలని మేం కోరాం, షరతుల్లో ఇలాంటి కొన్ని మార్పులు చెయ్యాలని అడిగాం" అని చెప్పారు. ఐతే ఈ విషయాన్ని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం లో పాత్రికేయులు ట్రంప్ దృష్టికి తీసుకురాగా, హమాస్ ఉద్దేశం విషయం తన దృష్టికి రాలేదంటూ "అలా అయితే మంచిదే... వచ్చేవారం గాజాపై ఒప్పందం జరిగే అవకాశాలు ఉన్నాయి" అన్నారు. అదేవిధంగా నిర్దిష్ట ప్రకారం వచ్చేవారంలో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ వాషింగ్టన్‌లో పర్యటించనున్నారు. చర్చలు విఫలమైతే యుద్ధం ఆపుతామని ట్రంప్ హామీ ఇచ్చారు తప్ప ఇజ్రాయెల్ సైన్యం గాజాను వదిలివెళ్లిపోతుందని హామీ ఇవ్వలేదు. అదే విధంగా గాజాలో ఆహార సరఫరా పుష్కలంగా జరుగుతుందని హామీ ఇచ్చారు. కానీ అమెరికా, ఇజ్రాయెల్ సారథ్యంలోని సహాయ సంస్థల ద్వారా ఆహార సరఫరా జరుగకూడదని హమాస్ కోరుతున్నది. ఈ మార్పులు చెయ్యాలని అడుగుతోంది. 10 మంది సజీవులైన బందీలను, 18 మృత దేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించేందుకు హమాస్ సుముఖత వ్యక్తం చేసిందన్నది మధ్యవర్తుల సందేశం. హమాస్ వద్ద ఇప్పటికీ ఇంకా 50 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారు. వీరిలో కేవలం 28మంది మరణించారు. ఐతే ఐడిఎఫ్ సైన్యం గాజాలో ముమ్మర గాలింపు కొనసాగిస్తోంది.

**ఇజ్రాయెల్ మంత్రివర్గం చర్చ..వేలాదిమంది ప్రదర్శనలు**

నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటన నేపథ్యంలో ఇజ్రాయెల్ మంత్రివర్గం గాజాలో ఒప్పందం చేసుకునే విషయంపై చర్చ జరిపింది. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9 గంటలకు ఇజ్రాయెల్ మంత్రివర్గం సమావేశమైంది. ఆ తర్వాత రాత్రి 10 గంటలకు ఇజ్రాయెల్ వ్యాప్తంగా వేలాది మంది ప్రదర్శనలు చేయడం ప్రారంభించారు. చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించడంతో బందీల కుటుంబాలు, వారి బంధువులు, స్నేహితులు వేలాదిమంది వీధుల్లోకి వచ్చి హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. పెండింగ్ లేకుండా మొత్తం బందీలందరినీ విడుదల చేసేవిధంగా ఈ ఒప్పందం జరగాలని వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు.

## స్వాతంత్ర్యవేడుకల వేళ 'బిగ్ బిల్'కు చట్టరూపం

### మసకబారనున్న స్వల్పాదాయ వర్గాల జీవితాలు



**వాషింగ్టన్ :** అనుకున్న విధంగా అనుకున్న సమయానికి డోనాల్డ్ ట్రంప్ కల–పట్టుదల రెండూ నెరవేరాయి. గ్రాండ్ ఓల్డ్ పార్టీ (అధికార రిపబ్లికన్‌పార్టీ) ప్రతిష్ఠాత్మకంగా భావించిన బిగ్ బిల్‌పై ట్రంప్ సంతకం చేసి ఆమోదముద్ర వేయడంతో ''బ్యూటిఫుల్ బిల్'' చట్టరూపం దాల్చింది. ఎట్టిపరిస్థితుల్లో జులై నాలుగోతేదీనాటికి బిగ్ బిల్లు ఆమోదం పొందడానికి తన టేబుల్ మీద ఉండాలని రిపబ్లికన్లు అధికంగా ఉన్న అమెరికా దిగువసభకు ఆదేశించిన విధంగానే బిల్లు చట్టరూపం తీసుకుంది. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ బిల్లు ఒక బహుమతిగా ట్రంప్‌కు లభించడంతో రిపబ్లికన్లు హడావుడి చేస్తున్నారు. అన్ని విభాగాలు, శాఖల కార్యాలయాలను అలంకరించి వేడుకలు ముమ్మరం చేశారు. బిల్లుపై సంతకం చేసేముందుగా ట్రంప్ లాంఛనంగా 22 నిమిషాలసేపు మాట్లాడారు. ''వాగ్దానాలు చేశాం, వాటిని నిలబెట్టుకున్నాం'' అన్నారు. రెండోవిడత పరిపాలనాకాలంలో ట్రంప్‌కు స్వదేశం లో ఇదే అతిపెద్ద ఘనవిజయం.

ఈ బిల్లుకు ఆమోదం తెలియజేస్తే ఆ మరునాడే డెమోక్రాట్లు, రిపబ్లికన్లకు వ్యతిరేకంగా 'ద అమెరికన్ పార్టీ' ఆవిర్భవిస్తుందని డాడ్జ్ శాఖ మాజీ అధిపతి, అపర కుబేరులు ఎలాన్ మస్క్ హెచ్చరించిన తర్వాత నిర్ణీత సమయానికే బిల్లు ఆమోదం పొందింది. రెండోవిడత ట్రంప్ పరిపాలనా కాలం లో ఈ బిగ్ బిల్లు అత్యంత ప్రాముఖ్యతగల అంశంగా ఆయన యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ బిల్లు దిగువ సభలో తుది ఆమోదం పొందడంలో హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ ఎంతో కీలకపాత్ర వహించారు. ఈ బిల్లును ఆయన ట్రంప్‌కు ఒక బహుమతిగా అందజేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా ఎన్నడూలేనివిధంగా ఈ బిల్లుపై అమెరికా ఉభయసభలో చర్చలు నిద్రలేని రాత్రులతో కొనసాగాయి. బిల్లును చరిత్రాత్మకమైనదిగా, జాతి ఆవిర్భావకాలంలో ఇప్పటివరకూ అమెరికా చట్టసభల్లో ఆమోదముద్ర వేయించుకున్న మైలురాయి విజయంగా రిపబ్లికన్లు దీనిని అభివర్ణించారు. 215–214 ఓట్ల తేడాతో గట్టెక్కిన ఈ బిల్లును డెమోక్రటిక్ పార్టీ ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు విజయం సాధించడంద్వారా అమెరికా వైభవం తిరిగి వచ్చినట్టేనని మైక్ జాన్సన్ అన్నారు. బుధవారంనాడు దిగువసభలో సుదీర్ఘ చర్చలు జరుగుతుండగా, ట్రంప్ గ్రాండ్ ఓల్డ్ పార్టీ ముఖ్యులందరూ సమావేశం జరిపారు. ''ఈ చరిత్రాత్మకమైన బిల్లు ఆమోదం పొందడానికి కృషి చేసిన పార్టీ సభ్యులు, స్నేహితులు ప్రముఖులందరికీ ఆయన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆహార ధరలపై దెబ్బ..ధనవంతులకు ప్యాకేజీ**

ట్రంప్ బ్యూటిఫుల్ బిల్లుతో వైద్యసేవలకు, పేదల వైద్య బీమాకు గండి పడింది. 1.18 కోట్లు కంటే ఎక్కువ మంది వైద్యబీమాకు దూరమవుతారు. తక్కువకు సరఫరా అయ్యే ఆహార వస్తుల ధరలు పెరుగుతాయి. ఒబామా, బైడెన్ పాలనాకాలంలో చేపట్టిన ఆరోగ్యసేవల విస్తరణ, పునర్వినియోగ ఇంధన వినియోగానికిగాను తక్కువ ఆదాయాలవారికి వర్తించే పన్నుల తగ్గింపు చర్యలను ఈ మెగా బిల్లు వెనక్కు మళ్ళిస్తుంది. తక్కువ ఆదాయాలున్న లక్షల మందిని దోచుకుని ధనవంతులకు ప్యాకేజీ ఇస్తున్నారని విమర్శకులు ట్రంప్‌పై ధ్వజమెత్తారు. ముఖ్యమైన రంగాలకు కోతలు విధించి న ఈ నిధుల్లో ఎక్కువ భాగం సరిహద్దు కాపలాకు, రక్షణ రంగానికే ఉపయోగిస్తారని ప్రతిపక్షాలు విమర్శించాయి. అందుకు తగ్గట్టుగానే, అనేక ట్రిలియన్ డాలర్లతో కూడిన ఈ మెగా బిల్లు ప్రణాళికలో 150 బిలియన్లు పెంటగాన్‌లోని రక్షణశాఖ కు వెళతాయి. అమెరికా గగనతల రక్షణకు ట్రంప్ తలపెట్టిన ''గోల్డ్ డోమ్'' ప్రాజెక్టు కూడా ఇందులో కలిసే ఉంది.

## టెక్సాస్ వరదల్లో 23 మంది బాలికలు గల్లంతు

### 24కు పెరిగిన మృతులసంఖ్య



**ఆస్టిన్ :** టెక్సాస్‌లో గడచిన గురువారం నుండి మొదలైన భారీ వరదలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ వరదలకారణంగా మరణించినవారిసంఖ్య 24కు పెరిగింది. రివర్‌సైడ్ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులలో 23 బాలికలు ఈ వరదల్లో గల్లంతయ్యారు. ఈ బాలికలకోసం చాలా ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 500 మంది సిబ్బంది సామూహిక గాలింపు చర్యలు ప్రారంభించారు. మరో 14 హెలికాప్టర్లు కూడా రంగంలోకి దిగాయి. అత్యవసర సిబ్బంది 237 మందిని రక్షించారనీ, హెలికాప్టర్ల ద్వారా మరో 167 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చామని టెక్సాస్ సైనికాధికారి మేజర్ జనరల్ థామస్ సుయెల్జర్ చెప్పారు. ఈ వరదలు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని దేశాధ్యక్షుడు ట్రంప్ అన్నారు. టెక్సాస్‌కు ఏదైనా సహాయం చేశారా? అని పాత్రికేయులు ప్రశ్నించగా అదే పనిలో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజాభద్రతా విభాగం డైరెక్టర్ ఫ్రీమాన్ మార్టిన్ మాట్లాడుతూ, దీనిని సామూహిక ప్రాణనష్ట ఘటనగా పేర్కొన్నారు. వరదలు ముంచెత్తిన ప్రాంతాన్ని హిల్ కౌంటీగా పేర్కొంటారు. దక్షిణమధ్య టెక్సాస్ ప్రాంతంలో ఆకస్మిక వరదల కారణంగా తీవ్ర విపత్తు పరిస్థితులు నెలకున్నాయనీ, ఇప్పటివరకు 24 మరణించారనీ కెర్ కౌంటీ షరీఫ్ లారీ లైతా పత్రికాగోష్ఠిలో చెప్పారు. రివర్ సమ్మర్ క్యాంప్‌లో ఎక్కువమంది బాలికలు కనిపించకుండా పోయారని, మొత్తం గల్లంతైనవారి సంఖ్య 25గా తేలిందని టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నర్ డాన్ పాట్రిక్ చెప్పారు. గ్వాడాలుపే నది ఒడ్డున 750మంది బాలికలతో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న సమయంలో భారీవర్షం కురిసిందని, కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే నది మట్టం ఎనిమిది మీటర్ల (26 అడుగులు) ఎత్తుకు పెరిగిపోయిందని పిల్లలు గల్లంతయ్యారని లైతా చెప్పారు. అమెరికాలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన 'రివర్ వ్యాలీ'గా పేర్కొన్నారు.

## రష్యా వైమానిక స్థావరంపై ఉక్రేన్ దాడి



**కీవ్ :** రష్యా వైమానిక స్థావరంపై ఉక్రేన్ దళాలు శనివారంనాడు భారీ దాడులు చేశాయి. శుక్రవారం నాడు రష్యా గత మూడేళ్ళలో లేనిరీతిలో తీవ్రస్థాయిలో 550 డ్రోన్లు, క్షిపణులతో ఉక్రేన్ అంతటా దాడులు చేసి బీభత్సం సృష్టించింది. అనేక జిల్లాలలో తీవ్ర నష్టం జరిగింది. 23 మంది గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత ఆగ్రహించిన ఉక్రేన్ ఎదురుదాడులకు దిగింది. రెండు దేశాల మధ్యా ఇటీవల దాడులు ఉధృతం కావడంతో యుద్ధం ముగించేందుకు ఇటీవల జరిగిన ప్రయత్నాలు నీరు గారుతాయన్న ఆందోళన రేకెత్తుతోంది. రష్యా వోరోనెజ్క్స రీజియన్‌లోని బోరిసోగ్లెబ్క్స వైమానిక స్థావరాన్ని ఉక్రేన్ దళాలు ధ్వంసం చేశాయని ఆ దేశ మిలిటరీ జనరల్ స్టాఫ్ చెప్పారు. ఈ వైమానికస్థావరంలో రష్యాకు చెందిన ఎస్‌యు–34, ఎస్‌యు–35, ఎస్‌యు–30 ఎస్‌ఎం ఫైటర్‌జెట్స్‌కు స్థావరంగా ఉందని చెప్పారు. ఉక్రేన్ జనరల్ స్టాఫ్ ఫేస్‌బుక్‌లో ఈ విషయం రాశారు.

**పుతిన్–జెలెన్స్కీలతో ట్రంప్ ఫోన్ సంభాషణలు**

ఉక్రేన్ చుట్టూ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ''జెలెన్స్కీతో నేను జులై నాలుగోతేదీన ఫోన్‌లో మాట్లాడాను, చాలా చాలా మంచి సంభాషణ జరిగింది, కానీ అక్కడ పరిస్థితి చాలా సంక్లిష్టంగా ఉంది, అదేవిధంగా జులై 3న పుతిన్‌తో నేను ఫోన్‌లో సంభాషణ చేశా, నాకు చాలా అసంతృప్తిగా ఉంది'' అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రష్యా సుముఖంగా ఉందన్న విషయంపై ఆయన సందేహాలు వ్యక్తం చేస్తూ, ఇది మంచి పరిణామం కాదన్నారు. ఉక్రేన్‌తో చర్చలు జరపడానికి కొత్త తేదీలు వెతకడానికి మేం ఇంకా అన్వేషణలో ఉన్నామని ఫోన్ సంభాషణ సందర్భంగా ట్రంప్‌కు పుతిన్ చెప్పారు. ఉక్రేన్‌కు అన్ని రకాల భారీ ఆయుధాల సరఫరాలను అమెరికా ఆపేస్తుందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక జులై రెండో తేదీన వార్త రాసింది.





## కఠిన శిక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉందని, ఈ కోర్టుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం కల్పించడం, భవిష్యత్తులో వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నదే లక్ష్యమన్నారు. పోక్సో చట్టం, జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలని, ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలన్నారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే లభించాలని కాకుండా, ఈ ప్రక్రియలో ప్రతి దశలోనూ వారికి అవసరమైన అండదండలు లభించాలని, పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో పాటు అన్ని దశల్లోనూ బాధితులకు న్యాయం దక్కాలి, రక్షణ కల్పించాలి. న్యాయం దక్కడం అంటే కేవలం దోషులకు శిక్షలు విధించడం వరకే సరిపోదని, బాధితుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని, వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు ఉండాలన్నారు. అత్యంత హేయమైన ఇలాంటి నేరాలను నియంత్రించడంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, పౌర సమాజంలోని ఇతర భాగస్వామ్య సభ్యులందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. సదస్సులో యునిసెఫ్ ప్రతినిధి సింథియా మెకాఫ్రే, డిజిపి డాక్టర్ జితేందర్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు, పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు పౌర సమాజంలోని భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు హాజరయ్యారు.

## కుంభకోణం గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. శాంతినగర్‌కు చెందిన ఎ1 లద్వే రాహుల్‌కుమార్, ఎ2 లద్వే బద్రీనాథ్ తండ్రీ కొడుకులు నిందితులని తెలిపారు. ఎ1 లద్వే రాహుల్ కుమార్, గత కొన్ని నెలలుగా పట్టణంలోని వివిధ శాఖలకు సంబంధించిన పత్రాలను స్టాంపులను నకిలీవి సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న సందర్భంలో పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి ఇంటిపై దాడి చేసి నకిలీ స్టాంపులు, స్టాంపులను తయారుచేసే రసాయనాలు, ఎక్స్‌రే పేపర్లు, స్టాంపుల పరికరాలు, కంప్యూటర్, హార్డ్ డిస్క్‌లు, వివిధ జిల్లాల్లో వివిధ శాఖలకు సంబంధించినటువంటి తయారు చేసిన నకిలీ స్టాంపులు, అధికారుల సంతకాలతో కూడిన నకిలీ స్టాంపులు, నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పత్రాలను సృష్టించి నిజమైన భూ యజమానులకు, నకిలీ యజమానులకు మధ్య గొడవలు వచ్చే విధంగా పత్రాలను సృష్టించడం జరిగిందని తెలిపారు. నకిలీ పత్రాల ద్వారా ప్రభుత్వ స్కీములలో లబ్ది పొందిన వారికి వివరాలను సేకరించి అదేవిధంగా ప్రభుత్వ స్థలాలను నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసిన వారి వివరాలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. డ్యాక్యుమెంట్ రైటర్ ముసుగులో ఫేక్ పత్రాలను తీసుకున్న వీరిపై కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. దర్యాప్తులో పూర్తి వివరాలను విశ్లేషించి కుంభ కోణంలో ఇతర వ్యక్తుల పాత్రపై విశ్లేషణ జరుగుతుందని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసి ఫేక్ పత్రాలను ద్వారా లబ్ది పొందిన వారిపై తగు చర్యలను తీసుకోబడతాయని తెలిపారు. ఈ కుంభకోణం బట్టబయలులో కీలక పాత్ర పోషించిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ బి సునీల్‌కుమార్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ఎల్ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సిఐ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'కొత్త స్టాంప్ సవరణ బిల్లు'

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను, 26 ఆర్టికల్స్‌ను సవరించేందుకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి భారత ప్రభుత్వ ఆమోదం కోసం పంపించామని, దీనిపైన కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చినప్పటికీ, 2023 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకుని, ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించామన్నారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలను కట్టుదిట్టమైన రూపంలోనికి తీసుకురావడం, కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని, అలాగే పాత చట్టంలో లేని వాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని మంత్రి అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు.

**శాస్త్రీయ పద్ధతిలో భూముల సవరణ**

సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎటువంటి భారం పడకుండానే, ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా, ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఏ,ఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది, అక్కడ హేతబద్దంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది? ఇలా తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ అభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని,ఇందులో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలనే ఆలోచన చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. కొత్త, పాత అపార్ట్‌మెంట్‌లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉన్నదని, ఇక నుంచి పాత అపార్ట్‌మెంట్లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకుని స్టాంప్ డ్యూటీ తగ్గించాలనే ఆలోచన చేస్తున్నామని, ఈ రెండు అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సంఘాల గ్రూప్‌లకు ఆర్‌టిసి నుంచి రావాల్సిన బస్సుల అద్దెకు సంబంధించి రూ.1.05 కోట్ల చెక్కులను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి డిప్యూటి సిఎం అందజేశారు. అదేవిధంగా మహిళ రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి 'మహిళా సాధికారతలో ప్రగతి చక్రాలు' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా గౌరవించుకోవాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తుతోందని తెలిపారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి నిర్దేశించుకున్న లక్ష్యంలో మొదటి సంవత్సరం రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించగా, ప్రతి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా వీటిని అందంచబోతున్నామని తెలిపారు. ఈనెల 12 నుంచి 18 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాకుండ బ్యాంకు లింకేజ్, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మనందరిదని, సమాజంలో ప్రధానమైనదికుటుంబ వ్యవస్థ అని, దీనిని నడిపేది మహిళేనని వారి ఆర్థికంగా బలోపేతం చేస్తే ప్రజలందరూ సగౌరవంగా జీవించే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్‌టిసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదుకాబోంది. తద్వారా ప్రభుత్వం రూ.6500 కోట్ల విలువైన ఉచిత ప్రయాణిన్ని అందించిన ఘనతను దక్కించుకోనుందని తెలిపారు. నష్టాలో ఉన్న ఆర్‌టిసి ఆదుకుంది మహాలక్ష్మి పథకమని, ఇప్పుడిప్పుడే ఆర్‌టిసి లాభాల బాట పడుతోందని చెప్పారు. జంట నగరాల్లో మహిళలకు 5 వేల ఈవి ఆటోలను అందజేసే ఆలోచన చేస్తున్నామని, తద్వారా వారికి ఉపాధి కల్పంచడంతోపాటు హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గుతుందని తెలిపారు.

## సిఎం సవాల్ స్వీకరిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పండిపోయామని, కానీ వారు (కాంగ్రెస్) ప్రీపేర్ కాలేదని చెప్పకుండా, సిఎం రేవంత్‌రెడ్డి మంచిగా ప్రీపేర్ అయి చర్చకు రావాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం కెటిఆర్ మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో చంద్రబాబు రైతుల గొంతు కోస్తుంటే, గోదావరి నీళ్లను తీసుకెళ్తుంటే సిఎం వంత పడుతున్నారని, జల దోపిడీని అడ్డుకునే క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రయోజాలనకు సిఎం రేవంత్ రెడ్డి వంత పాడుతున్నారని కెటిఆర్ ఆరోపించారు. ఇందిరమ్మ గొప్పతనం కాలిపోయిన మోటర్లు, ఎరువులు, విత్తనాల కోసం అసమర్ధ ప్రభుత్వం రైతులను కాల్చుకు తింటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులు, యూరియా కోసం ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదన్నారు. తెలంగాణలో రైతు రాజ్యం ఎవరు తీసుకొచ్చారో? ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానాను తలదన్ని భారతదేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణను ఎవరు చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు.

## ఎఐ టెక్నాలజీ

(మొదటి పేజీ తరువాయి)

యాప్‌ను తిర్చిదిద్దాలని మంత్రి సూచనల మేరకు పలు మార్పులు చేర్పుల చేసిన కృషివాస్ సంస్థ క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసింది. ఇదేక్రమంలో మంత్రితో సమావేశమైన కృషివాస్ సంస్థ ప్రతినిధులు యాప్ పనితీరును వివరించారు. ఏఐ టెక్నాలజీతో శాటిలైట్ ఇమేజింగ్ ద్వారా ముందస్తుగానే పంటలకు వచ్చే చీడ పురుగులు, రసం పీల్చే పురుగులను గుర్తించి, వాటిని మొదట్లోనే నిరోధించేవిధంగా టెక్నాలజీ ఉపయోగపడనుందని మంత్రికి వివరించారు. అంతేకాకుండా పంట బయటకు కనిపించే వాటినే కాకుండా పంట అంతర్గతంగా ఉన్న రోగాన్ని కూడా గుర్తించి దానికి నివారణ చర్యలు కూడా సిఫార్సు చేస్తుందని, దీని ద్వారా వాటికి కావాల్సిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పొలంలో ఎక్కడ ఏ ప్రాంతంలో ఏ మొక్కకు తెగులు సోకిందో ముందు గానే గుర్తించి, దానికి పిచికారి చేయాల్సిన మందును కూడా మనకు సూచిస్తుందని చెప్పారు. దీంతో సంబందిత రైతు ఆ పంటకు పిచికారి చేసి పంటలను సరైన సమయానికి సంరక్షించుకోవచ్చని, అసలు పొలం దగ్గరకి పోకుండా కూడా ఈ యాప్ ద్వారా పంట స్థితిగతులను తెలుసుకోవచ్చని మంత్రికి వివరించారు. రైతుపంట ఎంత వేశారు, ఎన్ని ఎకరాలలో వేశారు అన్న డేటా కూడా రియల్ టైంలో వ్యవసాయ అధికారులకు లభిస్తుందన్నారు. ఎక్కడైతే తెగుళ్ళు ఏర్పడుతుందో, దానినే ముందుగా గుర్తించి, నివారణ దిశగా చర్యలు తీసుకోవడం వలన రైతులకు మిగతా పొలానికి తెగులు ఏర్పడకుండా నివారించి, తక్కువ కూలీ ఖర్చుతో, అధిక దిగుబడి పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ఈ ఏఐ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముందస్తు సమాచారం,సమస్యను గుర్తించడం, సమస్య చోటులోనే స్ప్రే చేయడం, వాతావరణ హెచ్చరికలు, నేల ,ఆకు తేమ సమాచారం, ఆయిల్ పామ్ లో ప్రతి చెట్టు కు రియల్ టైం సమాచారం ఇస్తుందని తెలిపారు.ఈ యాప్ ద్వారా 60 కు పైగా పంటలను (పత్తి, మొక్క జొన్న, వరి, మిరప, కూరగాయలు, ఆయిల్ పామ్ మరియు ఇంకా ఎన్నో రకమైన పంటలు) పరీక్షించించే విధంగా అవకాశం ఉందని వెల్లడించారు ఈ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ కృషి వికాస్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతేకాకుండా ఇక్రిశాట్ వారితో సమన్వయం చేసుకొంటూ ఈ సంస్థ వారికి సూచించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అర్హులైన కళాకారులకు పింఛన్లు: మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను కళారూపాలతో జీవంపోసి భావి తరాలకు అందిస్తున్న వృద్ధ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, కళాకారులు సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని పర్యాట క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రవీంద్రభారతిలో మాజీ ఎంఎల్‌సి మృత్యుంజయం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు శనివారం మంత్రి జూపల్లిని కలిసారు. అర్హులైన వృద్ధ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని, హెల్త్ కార్డులు అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పెన్షన్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దీనిపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు

### మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజలందరూ తమ ఇళ్లను పరిసరా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణతో పాటు తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలపై మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో శనివారం సమిక్షించారు.

ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ కార్పొరేషన్ ఎండి ఫణీంద్ర రెడ్డి, జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, పబ్లిక్‌హెల్త్ అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్ నాయల్, జాయిట్ డైరెక్టర్ శివబాలాజీ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు చికిత్స అందించేందుకు ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని వసతులతో పాటు అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జిహెచ్‌ఎంసి జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో రివ్యూ చేయాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా దృష్టి సారించాలని ,ఐటిడిఎ పీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. .

డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడితే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను ఉపయోగించుకోవాలని ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. అంతకు ముందు రాష్ట్రంలో మే నుంచే వర్షాలు ప్రారంభం కాగా, వాతవరణంలో వచ్చిన ఈ మార్పుల వల్ల మే, జూన్ నుంచే అక్కడక్కడ సీజనల్ వ్యాధులు మొదలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు.గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగీ కేసులు తక్కువగా నమోదయ్యాయని, గ్రేటర్ హైదరాబాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయన్నారు.గతేడాదితో పోలిస్తే టైఫాయిడ్ కేసులు చాలా తక్కువగా నమోదయ్యాయని తెలిపారు.

## ఈ ఏడాది చివరినాటికి 'టిమ్స్' ఆసుపత్రులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరం నలుమూలాల నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రులను ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా అధికారులను ఆదేశించారు. సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులపై ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖల ఉన్నతాధికారులతో మంత్రి శనివారం సచివాలయంలోసమిక్షించారు. ఈ ఏడాది చివరికల్లా హాస్పిటళ్లను ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచనల నేపథ్యంలో హాస్పిటళ్ల నిర్మాణ పనులు, ఎక్విప్‌మెంట్, డాక్టర్లు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులకు మంత్రి దామోదర రాజ నర్సింహా దిశానిర్దేశం చేశారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయడం ద్వారా నిర్ణీత సమయంలో అన్ని పనులూ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లు ప్రారంభించిన రోజు నుండే వైద్య సేవలు అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు.ఈ 4 ఆసుపత్రుల కోసం అధునాతన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని సూచించారు.ఎక్విప్‌మెంట్ కొనుగోలులో సంబంధిత డాక్టర్లు, టెక్నికల్ ఎక్స్‌పర్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# క్షేత్రస్థాయిలో సర్వే చేయించి సమస్యలు పరిష్కరించాలి

### అవినీతిపరులను విదేశాల నుంచి రప్పించకుండా కేంద్రం చేస్తున్నదేంటి?
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్ పూర్తిగా వైరస్ సోకి అనేక భూసమస్యలకు కారణమైందని, అవినీతి, అక్రమాలకు తెరలేపారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చి భూసంబంధిత సమస్యలపై క్షేత్రస్థాయిలో గ్రామం యూనిట్‌గా సర్వేనెంబర్ల వారీగా సర్వే చేయించి రైతుల కష్టాలను తొలగించాల్సిన బాధ్యత నెరవేర్చాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సబ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు. శనివారం కరీంనగర్‌లోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వృత్తి సమస్యగా చెప్పుకునే భూసమస్యలు ఏళ్లుగా అనేక రూపాల్లో లొసుగులు, సమస్యలతో పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. మ్యానువల్ రిజిస్టర్ ఉండాలని చెప్పినా వినకపోవడంతో అధికారులు విచ్చలవిడిగా తప్పులు చేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అటు అధికారులకు, ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారి కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నారు. రైతుల కష్టాలు తీరుస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చట్టాల్లో ఉన్న లొసుగులను ప్రక్షాళన చేస్తూ మాటల్లోనే కాదు చేతల్లో చూపాలని కోరారు. తెలంగాణలో మెట్టప్రాంతాలకు సాగునీరందించడానికి ఎత్తిపోతలే ఏకైక మార్గమని సిపిఐ యాభై ఏళ్లకు పైగా పోరాడుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ కాళేశ్వరంకు అంకురార్పణ చేసినప్పటికీ అందులో అవినీతి చోటు చేసుకుందని, పిల్లర్లు కుంగిపోయాయన్నారు. తెలంగాణకు అవసరమైన సాగు,త్రాగు నీరందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలతో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. 17 ఏళ్లుగా 7500 కోట్లు ఎగ్గొట్టిన విజయ్ మాల్యా, లలిత్ మోడీలకు కేంద్రం వత్తాసు పలుకుతూ విదేశాల్లో విలాసవంతంగా గడుపుతుంటే నోటీసులు పంపినా ఇండియాకు రాకపోతే ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సమాజం కోసం, ప్రజల కోసం, సమతా రాజ్యం కోసం పోరాడుతున్న వారిని హతమార్చడం అన్యాయమని, చత్తీస్ఘడ్, తెలంగాణ సరిహద్దులను చుట్టుముట్టి హతమారుస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందన్నారు. శాంతి చర్చలకు సిద్దమైనప్పటికీ ఎందుకు స్పందించడం లేదన్నారు. సూర్యుడు, చంద్రుడు, దోపిడీ, అణచివేత ఉన్నంత కాలం మావోయిస్టుల సిద్దాంతం ఉంటుందన్నారు.

**అర్హులకు పథకాల అమలుకై దశలవారీ పోరాటాలుః జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు దరిచేరడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ వంటి పథకాలలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ లోపాలు సవరించి అర్హులను ఎంపిక చేయాలని కోరుతూ అన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జిలకు సిపిఐ శ్రేణులు వినతి పత్రాలు అందజేయాలని జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా అనర్హులను ఎంపిక చేసిన పక్షంలో ఈ నెల 15 నుంచి 20 తేదీలలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,సమ్మయ్య, పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్ తదితరులున్నారు.

## గ్రామ పరిపాలన అధికారులను నియమిస్తాం : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తే, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా, ప్రతి రెవెన్యూ గ్రామానికీ ఒక గ్రామ పరిపాలన అధికారిని (జిపిఒ) నియమిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందు కోసం గతంలో విఆర్‌ఒగా పనిచేసినవారికి జిపిఒలుగా అవకాశం కల్పించేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహించామని, ఇందులో 3,454 మంది అర్హత సాధించారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు విఆర్‌ఒ, విఎఒలకు మరోసారి త్వరలోనే అర్హత పరీక్షను నిర్వహించనున్నట్టు మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పరిపాలన అధికారుల నియామకంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్ఒ,విఎఒ వ్యవస్థను రద్దు చేసి, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేస్తే, తమ ప్రభుత్వం సామాన్య ప్రజలకు రెవెన్యూ సేవలను చేరువ చేయడానికి ప్రజా కోణంలో నిర్ణయాలు తీసుకుని, గ్రామ పాలనా అధికారుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని వివరించారు. అందరి సహకారంతో రెవెన్యూ సదస్సులు విజయవంతమయ్యాయని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. భూ భారతి ఫలితాలు ప్రతి పేదవాడికి చేరేలా చట్టం అమలుకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాములు, తదితరులు పాల్గొన్నారు.




## సార్వత్రిక సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో వామపక్ష విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొంటాయని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సార్వత్రిక సమ్మె మద్దతుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో గత 11 ఏళ్ల నుంచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఇప్పుడు కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గానికి అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యారంగంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయడం ద్వారా దేశంలో ఉన్న పేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని, విభజన హామీ చట్ట ప్రకారం తెలంగాణాకి రావాల్సిన విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని, జులై 9 న జరిగే సార్వత్రిక సమ్మెలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్, రాష్ట్ర నాయకులు హరీష్, ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విధానాలు నచ్చనోళ్లు పార్టీని వీడొచ్చు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా తమకు నష్టం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బిజెపి ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలో అందరూ ఒకటేనని, తమ మధ్య అభి ప్రాయ భేదాలు లేవన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయని విమర్శించారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన నిస్సహాయతను ఒప్పుకున్నారన్నారు.

రైతాంగాన్ని మోసం చేస్తే వాళ్ల ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత రేవంత్ రెడ్డికి కనబడటం లేదని, దీనిమీద బిజెపి చర్చకు సిద్ధమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బిజెపి మీద ఆరోపణలు చేసే ముందు వారు పునరాలోచన చేసుకోవాలన్నారు. రాబోయే ప్రభుత్వం బిజెపిదేనని, తెలంగాణలో బిజెపికి ప్రజలు 90 సీట్లు ఇవ్వబోతున్నారని రాంచందర్ రావు జోస్యం చెప్పారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లదేనని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేసి తీరుతామని చెప్పి, 600 రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు.

# ఆధునిక సాంకేతికత పట్ల విద్యార్థుల్లో అవగాహన

### మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం/మంథనిః** ఆధునిక సాంకేతికత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్య, వైద్యం రంగాల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని నమ్మకం కలిగిస్తూ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంథని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 25 మంది కొత్త విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చి చేరడం చాలా సంతోషకరమని అన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి నూతనంగా 10 వేల పైగా ఉపాధ్యాయ పోస్టులను మనం భర్తీ చేశామని అన్నారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేశామని అన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎక్కడ ఎటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నూతన సాంకేతికతను నెర్పించాలనే లక్ష్యంతో మంథని బాలికల పాఠశాలలో 58 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో డిజిటల్ క్లాస్ లను ఏర్పాటు చేయాలని, దీని కోసం సిఎస్ఆర్ నిధులు వినియోగిస్తామని అన్నారు. రోబోటిక్స్, డ్రైవర్ లెస్ కార్లు వంటి సాంకేతిక అంశాలు పిల్లలకు నేర్పాలని అన్నారు. మంథని పట్టణంలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ ఏర్పాటు చేశామని, 30 మంది యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

పాఠశాలలో ఉన్న మిగిలిన క్లాస్ రూమ్ లను కూడా డిజిటల్ చేయాలని,డిజిటల్ పాఠశాలగా మంథని జడ్పిహెచ్ఎస్ ను తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు. పిల్లలు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని, పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించాలని, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్,ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ,సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్ నుండి కెసిఆర్ డిశ్చార్జ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వల్ప అస్వస్థత కారణంగా గురువారం యశోద దవాఖానాలో చేరిన బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు వైద్యుల సలహామేరకు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో సాధారణ వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం, ఆరోగ్యం మెరుగ్గానే వుందని, సోడియం లెవల్స్ కొద్దిగా పెరిగాయని, యశోద వైద్యులు నిర్ధారించిన సంగతి తెలిసిందే. కాగా, వైద్య పరీక్షల్లో భాగంగా, ఒక వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుందని, ఆ తర్వాత, మరోసారి కొన్ని వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వుంటుందని యశోద వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న గురు, శుక్ర వారాల్లో వైద్య పరీక్షల నిమిత్తం మరోసారి యశోద హాస్పటల్ కు అధినేత కెసిఆర్ వెల్లనున్నారు. పూర్తి ఆరోగ్యంతో వున్న కెసిఆర్ వైద్య పరీక్షల నడుమ విరామ సమయంలో, రాష్ట్రంలో సాగునీరు, రైతులు, వ్యవసాయం, తదితర ప్రజా సమస్యల మీద, గత రెండు రోజులుగా పార్టీ సీనియర్లతో చర్చిస్తూ సమాచారం తీసుకుంటూ తదనుగుణంగా సూచనలిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మేడారం మాస్టర్ ప్లాన్‌పై మంత్రి సీతక్క దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడారం మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో శనివారం మేడారం మాస్టర్ ప్లాన్‌పై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, ములుగు కలెక్టర్ దివాకర్ టిఎస్, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, పూజారి సిద్ధబోయిన అరుణ్ కుమార్ మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మేడారం ఆల య ప్రాంగణాన్ని ఆదివాసుల ఆచార సంప్రదాయాలను మరింత చాటి చెప్పేలాతీర్చిదిద్దాలని ఆదేశించారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సలహా సూచనలతో మేడారంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆదివాసీల విశ్వాసాలు, సమ్మక్క సారలమ్మల జీవిత గాథలను ప్రతిబింబించేలా అభివృద్ధి కార్యక్రమాలు ఉండాలన్నారు. సమ్మక్క సారలమ్మల గద్దెలు, ఎంట్రెన్స్, క్యూలైన్ల డిజైన్‌ను సిద్ధంచేసి సమ్మక్క సారలమ్మ పూజారులకు అందజేయాలన్నారు.

ఆదివాసీల ఆచారం ప్రకారం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు వరుసలో ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ సంస్కృతిక శాఖ పరిశోధన గ్రంథాల ఆధారంగా డిజైన్ చేయాలని సూచించారు. జనవరిలో వచ్చే మేడారం జాతర వరకు మేడారం మాస్టర్ ప్లాన్‌లోని ఫస్ట్ ఫేస్ ను పూర్తి చేయాలని అన్నారు.

**ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం**

వర్షాకాలం ప్రారంభమైనందున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కార్యదర్శి శ్రీధర్, డైక్టర్ సృజన, ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు, డిపిఓ, డిఆర్‌డిఓ, సిఈఓలు పాల్గొన్నా రు. గత ఏడాది 6 కోట్ల 90 లక్షల మొక్క లు నాటినట్టు నివేదించారు. నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈసారి గత ఏడాది లక్ష్యానికి మించి ఏడు కోట్ల మొక్కలను నాటాలని నిర్ణయించామన్నారు. నర్సరీలలో దాదాపు తొమ్మిది కోట్ల మొక్కల వరకు సిద్ధం చేశామన్నారు.

తాటి, ఈత, పండ్ల మొక్కలను నాటాలని మంత్రి సూచించారు. చెట్లను ప్రజలకు ఆదాయంగా మారిస్తే వాళ్లే వాటిని సాదుకుంటారని మంత్రి అన్నారు. గ్రామస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. దోమలు, అంటు రోగాలు రాకుండా నీటి నిలువ నివారణకు డ్రైనేజ్ నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు. ఫాగింగ్, బ్లీచింగ్ నిత్యం జరగాలన్నారు. తాగునీరు ట్యాంకులను ప్రతి 10 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం నివేదికను రోజువారీగా నివేదించాలని ఆదేశించారు. మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేయాలని, ఇప్పటివరకు 50 శాతం గుంతల నే పూర్తిచేశారని, యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. స్వచ్ఛతనం పచ్చదనంపై అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. .

## దామోదర్ లొంగిపోతాడని బూటకపు ప్రచారం

### మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీకి చెందిన దామోదర్ లొంగిపోతాడనే వార్తల్లో ఏమాత్రం నిజం లేదని అది బూటకపు ప్రచారం అని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ లేఖను విడుదల చేసారు.దామోదర్ లొంగుబాటు అని జూన్ 1 నుంచి వివిధ పత్రికల్లో,సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదని కొట్టిపారేశారు.అలాగే సీతక్కను హెచ్చరిస్తూ తాము లేఖ విడుదల చేసినట్లు వచ్చిన లేఖ తాము విడుదల చేసింది కాదని జగన్ తేల్చారు. జూన్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర కమిటీ దామోదర్ లొంగిపోతున్నట్లు దిన పత్రికలలో, సోషల్ మీడియాలలో విస్తృత ప్రచారం చేసారని, మీడియా చేసిన ఈ ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదని, పోలీసులే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా దామోదర్ ఎన్కౌంటర్‌లలో చనిపోయినట్లు లేదా లొంగిపోతున్నట్లు అనేక సార్లు ప్రచారం చేశారని, విప్లవ ప్రజలను గందరగోళ పరచడానికి ఈ దుష్ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. ఇటీవల మా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో జూన్ 26న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రిక ప్రకటనకు మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇది ఇలా ఉంటే తెలంగాణాలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ పోలీసులు మాత్రం మావోయిస్టు పార్టీకి ప్రజలు ఎలాంటి సహకారాన్ని అందించకూడదని, సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, మావోయిస్టు పార్టీ వస్తే వెంట నే సమాచారం ఇవ్వాలని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాలలో అమాయక ఆదివాసి ప్రజలను పోలీస్ స్టేషన్‌లకు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: అయిజ**
జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
టెండర్ నోటీస్ నెం. E/01-05/WORKS/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేదీ: 04.07.2025
**పనుల మొత్తం సంఖ్య:** 5 పనులు, **అంచనా కాంట్రాక్ట్ విలువ:** రూ.24.999 లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం:** 04.07.2025న సా.04.30గం.లకు, **బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 14.07.2025న సా.04.30గం.ల వరకు, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్స్ ఆహ్వాన అధికారి, కమిషనర్, అయిజ మున్సిపాలిటీ, జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నెం. 9000863096, 8897509127.
సం/- సిహెచ్.సైదులు, కమిషనర్, అయిజ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 4657-PP/CL/ADVT/1/2025-26, Date: 05-07-2025





## ప్రకృతి గీసిన అద్భుత చిత్రం..



పోర్చుగల్‌లోని ఫిగెరా డాఫోజ్, బ్యుర్కాస్ బీచ్‌లో ఆవిష్కృతమైన అద్భుత దృశ్యం ఇప్పుడు అన్ని మాధ్యమాల్లోనూ వైరల్ అవుతున్నది. సముద్రంపై ఎవరో ఒక మేఘాన్ని అమర్చినట్టు కనిపించిన ఆ దృశ్యాన్ని చూసి అక్కడికి వచ్చిన వారు తొలుత సునామీ సంకేతంగా భావించి భయపడ్డారు. అది కాదని తెలుసుకొని, ఆ అద్భుతాన్ని ఆస్వాదించారు. దీనినే సైన్స్‌లో 'రోల్ క్లౌడ్' అంటారు. ఈ ఫెనామినా వాతావరణంలో కనిపించే అరుదైన, శోభాయమానమైన, గాలి పరిస్థితులకు సంబంధించి ఏర్పడే ఒక ప్రత్యేక మేఘ ఆకృతి. ఇది నలుపు లేదా ముదురు గోధుమ రంగులో ఉండే, సిలిండర్ ఆకారంలో గిరగిర తిరిగే మేఘ సమూహం. సాధారణంగా ఇది భూమికి అతి సమీపంగా ఏర్పడుతుంది. ఇది ఇతర మేఘాలతో కలవని, స్వతంత్ర మేఘం. కొన్నిసార్లు ఇది కిలోమీటర్ల దూరం వరకూ విస్తరిస్తుంది. ఇదిగాలిలో తేలుతూ తిరుగుతుంది కాబట్టే 'రోల్ క్లౌడ్' అన్న పేరు స్థిరపడింది. ఇది వర్షం లేదా తుఫాను తెచ్చే మేఘం కాకపోవచ్చు, కానీ ఈ మేఘం ఏర్పడే సమయంలో వాతావరణంలో మార్పులు తలెత్తుతాయి. సాధారణంగా మానవుని చూపుకు దొరకని మేఘాకృతి. కానీ అది కనిపించినప్పుడు ఆ దృశ్యం ఓ మాయాజాలంలా ఉంటుంది. ఈ మేఘం భూమికి చాలా దగ్గరగా, సుమారుగా 200 నుంచి 1000 మీటర్ల ఎత్తులో ఏర్పడుతుంది. శీతల గాలి ఒకవైపు, వేడి గాలి మరోవైపు ఉధృతంగా ఉన్నప్పుడు, వీటి మధ్య ఏర్పడే గాలుల తారతమ్యం రోల్ క్లౌడ్‌గా ఏర్పడుతుంది. ఉదాహరణకు, ఒక తుఫాను తర్వాత, చల్లని గాలి మట్టికి దగ్గరగా పైకి నెట్టబడుతుంది. అదే సమయంలో, వెనుకవైపు వేడి గాలి పైకి లేచే ప్రయత్నం చేస్తుంది. ఈ రెండింటి మధ్య ఏర్పడే గాలి ప్రవాహం వక్రత, గిరగిర తిరుగుతూ ఉండే మేఘాన్ని సృష్టిస్తుంది. గాలి వివిధ ఎత్తుల్లో వేగం లేదా దిశ మారుతూ ఉంటే, దాన్ని విండ్ షీర్ అంటారు. ఇది రోల్ క్లౌడ్ ఏర్పడటానికి మరో ముఖ్యమైన కారణం. సాధారణ మేఘం త్రికోణాకృతిలో ఉంటే, రోల్ క్లౌడ్ సిలిండర్ ఆకారంలో ఉంటుంది. సాధారణ మేఘం కదులుతుందిగానీ తిరగదు. రోల్ క్లౌడ్ సుడిగాలి మాదిరి గిరిగిర తిరుగుతూ కదులుతుంది. మేఘాలు వర్షానికి సంకేతాలు. కానీ, రోల్ క్లౌడ్‌ను వర్షానికి సూచనగా భావించడానికి వీల్లేదు. రోల్ క్లౌడ్ ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కనిపించినట్టు వార్తలు ఉన్నా యి. అయితే, ఆస్ట్రేలియాలోని బుర్కెటౌన్ ప్రాంతంలో ప్రతి ఏడాది సెప్టెంబర్–అక్టోబర్ మధ్య 'మార్నింగ్ క్లౌడ్' ఏర్పడుతుంది. ఇది అత్యంత ప్రసిద్ధమైన రోల్ క్లౌడ ఫార్మేషన్. దీని పొడవు 1000 కి.మీ.లకు పైగా ఉండవచ్చు.

## ఎగిరే రోబోట్..




ఇటలీ శాస్త్రవేత్తలు రూపొందించిన 'ఐరాన్ క్యూబ్3' అనే ఫ్లయింగ్ హ్యూమనాయిడ్ రోబోట్ అందరినీ ఆకట్టుకుంటున్నది. దీని వీడియోలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రపంచంలో మొదటి జెట్‌పవర్డ్ ఫ్లయింగ్ హ్యూమనాయిడ్ ఇది. నాలుగు చిన్న జెట్ ఇంజన్లను దీనికి అమర్చారు. సుమారు 3 గడుగుల ఎత్తు, 22 కిలోల బరువుగల ఈ రోబోట్‌ను చిన్న పిల్లవాడిని పోలిన ముఖంతో రూపొందించడం మరింత ఆకర్షణీయంగా ఉంది. పొలీటెక్నిక్ ఆఫ్ మిలాన్‌లో విండ టన్నెల్ పరీక్షలు, స్టాన్‌ఫోర్డ్‌లో డీప్‌లెర్నింగ్ ఆధారిత నియంత్రణతో ఇది పని చేస్తుంది. అయితే, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఎఐ) దీనిని నియంత్రించదు. మానవ నియంత్రణతో కూడిన ప్రయోగాలు పూర్తయ్యాయి. జనోవా ఎయిర్‌పోర్ట్‌లో భవిష్యత్తులో పెద్ద ఎత్తున క్లిష్ట ప్రయోగాలు జరగనున్నాయి. ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు లేదా ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ఉపయోగించడానికి వీలుగా 'ఐరాన్ క్యూబ్3'ను ఇటలీ శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. ప్రమాదకరమైన ప్రాంతాలను పరిశీలించడం, అవసరమైతే అక్కడికి వెళ్లడం, ఆణువాయి లేదా రసాయన లీకేజీ ఉన్న ప్రదేశాల్లో సేవలు అందించడం వంటి పనులకు దీనిని ఉపయోగిస్తారు. ఇప్పటి వరకూ హ్యూమనాయిడ్ రోబోట్ నెమ్మదిగా నిడిచేవిగానే ఉన్నాయి. ఇటీవల గంతులు పెట్టగల రోబోట్‌లను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇప్పుడు ఏకంగా ఎగిరే రోబోట్‌ను సిద్ధం చేస్తున్నారు. శరీర భాగాల కదలిక, బరువు కేంద్రం మార్పులు, వాతావరణ అల్పశక్తి వంటి అనేక సవాళ్లను అధిగమించి ఇది ప్రయోగం విజయవంతం కావడం విశేషం.

## ఏది నిజం?



హత్యానేరం ఎదుర్కొంటున్న ఇద్దరు పిల్లల తల్లి ఎరిన్ పాటర్సన్ కేసుపై ఇప్పుడు ఆస్ట్రేలియాలో జోరుగా చర్చ కొనసాగుతున్నది. ఆమె ఉద్దేశపూర్వకంగానే ముగ్గురిని చంపేసిందని కొంత మంది ఆరోపిస్తుంటే, ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని మరికొందరు భావిస్తున్నారు. కేసు వివరాల్లోకి వెళితే, 2023 జులై 29న ముగ్గురి మృతికి కారణమైందంటూ ఎరిన్‌పై కేసు నమోదైంది. అంతకు ముందు, తన ఇంట్లో విందుకు మాజీ భర్త సైమన్, అతని తల్లిదండ్రులు డాన్ పాటర్సన్, గెయిల్ పాటర్సన్‌లను ఆహ్వానించింది. సైమన్ ఈ ఆహ్వానాన్ని మన్నించలేదు. కాగా, అతని తల్లిదండ్రులతోపాటు, చిన్నమ్మ హీథర్ విల్కిన్సన్ కూడా విందుకు వెళ్లింది. విందులో ప్రత్యేక డిష్‌గా ఆమె మష్రూమ్స్ (పుట్టగొడుగులు) కూరను వడ్డించింది. దానిని తిన్న వెంటనే అస్వస్తతకు గురైన డాన్, గెయిల్, హీథర్, ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందారు. మాజీ భర్తను, అతని తల్లిదండ్రులను కూడా చంపాలనే ఉద్దేశంతోనే ఆమె విషపూరితమైన పుట్టగొడుగులతో వంటకాన్ని తయారుచేసిందని ప్రాసిక్యూషన్ అభియోగం. కానీ, ఎంతో ఖర్చుపెట్టి తాను విందు ఇచ్చానని, తాను ఉపయోగించిన మష్రూమ్స్‌లో విషం ఉందని ఊహించలేదని ఎరిన్ వాదిస్తున్నది. ఏది నిజమో కోర్టే తేల్చాలి.

## కర్నాటకలో 'జంపింగ్ స్పైడర్'



కర్నాటకలో అత్యంత అరుదైన 'జంపింగ్ స్పైడర్' జాతిని కనుగొన్నారు. దీనికి స్పార్టేయస్ కరిగిరిగా పేరు పెట్టారు. మన దేశంలో స్పార్టేయస్, సోనోయిటా సాలీడు జాతులు ఉంటాయి. స్టాల్టిసిడే కుటుంబానికి చెందిన స్టార్టేనే ఉపకుటుంబంలో ఒక భాగం. కాగా, గతంలో ఆగ్నేయాసియా, ఆఫ్రికా ఖండాల్లో మాత్రమే స్టార్టేయస్ జాతి కనిపించేది. అయితే, క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరించిందని శాస్తవేత్తలు అంటున్నారు. వారి వాదనకు భారత్‌లో ఆ జాతి ఆనవాళ్లు ఉండడం బలాన్ని చేకూరుస్తున్నది. కర్నాటకలో గుర్తించిన 'జంపింగ్ స్పైడర్' జాతికి అది కనిపించిన కరిగిరి (ఎలిఫెంట్ హిల్) పేరుమీద 'స్పార్టేయస్ కరిగిరి' పేరు ఖరారు చేశారు. వివిధ రకాల సాలెపురుగు జాతులు అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా అంతటా, ఉష్ణమండల ప్రాంతాలలో సమృద్ధిగా కనిపిస్తాయి. కాగా, సాల్టిసిడే అనేది ఆర్డర్ అరానియా, క్లాస్ అరాక్నిడా కింద 5,000లకుపైగా గల జాతులతో అతిపెద్ద సాలీడు కుటుంబం. ఇవి చిన్న, అస్పష్టమైన సాలెపురుగులు. సాధారణంగా వీటి పరిమాణం 0.5 అంగుళాల కంటే తక్కువే. వేటాడడానికి, వెళ్లాల్సిన దిశను నిర్ధారించుకోవడానికి వీటికి తలకు ముందు, వెనుక భాగాల్లో మొత్తం ఎనిమిది కళ్లు ఉంటాయి. ఈ జాతి స్పైడర్లకు పరిగెత్తడం, ఎక్కడం, దూకడం చేయగల సామర్థ్యం ఉంటుంది. ఇది సురక్షితమైన ల్యాండింగ్ కోసం సిల్క్ డ్రాగ్‌లైన్‌ను ఉపయోగిస్తుంది. ఇవి చీమలు, కీటకాలను వేటాడతాయి. సాధారణంగా ఇవి మాంసాహార జీవులు. కొన్ని జాతులు మాత్రం పుప్పొడి, తేనె కూడా ఆహారంగా గ్రహిస్తాయి. ఇవి కండరాల ద్వారా కాకుండా హైడ్రాలిక్ లెగ్ ప్రెజర్ ద్వారా శరీర పొడవుకు 50 రెట్లు ఎక్కువ దూకగలుతాయి. మన దేశంలో జంపింగ్ స్పైడర్స్‌లో 'యూయోఫ్రిన్ ఓమ్నిసుపర్టస్ భూమికి సుమారు 22,000 అడుగుల ఎత్తులో, ఎవరెస్టు శిఖరంపై కనిపించింది. అంత ఎత్తయిన ప్రాంతాల్లో కనిపించిన సాలీడు జాతి అది ఒక్కటే.

— బిఎస్‌ఎస్ మైత్రేయి

# ట్రంప్ కలల బిల్లు నెగ్గింది

## సంపన్నులకు మోదం.. సామాన్యులకు ఖేదం

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పచ్ఛిమితవాద ఎజెండాతో కూడిన బిల్లుకు శుక్రవారం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లభించింది. దాని ముద్దుపేరు ''బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'' (బిబిబి). 900 పేజీలున్నందున అది పెద్ద బిల్లు కిందే లెక్క. ఎవరికి అందమైనది? వచ్చే 10 సంవత్సరాల్లో 4.5 ట్రిలియన్ డాలర్ల పన్నుల తగ్గింపు ఈ బిల్లులో ప్రధానాంశం. ఇది ట్రంప్ సంపన్న తరగతులకు తలపెట్టిన మేలు. రెండోవైపున, 118 లక్షలమంది ఒబామా కేర్‌గా ప్రసిద్ధి పొందిన వైద్య బీమా– మెడికైడ్‌ను కోల్పోతారు. చట్టవిరుద్ధ వలసలు నిరోధించేందుకు కెనడా, మెక్సికో సరిహద్దు వెంట గోడ నిర్మాణం, అక్రమ వలసదారులను బలవంతంగా బయటకు నెట్టివేసే కార్యక్రమాలకు పుష్కలంగా నిధులు లభ్యమవుతాయి. అలాగే అమెరికన్ అన్నార్థులకు ఇచ్చే ఫుడ్ స్టాంప్స్ కోత పడతాయి. ట్రంప్ నిర్ణయించిన పన్ను రేట్లను శాశ్వతం చేయటం ఈ బిల్లులోని చిత్రం. మెడికైడ్ కోత వల్ల ఆరోగ్య బీమా ఆదాయంపై ఆధారపడిన గ్రామీణ ఆసుపత్రులు వేలసంఖ్యలో మూతపడతాయి. ప్రజలు కూడా బీమా మొత్తాన్ని పంచుకునే పద్ధతిలో మెడికైడ్ వర్తింపజేయబడుతుంది. రక్షణ వ్యయ భారీగా పెరుగుతుంది. ఈ బిల్లువల్ల బడ్జెట్‌లోటు 3.3 లక్షల కోట్ల డాలర్లు పెరుగుతుందని అంచనా. అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) సమర్థకులు అనగా ట్రంప్ భజనపరులు కేరింతలు కొడుతున్నారు.

ట్రంప్ ఒకరకంగా రిపబ్లికన్ సెనేటర్లను, ప్రతినిధులు సభ సభ్యులను బెదిరించి రెండు సభల్లోనూ అతి స్వల్ప ఆధిక్యతతో బిబిబికి ఆమోదం పొందారు. అమెరికా స్వాతంత్ర దినోత్సవ వేళ ట్రంప్ దానిపై సంతకం చేసి రాజముద్ర వేశారు. బిల్లును గతవారమే ప్రతినిధులు సభ ఆమోదించింది. అక్కడ నుండి సెనేట్‌కు వెళ్లింది. ఉపాధ్యక్షుడు వాన్స్ ఓటుతో తప్ప బిల్లుకు ఆమోదం లభించదా అనే ఊహాగానాల మధ్య 100 మంది సభ్యులు గల సెనేట్ 51–49ఓట్లతో ఆమోదముద్ర వేసింది. ట్రంప్ ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్‌కు తిరిగి వచ్చిన బిల్లును 218–214ఓట్లతో సభ ఆమోదించింది. బిల్లును వ్యతిరేకిస్తే మీ సీట్లకు గ్యారంటీ లేదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రిపబ్లికన్ పార్టీ సభ్యులిరువురు బిల్లుకు వ్యతిరేకంగా డెమొక్రటిక్ పార్టీ సభ్యులతోపాటు ఓటు చేశారు.

ప్రజాపక్షం
06-07-2025, ఆదివారం

ట్రంప్‌కు అధ్యక్ష ఎన్నికల్లో భారీగా డబ్బు ఖర్చుపెట్టిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను ట్రంప్ అధ్యక్ష భవనంలో కూర్చొబెట్టి ప్రభుత్వ వృథా వ్యయాన్ని తగ్గించే ఆలోచనలు చేయటానికి ఒక డిపార్టుమెంటునే సృష్టించాడు. ఆయన ప్రభుత్వ వ్యయంలో పలు విధాల కోతలు పెట్టి ప్రపంచానికి, అమెరికన్ ఉన్నత విద్యాలయాలకు, పలు డిపార్టుమెంటులకు తీవ్రమైన చేటు చేశాడు. వేలాది ఉద్యోగాలు ఊడగొట్టాడు. అయితే ప్రభుత్వ వ్యయాన్ని భారీగా పెంచే 'బిబిబి'ని మస్క్ వ్యతిరేకించాడు. డోజ్‌కు రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ట్రంప్, మస్క్ గుత్త పెట్టుబడిదారీ తెగకు చెందినవారే అయినప్పటికీ వారిద్దరి అహంభావాలు ఘర్షణ పడ్డాయి. బిబిబిని ఓడించేందుకు ఎంతదూరమైనా వెళతానని మస్క్ అనగా, మస్క్ ను దేశం నుంచి వెళ్లగొడతానని (అతను దక్షిణాఫ్రికా దేశం నుండి వలస వచ్చిన వ్యక్తి) ట్రంప్ హెచ్చరించాడు. బిల్లు పాసైంది. ట్రంప్ కల చట్టమైంది. మస్క్‌ను ఏమి చేస్తాడో చూద్దాం.

ఈ బిల్లును డెమొక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికవర్గాన్ని, బలహీనులను దోచుకుని సంపన్నుల బొక్కసాలు నింపే ఈ బిల్లు డెమొక్రాట్లను ఏకం చేసింది. ''ట్రికిల్ డౌన్ క్రూరత్వం''గా అభివర్ణించారు. ట్రంప్ బిల్లును ''బిగ్ అగ్లీ బిల్లు''గా పేర్కొన్న సెనేటర్ జెఫ్రీన్ బిల్లును వ్యతిరేకిస్తూ 8 గంటల 44నిమిషాలపాటు ప్రసంగించి రికార్డు నెలకొల్పారు. ప్రస్తుతం సామాన్య అమెరికన్‌లు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలను తొలగిస్తున్న ట్రంప్ బిల్లు పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, 2026లో జరిగే మధ్యంతర ఎన్నికలపై దీని ప్రభావం ఉంటుందని డెమొక్రాట్‌లు అంటున్నారు. ఈ బిల్లు ఆర్వాత ట్రంప్ మరింత నిరంకుశుడిగా మారతాడా లేక వచ్చే ఎన్నికల పోరాటంలో జాతీయ స్థాయిలో డెమొక్రాట్లను ఎదుర్కొనేందుకు తనను తాను సంస్కరించుకుంటాడా? డెమొక్రాటిక్ పార్టీ, సరైన నాయకత్వంతో ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధం కాకపోతే ట్రంప్ పట్ల ఉన్న ప్రజావ్యతిరేకను సైతం వారు ఉపయోగించుకోలేరు.

# మత వ్యవస్థ విధించే ఉద్దేశ్యపూర్వక వ్యూహం



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం ముంగిట రాజ్యాంగ పీఠికలో ''సెక్యులర్'', ''సోషలిస్టు'' పదాల చేర్పును సమర్థిస్తూ భారతీయ గణతంత్ర మౌలిక స్వభావాన్ని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఇందిరాగాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగ (42వ సవరణ) చట్టం, 1976 ద్వారా ఈ పదాలను రాజ్యాంగంలో ప్రవేశపెట్టింది. ఈ పదాలు పదే పదే మితవాద శక్తుల రాజకీయ, న్యాయపరమైన దాడులకు గురవుతున్నాయి. ఈ చేర్పులను సవాలు చేస్తూ వేసిన అనేక పిటిషన్‌లను ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరిస్తూ, ఆ పదాల చేర్పును సమర్థిస్తూ, 1949 నవంబర్ 26న ఆమోదింపబడిన అసలు ప్రవేశికలో లేనంత మాత్రాన వాటి చేర్పును చెల్లుబాటు కాకుండా చేయలేమని స్పష్టం చేసింది.

ఈ న్యాయపరమైన పునరుద్ఘాటన న్యాయవ్యవస్థ నుంచి వెలువడిన శక్తివంతమైన సంకేతం. కానీ, భారతీయ జనతా పార్టీ (బిజెపి) సైద్ధాంతిక మాతృక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) మరోసారి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన భావనపైనే తాజా దాడిని ప్రారంభించింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ప్రవేశిక నుంచి 'సెక్యులర్', 'సోషలిస్టు' పదాలను తొలగించాలని బహిరంగంగానే డిమాండ్ చేశారు. ఆయన ఆలోచన ప్రకారం అవి డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ దృక్కోణానికి వ్యతిరేకం.

భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ మరో అడుగు ముందుకేసి ఆ పదాల చేర్పును ''సనాతన స్ఫూర్తిని అపవిత్రం'' చేయడమేనని పేర్కొన్నారు. దేశంలోని కొన్ని అత్యున్నత స్థానాల నుంచి వచ్చిన ఇలాంటి ప్రకటనలు యాదృచ్ఛికమేమి కాదు. ఇది మేధోపరమైన చర్చ కాదు. ఇది భారతదేశ ఆధునిక, బహుళ, ప్రజాస్వామిక గణతంత్రానికి చట్టబద్ధతను ఉపసంహరించుకునే ఉద్దేశ్యపూర్వక రాజకీయ వ్యూహం. మతతత్వ, నిమ్నోన్నత వ్యవస్థను ప్రవేశపెట్టే చర్య.

### ప్రధాన స్రవంతికి తీసుకువచ్చే ఎజెండా

రాజ్యాంగ రూపకల్పన సందర్భంలో లౌకిక రాజ్యాన్ని రాజ్యాంగ పరిషత్తు దృఢంగా, ఏకగ్రీవంగా సమర్థించింది. ఏ ఒక్క సభ్యుడు సైతం మతరాజ్యం కోసం వాదించలేదు. భారతదేశం అనే భావన, వలస వాద విభజించు – పాలించు అనే మతతత్వ రాజకీయాలను తిరస్కరిస్తూ భిన్నత్వంలో ఏకత్వమనే పునాదులపై నిర్మితమైంది. నేడు ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి ప్రభుత్వం ఆ ఏకాభిప్రాయాన్ని ధ్వంసం చేసి, హిందూ రాజ్యం అనే భావనను రుద్దేందుకు నిర్విరామంగా పని చేస్తోంది. ఈ ఎజెండాను బహుకొద్ది మంది వాదన నుంచి రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాముడిని రాజ్యంతో, దేవుడిని దేశంతో ముడిపెడుతూ రెచ్చగొట్టే ప్రకటన చేశారు. ఈ రకమైన మతం, రాజ్యం కలయికకు వ్యతిరేకంగా రాజ్యాంగ నిర్మాతలు కచ్చితమైన హెచ్చరికలు చేశారు. రాజ్యాంగ మౌలిక వ్యవస్థలో లౌకికవాదం భాగమని సుప్రీం కోర్టు రూలింగ్‌కు ఇది ప్రత్యక్షంగా విరుద్ధమైనది.

> భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ మరో అడుగు ముందుకేసి ఆ పదాల చేర్పును ''సనాతన స్ఫూర్తిని అవిపత్రం'' చేయడమేనని పేర్కొన్నారు. దేశంలోని కొన్ని అత్యున్నత స్థానాల నుంచి వచ్చిన ఇలాంటి ప్రకటనలు యాదృచ్ఛికమేమి కాదు. ఇది మేధోపరమైన చర్చ కాదు. ఇది భారతదేశ ఆధునిక, బహుళ, ప్రజాస్వామిక గణతంత్రానికి చట్టబద్ధతను ఉపసంహరించుకునే ఉద్దేశ్యపూర్వక రాజకీయ వ్యూహం. మతతత్వ, నిమ్నోన్నత వ్యవస్థను ప్రవేశపెట్టే చర్య.

### నాయకులు, వారి హెచ్చరికలు

జాతీయ నాయకుల హెచ్చరికలు నేడు మరింత శక్తిమంతంగా ప్రతిధ్వనిస్తున్నాయి. 1931లో ప్రాథమిక హక్కులపై మహాత్మాగాంధీ ప్రవేశపెట్టిన తీర్మానంలో మతపరమైన అంశాలలో రాజ్యం తటస్థంగా ఉండాలని నొక్కి చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సైతం ఇదే వైఖరిని ప్రతిబింబిస్తూ ''రాజ్యము ఏ మతాన్ని రాజ్య మతంగా గుర్తించరాదు'' అని పేర్కొన్నారు. ప్రత్యేకించి గమ్మత్తయిన విషయమేమిటంటే స్వాతంత్ర్యోద్యమాన్ని బహిష్కరించిన, లౌకిక జాతీయవాదాన్ని వ్యతిరేకించిన హిందూ మహాసభ కూడా 1944లో హిందుస్థాన్ ఫ్రీ స్టేట్ చట్టంలో ఇలాంటి నిబంధనను చేర్చింది.

రాజ్యంగ సభ చర్చల్లో భారతదేశ వ్యవస్థాపక తరం ఉద్దేశ్యాలు మరింత స్పష్టంగా ఉన్నాయి. 1947 ఆగస్టు 27న గోవింద్ వల్లభ్ పంత్ సూటి ప్రశ్నను ఇలా సంధించారు – ''మీకు నిజమైన జాతీయ లౌకిక రాజ్యం కావాలా లేదా మతత్వ రాజ్యం కావాలా?'' అని. భారతదేశం మతరాజ్యమైతే, అది హిందూ రాజ్యమే అవుతుందని, అప్పుడు అలాంటి రాజకీయాల నుంచి మినహాయించబడిన వారి స్థితి, భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. 1949 నవంబర్ 21న జస్పాత్ రాయ్ కపూర్ మతం వ్యక్తిగతమైన అంశంగా ఉండాలని గాంధీ స్పష్టం చేసినట్లు చెప్పారు. 1949 నవంబర్ 22న బేగం ఐజాజ్ రసూల్ మాట్లాడుతూ సెక్యూలరిజం అనేది రాజ్యాంగంలోని ''అత్యంత విశిష్ట అంశం'' అని , అది ''స్వచ్ఛంగా, రక్షింపబడుతుందని'' ఆకాంక్ష వ్యక్తం చేశారు. 1949 అక్టోబర్ 14న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ స్వేచ్ఛా భారత రాజ్యాంగం 'ఎలాంటి మత ఆధారిత నిబంధనతోనైనా స్వరూపం కోల్పోకుండా'' చేస్తామని జాతికి మరోసారి విశ్వాసాన్ని కల్పించారు. నవంబర్ 23న టి.జె.ఎం. విల్సన్ భారత లౌకిక స్వభావంపై బెదిరింపు మేఘాలు ఇప్పటికే ఏర్పడుతున్నట్లు హెచ్చరించారు. ఈ హెచ్చరికలు భయకంపితాలు కావు, కానీ మనకాలంలో లోతుగా ఆలోచించాల్సిన, మాట్లాడాల్సిన అత్యవసరాన్ని సూచిస్తున్నాయి.

సోషలిస్టు ధోరణిలోని రాజ్యాంగాన్ని అపకీర్తి పాలు చేసి, నిర్మూలించే విధంగా ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో ప్రచారం సాగుతున్నది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలోని నాలుగవ భాగంలో పొందుపరిచిన దేశ విధానాలకు సంబంధించిన ఆదేశిక సూత్రాలకు సోషలిస్టు ఆదర్శాలే మూలమని స్పష్టంగా చెప్పారు.

సుప్రీంకోర్టు తాజా తీర్పు కూడా ప్రవేశికలోని ''సోషలిస్టు'' పదాన్ని సంక్షేమ రాజ్యం పర్యాయ పదమని సరైన రీతిలో వ్యాఖ్యానించింది. ఈ దృష్టి కోణం కుల దోపిడి, భూమి రాహిత్యం, పేదరికం, వివక్షల నిర్మూలనకు సామాజిక, ఆర్థిక రూపాంతరం జరగాలనే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బలమైన వాదనను ప్రతిధ్వనిస్తుంది. సోషలిజం అంటే సమానత్వం, న్యాయం కోసం పరిస్థితులను సృష్టించడమే తప్ప విదేశీ సిద్ధాంతాన్ని దిగుమతి చేసుకోవడం కాదు. అది స్వాతంత్ర్య పోరాట వాగ్దానాలను సాకారం చేసుకోవడం. 'ఒకవేళ హిందూ రాజ్యం వాస్తవరూపం దాల్చితే, అది ఈ దేశానికి ఘోరమైన విపత్తు అనడంలో సందేహం లేదు.. హిందూరాజ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నివారించాలి'' అని బి.ఆర్.అంబేద్కర్ తన రచన ''పాకిస్థాన్ లేదా భారత విభజన''లో అత్యంత సందేహాతీత హెచ్చరిక చేశారు.

ఆ పరిస్థితి ఇప్పుడు మనపై పొంచి ఉంది. ఆధునిక భారతీయ గణతంత్ర నిర్మాణం విధ్వంసం చేయాలనే దీర్ఘకాలిక పథకంలో భాగంగానే రాజ్యాంగం నుంచి ''సెక్యులర్'', ''సోషలిస్టు'' పదాలను తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్ చేస్తున్నది. దానిపై వ్యవస్థీకృతమైన మతాధిపత్య, నిమ్నోన్నత కుల వ్యవస్థ, మార్కెట్ ఛాందసం, రాజకీయ నిరకుశవాద నూతన వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నది.

### ప్రతిఘటించాల్సిన అవసరం

దీనిని ప్రజా చైతన్యం, న్యాయ సవాలు, రాజకీయ సమీకరణ, ప్రజల ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా తప్పనిసరిగా ప్రతిఘటించాలి. రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదు. అది స్వాతంత్ర్య పోరాట కఠోర పరీక్ష నుండి ఉద్భవించిన రాజకీయ, సామాజిక, నైతిక ఒడంబడిక. అది భారతదేశం అందరికీ చెందుతుందనే లెక్కకు అందని అమరుల, విప్లవకారుల, రాజ్యాంగకనిబద్ధుల కలల నుంచి నిర్మితమైంది. నేడు లౌకికవాదం, సామ్యవాదాన్ని పరిరక్షించడమంటే, స్వయంగా ప్రజాస్వామ్యాన్ని దానంతట అదే రక్షించుకోవడం. ఇది విశ్వాసం, కులం, వర్ణం, లింగంతో సంబంధం లేకుండా గౌరవం, సమానత్వం, స్వాతంత్ర్యంతో జీవించేందు కోసం ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించడం కోసం. గణతంత్రాన్ని తప్పనిసరిగా రక్షించుకోవాలి. పోషించాలి. అవసరమైతే దానిని అంతర్గతంగా వినాశనం చేయాలనుకునే వారిని నుంచి కాపాడుకోవాలి. ఈ బాధ్యత నెరవేర్చేందుకు ధైర్యంతో, స్పష్టతతో, సామూహిక నిబద్ధతతో మనమంతా నిలబడదాం.

(ది హిందూ సౌజన్యంతో..)

# హైదరాబాద్ సే ఖర్గే సవాల్

హైదరాబాద్ నగరంలో శనివారం జరిగిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో అఖిల భారత కాంగ్రెస్ సమితి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అనేక సైద్ధాంతిక విషయాలకు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించి ప్రస్తావించిన అంశాలు ఆలోచనలను రేకెత్తించాయి. అందులో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలను ఇబ్బంది పెట్టే కీలకమైన అంశం కూడా ఉంది. మేధావులారా నాలుగు మాటలు చెబుతానని అంటూ బిజెపి పార్టీ రాజ్యాంగం (నిబంధనావళి)లోని అంశాలను సభలో ఖర్గే వినిపిస్తూ – ''భారతదేశ రాజ్యాంగం పట్ల, చట్టం ద్వారా స్థాపించబడిన విధంగా, సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం సిద్ధాంతాల పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను పార్టీ (బిజెపి) కలిగి ఉంటుంది'' అని అన్నారు. సోషలిజం, సెక్యులరిజం పదాలపై మీకు(బిజెపికి) ద్వేషమే ఉంటే, మీ పార్టీ రాజ్యాంగంలో ఆ పదాలను ఎందుకు రాసుకున్నారంటూ హైదరాబాద్ వేదికగా ఖర్గే చేసిన విమర్శ బిజెపిని ఇరకాటంలో పెట్టేదే. చేసేదొకటి, చెప్పేదొకటి అనే కాషాయ పార్టీ తీరును ఆయన ఎండగట్టిన తీరు వివేచనాపరులను ఆలోచింపజేసేలా ఉన్నది.


సెక్యులరిజం, సోషలిజం సిద్ధాంతాల పట్ల నిజమైన విశ్వాసం, విధేయత కలిగి ఉంటామని స్వయంగా బిజెపి నిబంధనావళిలో ఉండడం సభలో కూర్చున్న వారిని ఒకింత ఆశ్చర్యపరిచింది. ఇది బిజెపి నిబంధనావళి పుస్తకంలోని రెండవ అధికరణలో పార్టీ లక్ష్యాలు అనే అంశం కింద పేర్కొనబడింది. అది పార్టీ పేరు, ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, నియమాలు, సంస్థాగత నిర్మాణం, కమిటీలు వగైరా వగైరాలను వివరించే 24 పేజీల పుస్తకం. ఖర్గే ఈ అంశాన్ని ఇప్పుడు ప్రస్తావించడానికి కారణం ఉన్నది. సోషలిజం, సెక్యులరిజం పదాల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఏడెనిమిది నెలల క్రితమే స్పష్టత ఇచ్చినప్పటికీ, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలు పదే పదే ఆ అంశాన్నే ఉద్దేశ్యపూర్వకంగా రేకెత్తిస్తున్నారు. వారం, పది రోజుల క్రితం ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే ఆ పదాలు తొలగించాలనడం ద్వారా చర్చను తిరిగి మొదటికి తీసుకువచ్చినట్లయింది. బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రెండు రోజుల క్రితం మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆ రెండు పదాలు లేవని, ఎమర్జెన్సీ సమయంలోనే 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడినవని చర్చను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయన గతంలో కూడా ఈ వ్యాఖ్యలు చేసిన వారే.



ఇటీవల కాలంలో ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వ్యూహాత్మకమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 25న ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిజెపి ఆ ఘట్టాన్ని 'సంవిధాన్ హత్యా దివస్' పేరిట దేశవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించింది. దీని వెనుక ప్రధాన లక్ష్యం ఎమర్జెన్సీ విధించిన మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నిరంకుశ పాత్రను గుర్తు చేయడమే. అంతకుమించిన ఉద్దేశం కూడా అందు లో దాగుంది. ఇటీవల పాకిస్థాన్‌పై పై చేయి సాధించిన తరువాత, ఆకస్మికంగా కాల్పుల విరమణ చేసి 'ఆపరేషన్ సిందూర్'కు విరామాన్ని ప్రకటించింది ప్రభుత్వం. ఈ చర్య కరుడుగట్టిన బిజెపివాదులనే కాకుండా, భారతీయులందరినీ తీవ్ర నిరాశకు గురిచేసింది. అదే సమయంలో 1971లో యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించి, తూర్పు భాగాన్ని బంగ్లాదేశ్‌గా స్థాపించడంలో నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్ర సోషల్ మీడియాలో విస్తృత ప్రచారమైంది. నాటి అమెరికా బెదిరింపులకు లొంగని ఆమె ధీరత్వానికి సంబంధించిన వీడియోలు కూడా వైరలయ్యాయి. దీంతో చరిత్ర అం తంతగా తెలిసిన నేటి తరానికి అకస్మాత్తుగా ఇందిరాగాంధీ వీరోచిత గాథ పరిచయమవడంతో, ఆమె పట్ల మునుపెన్నడూ లేని సానుకూలత వ్యక్తమైంది. దీనికి కౌంటర్‌గానే అన్నట్లుగా ఈసారి ఎమర్జెన్సీ వార్షికోత్సవం సందర్భంగా నాటి ఘట్టాలకు బిజెపి భారీ ప్రచారమే కల్పించినట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. ప్రత్యర్థి శిబిరం నుంచి వచ్చిన రాజకీయ దాడికి మల్లిఖార్జున ఖర్గే దీటైన ప్రతిదాడి చేసినట్లే. కాంగ్రెస్ మాజీ ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ప్రతిష్ఠ మసకబార్చే యత్నాలను గట్టిగానే తిప్పికొట్టారు. తమ నిబంధనావళిలో ఉన్న సెక్యులరిజం, సోషలిజం పదాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ ముఖ్య నేతలు, కేంద్రమంత్రుల పదే పదే ఎందుకు మాట్లాడుతున్నారనే ప్రశ్నకు జవాబిచ్చుకోవాల్సిన పరిస్థితికి బిజెపిని నెట్టివేశారు ఖర్గే.

కాంగ్రెస్ పార్టీ అధికారం కాలంలో హైదరాబాద్‌లో సుమారు 50 ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మోదీ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి, హైదరాబాద్‌కు ఏమిచ్చిందని వేసిన ప్రశ్న కూడా విలువైనదే. కాంగ్రెస్ నేతృత్వంలో పదకొండేళ్ళ క్రితం తెలంగాణను ఏర్పాటు చేయడమే కాదు, గతంలో సైతం అభివృద్ధిలో భాగంగా అనేక సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేసామని కాంగ్రెస్ ఘనతను స్థిరపరిచే ప్రయత్నం చేశారాయన. కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై ఎదురుదాడిలో భాగంగా ఇరుగు పొరుగు దేశాల మధ్య భారతదేశం ఒంటరైన విదేశాంగ విధానం వైఫల్యాన్ని సాకల్యంగా వివరించారు. పార్టీ అంతర్గత సమావేశాలలో కూడా క్రమశిక్షణ రేఖను దాటకూడదనే హెచ్చరికను గట్టిగానే చేసారు. మొత్తానికి పంచాయతీ ఎన్నికలకు ముందు ఖర్గే హైదరాబాద్ పర్యటన కాంగ్రెస్ దిగువ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, బిజెపిని బోనులో నిలబెట్టడంలో విజయవంతం అయినట్లేననే అభిప్రాయం కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది.

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం

**న్యూఢిల్లీ :** పూంచ్ సురాన్‌కోట్ తహసీల్ దార్ ప్రాంతంలో పోలీసులు, సైన్యం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌లో భద్రతా దళాలు పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ రహస్య స్థావరం నుంచి మూడు హ్యాండ గ్రెనేడ్‌లు, బుల్లెట్లు, ఛార్జ్ లీడ ఇనుప రాడ వైర్ కట్టర్, కత్తి, పెన్సిల్ సెల్, లైటర్ సహా ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఉగ్రవాదుల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించిన అనంతరం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఇదిలా ఉండగా.. ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య ఇటీవల ఉధంపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బంసత్‌గఢ్‌లో పారిపోయిన ఉగ్రవాదుల కోసం పోలీసులు, బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతం, సహజంగా ఏర్పడిన గుహలు ఉండడంతో ఉగ్రవాదులు ఇక్కడే దాక్కొని ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. దాంతో ఉగ్రవాదుల ఏరివేత భద్రతా బలగాలకు సవాల్‌గా మారుతున్నది.

### అమెరికాలో నీరవ్‌మోదీ సోదరుడు

# నేహాల్ మోదీ అరెస్ట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000 కోట్ల మోసం కేసులో నిందితుడు



**న్యూఢిల్లీ :** పరారీలో ఉన్న వజ్రాల దొంగ వ్యాపారి నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికా అధికారులు అరెస్ట్ చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) నుంచి వచ్చిన అప్పగింత అభ్యర్థనలను పరిగణనలోనికి తీసుకుని అమెరికా అధికారులు ఈ అరెస్ట్ చేసినట్లు చెప్పారు. శుక్రవారం నాడు నేహల్ మోదీని కస్టడీకి తీసుకుని భారత్‌కు సమాచారం అందించారని వారు చెప్పారు. ఈ కేసు విచారణకు సంబంధించి జులై 17 తదుపరి తేదీగా ఉన్న నేపథ్యంలో నేహల్ బెయిల్ కోరే అవకాశం ఉంది కానీ అమెరికా ప్రాసిక్యూటర్లు దీనిని వ్యతిరేకిస్తారని వారు వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సంయుక్తంగా నేహల్ మోదీ విషయమై అప్పగింత అభ్యర్థన చేశాయి. 2002 మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) లోని సెక్షన్ 3 కింద మనీల్యాండరింగ్ అభియోగం, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 120మ (నేరపూరిత కుట్ర), 201 (అదృశ్యం) కింద నేహల్ మోదీపై అమెరికా అధికారులచే అభియోగాలు మోపబడ్డాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000కోట్ల మోసం కేసులో 46 ఏళ్ల నేహల్ మోదీ నిందితుడని అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. ఈ మోసానికి ఇద్దరు సోదరులు, వారి మామ మెహుల్ చోక్సీ కుట్రపన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. బెల్జియంలోని అంట్వెర్ప్‌లో పుట్టి పెరిగిన నేహల్ దీపక్ మోదీ ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ భాషల్లో నిష్ణాతుడు. ఆయన భారత్‌కు వాంటెడ్‌గా ఉన్నాడు. లండన్‌లోని జైలులో ఉన్న తన సోదరుడు నీరవ్ మోదీ తరపున నేరాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అక్రమంగా బదిలీలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలున్నాయి. భారతదేశం అభ్యర్థన మేరకు యుకె నుంచి అప్పగించే ప్రక్రియలను ఎదుర్కొంటున్నాడు. భారత చట్టాలను ఉల్లంఘించి, షెల్ కంపెనీలు, విదేశీ లావాదేవీల ద్వారా పెద్దమొత్తంలో అక్రమ నిధులను దాచిపెట్టడానికి, బదిలీ చేయడానికి నేహల్ సహాయం చేశాడని అధికారులు తెలిపారు.ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లో నేహల్ పేరును చేర్చారు. తెలిసి మరీ సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా నాశనం చేశాడని, నీరవ్ మోదీ అక్రమ కార్యకలాపాలకు సహాయపడ్డాడని నేహల్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు చేసింది.పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) మోసం వెలుగులోకి వచ్చిన తర్వాత నీరవ్ సన్నిహితుడు, ఎగ్జిక్యూటివ్ మిహిర్ ఆర్.భన్సాలీతో కలిసి నేహల్ దుబాయ్ నుండి 50కిలోల బంగారం, గణనీయమైన నగదును దొంగిలించాడని, అధికారుల ముందు తన పేరును వెల్లడించొద్దని డమ్మీ డైరెక్టర్‌ను ఆదేశించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది.

# 'ఎజెఎల్ సంస్థ'ను ఎఐసిసి రక్షించేందుకే ప్రయత్నించింది



నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ న్యాయవాది ఆర్‌ఎస్. చీమా వాదన

ఆస్తులను విక్రయించే ప్రయత్నం చేయలేదని ఈడి అభియోగాలపై స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్‌గాంధీ తరఫున ప్రాతినిథ్యం వహించిన సీనియర్ న్యాయమూర్తి ఆర్‌ఎస్. చీమా శనివారం తన వాదనలు వినిపిస్తూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యమైన అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) ఆస్తులను ఎఐసిసి విక్రయించే ప్రయత్నం చేయలేదని, ఆ సంస్థను కాపాడే ప్రయత్నం మాత్రమే ఎఐసిసి చేసిందని వాదించారు. ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ముందు చీమా తన వాదనను ప్రారంభిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దాఖలు చేసిన అభియోగాలను ఆక్షేపించారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, దివంగత కాంగ్రెస్ నేతలు మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే, శామ్ పిట్రోడా, ఒక ప్రైవేట్ కంపెనీ, యంగ్ ఇండియన్ నేషనల్ హెరాల్డ్ న్యూస్ పేపర్‌ను పబ్లిష్ చేస్తున్న అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.2,000 కోట్లకు పైగా ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర , మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడి వారందరినీ నిందించింది. 'అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ యొక్క మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంఒఎ)ను ఇవ్వడానికి వారు ఎందుకు సిగ్గుపడ్డారో నా స్నేహితుడు (ఈడి తరపు న్యాయవాది) నాకు చెప్పగలరా ?' అని న్యాయవాది చీమా ప్రశ్నించారు. ఎజెఎల్ 1937లో జవహర్‌లాల్ నెహ్రూ, జెబి.కృపలానీ, రఫీ అహ్మద్ కిద్వాయి, ఇతరులచే స్థాపించబడిందని తెలియజేశారు. 'భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) విధానమే అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) విధానం అని ఎజెఎల్ యొక్క ఎంఒఎ చెప్పింది. స్వాతంత్ర్య కాలానికి ముందు అది ఎప్పుడూ ఒక కమర్షియల్ సంస్థగా లేదు. మేం (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) కూడా ఆ సంస్థను స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించాం. ఎజెఎల్‌కు ఇవ్వబడిన రుణాన్ని స్వాధీనం చేసుకోవడం అనేది సమస్యకాదు. సమస్యల్లా స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని పునరుద్ధరించడమనేదే. అది పట్టాలపైకి వచ్చేలా చూడటమే. అమ్మకాల నుంచి లాభాలు పొందడం కోసం ఎఐసిసి ఏనాడూ ఎదురు చూడలేదు. ఇది గర్భస్థ శిశువును మెల్లకన్నుతో చూడటం లాంటిది' అని చీమా చెప్పారు. యంగ్ ఇండియన్‌లో గాంధీలకు 76శాతం షేర్ ఉన్నదని, రూ.90 కోట్ల రుణానికి బదులుగా ఎజెఎల్ ఆస్తులను మోసపూరితంగా ఆక్రమించిందని ఈ కేసులో ఇడి అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. అంతకుముందు శుక్రవారం సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సోనియాగాంధీ తరపున తన వాదనలను వినిపించారు. జులై 3న రాజు చార్జిషీట్‌లోని అభియోగాల అంశంపై వాదనలు వినిపిస్తూ గాంధీలే యంగ్ ఇండియన్ యొక్క 'ప్రయోజనకర యజమానులు'అని చెప్పారు. ఇతర షేర్‌హోల్డర్ల మరణం తర్వాత పూర్తి నియంత్రణను పొందిందన్నారు. గాంధీలు,ఇ తరులకు వ్యతిరేకంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) లోని సెక్షన్లు 3 (మనీ ల్యాండరింగ్), 4 (మనీల్యాండరింగ్‌కు శిక్ష)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలుచేసిన చార్జిషీట్‌లో నమోదు చేశారు. చార్జిషీట్‌లో సుమన్ దూబే, శామ్ పిట్రోడా, సునీల్ భండారీ,యంగ్ ఇండియన్, డోటెక్స్ మెర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లను కూడా పేర్కొన్నారు.

### 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపై...

# కలిసొచ్చిన ఉద్ధవ్, రాజ్ థాక్రేలు

ప్రతిపక్షాల విజయోత్సవ ర్యాలీలో ప్రసంగాలు



**ముంబయి :** మహారాష్ట్రలో ఆశ్చర్యకరమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రెండు దశాబ్దాల క్రితం విడిపోయిన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు తొలిసారిగా ఒకే వేదికను పంచుకున్నారు. రాష్ట్రంలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా భావిస్తూ శనివారం ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలతో పాటు వారి కుటుంబాలు కూడా పాల్గొన్నాయి. కాగా, విజయోత్సవ ర్యాలీలో ఉద్ధవ్ థాక్రే ప్రసంగిస్తూ తామంతా ఐక్యంగా ఉండేందుకే ఒకే వేదికను పంచుకున్నామని చెప్పారు. రానున్న పురపాలక ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ఉద్ధవ్ సంకేతాలిచ్చారు. తాము ఐక్యంగా ఉండి మున్సిపల్ ఎన్నికలు విజయం సాధిస్తామని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి అధికారాన్ని చేజిక్కించుకుంటామని పేర్కొన్నారు. దీంతో సభికులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అయితే వేదికపై ఉద్ధవ్ ఒక్కరే కూర్చుని ఉండగా, రాజ్ థాక్రే మాట్లాడుతూ శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే, ఇంకా ఇతరులు బంధువులను ఒకచోట చేర్చడం చేయలేక పోయిన పనిని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేయగలిగారని రాజ్ వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన త్రిభాషా సూత్రం మహారాష్ట్ర నుండి ముంబయిని వేరు చేసే యత్నమేనని ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు అన్నారు. ప్రతిపాదిత నిరసన ప్రదర్శన గురించి ఆలోచించడం వల్లే ప్రభుత్వం వివాదాస్పద జిఆర్‌లను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మనం విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకుంటున్నామని చెప్పారు. భాషా వివాదం తర్వాత రాజకీయాల్లో ప్రభుత్వ తదుపరి చర్య ప్రజలను కులం ఆధారంగా విభజించడమేనని రాజ్ అన్నారు. 'విభజించి పాలించడమే బిజెపి కుట్ర' అని ఆయన అన్నారు. తన కొడుకుపై ప్రతిపక్షాలు 'కాన్వెంట్ విద్య' అంటూ చేసిన విమర్శలను తోసిపుచ్చిన రాజ్, దక్షిణ భారతదేశంలోని చాలా మంది రాజకీయ నాయకులు, సినీ తారలు ఇంగ్లీష్ పాఠశాలల్లో చదువుకున్నారని, కానీ తమిళం, తెలుగు భాషల పట్ల గర్వంగా ఉన్నారని అన్నారు. 'బాలాసాహెబ్ థాక్రే ఇంగ్లీష్ పాఠశాలలో చదువుకున్నారు, ఒక ఇంగ్లీష్ వార్తాపత్రికలో పనిచేశారు, కానీ అతను మరాఠీ హోదా విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు' అని రాజ్ థాక్రే స్పష్టం చేశారు. బిజెపి పితామహుడు ఎల్ కె అద్వానీ కూడా కాన్వెంట్ పాఠశాలలో చదివారు, కాబట్టి అతని హిందూత్వాన్ని ప్రశ్నించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజలపై హిందీని రుద్దడానికి వారు అనుమతించరని ఉద్ధవ్ అన్నారు. మరాఠీ, మహారాష్ట్రపై ఎవరూ చెడు దృష్టి పెట్టకూడదని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి రూపొందించిన 'బతింగే తో కతింగే' (విభజించబడిన మనం పడిపోతాం) నినాదం హిందువులను, ముస్లింలను విభజించడానికి ఉద్దేశించబడిందని ఆయన అన్నారు. అయితే, వాస్తవానికి బిజెపి దీనిని మహారాష్ట్రీయులను విభజించడానికి ఉపయోగించిందని, బిజెపిని 'రాజకీయాల్లో వ్యాపారులు' అని ఆయన పేర్కొన్నారు. 'మరాఠీ మనుష్యులు (ప్రజలు) తమలో తాము పోట్లాడుకుంటే... ఢిల్లీ బానిసలు మమ్మల్ని పాలించడం ప్రారంభించారు' అని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరైన కార్యక్రమంలో 'జై గుజరాత్' నినాదం చేసినందుకు షిండేను కూడా ఆయన తీవ్రంగా విమర్శిస్తూ, నిరాశావాద చర్యగా అభివర్ణించారు. ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే, ఇతర నాయకులు ఈ కార్యక్రమానికి హాజరైనప్పటికీ, రాజ్, ఉద్ధవ్ మాత్రమే వేదికపై ఆశీనులపై ప్రసంగించారు. వేదిక వెలుపల ఉత్తేజకరమైన వాతావరణంలో వేలాది మంది ఎంఎన్‌ఎస్, శివసేన (యుబిటి) కార్మికులు జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ఉమ్మడి ర్యాలీ వేదికకు ఉత్సాహంగా కవాతు చేశారు.

# బిహార్‌లో ప్రముఖ వ్యాపారి కాల్చివేత..



**పాట్నా:** ప్రముఖ బీహార్ వ్యాపారి గోపాల్ ఖేమ్కాను అతని నివాసం వద్ద గుర్తుతెలియని వ్యక్తి కాల్చిచంపడం కలకలం సృష్టించింది. బైక్ మీద వచ్చిన దుండగుడు ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు శనివారంనాడు తెలిపారు. శుక్రవారం రాత్రి 11.40 గంటలకు గాంధీ మైదాన్ ప్రాంతంలో ఈ హత్య జరిగినట్టు చెప్పారు. ఘటన అనంతరం స్థానిక పోలీస్, పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. బైక్‌పై వచ్చిన అగంతకుడు ఈ కాల్పులు జరిపినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పాట్నా సెంట్రల్ ఎస్పీ దీక్ష తెలిపారు. ఘటనా స్థలిలో బుల్లెట్ స్వాధీనం చేసుకున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా, ఆరేళ్ల క్రితం ఖేమ్కా కుమారుడిని కూడా హాజీపూర్‌లో క్రిమినల్స్ పొట్టనపెట్టుకున్నారని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శనివారంనాడు సమీక్షించారు. డిజిపి వినయ్ కుమార్, ఇతర పోలీసు సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఖేమ్కా కాల్చివేత ఘటన కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమాల్లో శాంతి భద్రతల పరిరక్షణ అనేది చాలా కీలకమని, నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని నితీష్ హెచ్చరించారు. ఖేమ్కా హత్య ఘటనపై సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖేమ్కాపై కాల్పులు జరిపిన 2 గంటల తర్వాత పోలీసులు ఘటనా స్థలికి వచ్చారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయి తే ఈ ఆరోపణలు డిజిపి విజయ్‌కుమార్ తోసిపుచ్చారు. రాత్రి 11.40 గంటలకు కాల్పులు జరిగాయని, ఖేమ్కాను కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేర్చడానికి 30–35 ని మిషాలు పట్టిందని, ఆసుపత్రి అధికారులు సమాచారం ఇవ్వగానే 12.30 గంటలకు ఘటనా స్థలికి పోలీసు సిబ్బంది చేరుకున్నారని చెప్పారు. ఖేమ్కా హత్యకు వ్యాపారపరమైన శత్రుత్వం కారణం కావచ్చన్నారు. కాగా, పాట్నాలోని పోలీస్ స్టేషన్‌కు కొద్ది దూరంలోనే ఖేమ్కాను దుండగులు కాల్చి చంపారని, బిహార్‌లో ప్రతినెలా వందలాది మంది వ్యాపారులు హత్యకు గురవుతున్నారని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తీవ్ర విమర్శలు చేశారు. ఇంత జరుగుతున్నా దీనిని ఆటవిక రాజ్యం అని ఎవరూ అనకుండా మీడియాను తమ వైపు తిప్పుకుని ప్రభుత్వ ఇమేజ్ పెంచుకునేందుకు తహతహలాడుతున్నారంటూ నితీష్ సర్కార్‌ను తప్పుపట్టారు.

## ఒకదానికొకటి ఢీ కొన్న ఐదు బస్సులు..

36 మంది అమర్‌నాథ్ యాత్రికులకు గాయాలు



**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీర్ రాంబన్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న ఐదు బస్సులు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌నాథ్ యాత్రికులతో శనివారం ఉదయం జమ్ములోని భగవతి నగర్ నుంచి దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాం బేస్ క్యాంప్‌కు దాదాపు ఐదు బస్సులు బయల్దేరాయి. ఈ క్రమంలో జమ్ముశ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి చందర్‌కూట్ సమీపంలోకి రాగానే బస్సులు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కనీసం 36 మంది అమర్‌నాథ్ యాత్రికులు గాయపడ్డారు. ఓ బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## యుపిలో ఘోర రోడ్డు ప్రమాదం

8 మంది మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



**సంభల్ :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంభల్ జిల్లాలో ఓ కారు అదుపుతప్పి గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కారులో వరుడు, అతనితో పాటు మరో 9 మంది హర్ గోవిందాపూర్ గ్రామం నుంచి సిర్టౌల్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు అదనపు ఎస్‌పి అంకూర్తి శర్మ తెలిపారు. అయితే జాన్వాయి ప్రాంతంలో ఉన్న జనతా ఇంటర్ కాలేజీ వద్ద వారి వాహనం అదుపుతప్పి గోడను ఢీకొట్టిందన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారన్నారు. క్షతగాత్రులైన ఐదుగురిని జాన్వాయి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారని అదనపు ఎస్‌పి చెప్పారు. గాయాలైన ఇద్దరు అలీగఢ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. దేవా అనే వ్యక్తి పరిస్థితి తీవ్రంగా ఉండగా, హిమాన్షికి ప్రమాదం తప్పిందన్నారు. కాగా, అతివేగవం వల్లే కారు అదుపుతప్పిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో కారులో పది మంది ఉన్నారన్నారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

# ట్రంపునకు మోదీ తలవంచుతారు



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాలపై రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. గడువులోపు భారత్ ఒప్పందం కుదుర్చుకోదని వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటంచిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ స్పందించారు. భారతదేశం అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిగా ఖరారు చేసిన తర్వాత, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే అంగీకరిస్తుందని గోయల్ పేర్కొన్నారు. అయితే పియూష్ గోయల్ తన గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని, ట్రంప్ సుంకాల గడువుకు మోదీ చాలా సునాయాసంగా తలవంచుకుంటారని, తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని రాహుల్‌గాంధీ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య శత్రుత్వాలను ఆపుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేసిన వాదనలను ఎదుర్కోకుండా మౌనంగా ఉండటం పట్ల కాంగ్రెస్ ప్రధానమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉభయపక్షాలు ప్రయోజనం పొందినప్పుడు, గెలుపు ఒప్పందంలో ఉన్నప్పుడు మాత్రమే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధ్యమవుతాయని, అమెరికాతో ప్రతిపాదిత తాత్కాలిక వాణిజ్య ఒప్పందం గురించి అడిగినప్పుడు గోయల్ విలేకరులతో అన్నారు. జాతీయ ప్రయోజనం ఎల్లప్పుడూ అత్యున్నతంగా ఉండాలని, దానిని దృష్టిలో ఉంచుకుని ఒప్పందం కుదుర్చుకుం టే, భారతదేశం ఎల్లప్పుడూ అభివృద్ధి చెందిన దేశాలతో వ్యవహరించడానికి సిద్ధంగా ఉం టుందన్నారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ట్రంప్ జూలై 9 వరకు గడువు విధించారు.

# దయచేసి న్యాయవ్యవస్థ ఖ్యాతిని కాపాడండి

కొందరు జడ్జీల మొరటు ప్రవర్తనపై ఫిర్యాదులు

సత్యానికి కట్టుబడాలని సిజెఐ పిలుపు

**ముంబయి :** రాజ్యాంగానికి, చట్టానికి చెప్పే భాష్యం సమాజానికి అనుగుణంగా, ఆచరణాత్మకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. బోంబే హైకోర్టు ముంబయిలో శనివారం నిర్వహించిన అభినందనసభలో గవాయ్ మాట్లాడారు. ఇటీవల కొంతమంది తోటి న్యాయమూర్తుల మొరటు ప్రవర్తనపై తనకు ఫిర్యాదులు అందాయని చెపుతూ, న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడేవిధంగా ప్రవర్తించాలని కోరారు. ''దయచేసి ఇంత సర్వోన్నతమైన వ్యవస్థకు భంగం కలిగించేవిధంగా, అపఖ్యాతి కలిగించే విధంగా వ్యవహరించకండి, అనేక తరాల న్యాయమూర్తులు, న్యాయవాదులు అంకితభావంతో, చిత్తశుద్ధితో, సత్యానికి కట్టుబడి పని చేసి కఠోరశ్రమతో నిర్మించిన న్యాయవ్యవస్థ ఖ్యాతిని కాపాడండి'' అని విజ్ఞప్తి చేశారు.

గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఆయన ప్రస్తావిస్తూ, ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల పూర్వరంగంలో సందర్భానుసారంగా రాజ్యాంగానికి లేదా ఏ చట్టానికైనా భాష్యం చెప్పాలని న్యాయమూర్తులకు హితబోధ చేశారు. 'న్యాయమూర్తులు చెప్పే భాష్యం సమాజానికి తగినట్టుగా ఉండాలి, ప్రసుత సమాజానికి అనుగుణంగా ఆచరణాత్మకంగా ఉండాలి'' అన్నారు. న్యాయమూర్తులు తమ వివేకజ్ఞానాలకు, తమ వృత్తిపై చేసిన ప్రమాణాలకు చట్టానికి అనుగుణంగా పనిచేయాలని అంచనావేస్తారు తప్ప ఒక విషయాన్ని చూసి చలించిపోయి ఎప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదు'' అని చెప్పారు. ఒన న్యాయమూర్తి సంబంధిత అంశం నుండి తన ఆలోచనలను వేరు చేయాలి. తర్వాత జరిగే పరిణామాలను విస్మరించాలి, చట్టానికి, విచక్షణకు అనుగుణంగా ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ప్రవర్తించాలి'' అని చెప్పారు. కొందరు తోటి న్యాయమూర్తుల మొరటు ప్రవర్తనపై ఫిర్యాదువు ఇటీవల వచ్చాయని చెప్పారు. ఒక న్యాయమూర్తిగా ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటలవరకూ పనిచేయడం సమాజానికి సేవ చేయడానికి ఒక మంచి అవకాశం, దేశానికి సేవ చేయడానికి ఒక అవకాశం అన్నారు. న్యాయమూర్తిగా ప్రమాణం చేసినప్పటి ప్రమాణాలకు, సత్యానికి కట్టుబడి చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.

న్యాయమూర్తుల నియామకాల గురించి ఆయన ప్రస్తావిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయవ్యవస్థ తన స్వతంత్రతతో రాజీపడబోదని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులోగానీ, హైకోర్టులలోగానీ నియామకాలు చేసేటప్పుడు కొలీజియం న్యాయమూర్తులుగా నియమితులు కావడానికి కావాల్సిన యోగ్యతలను, గుణగణాలను పరిగణనలోకి తీసుకుంటుందని అందుకు పూర్తి భరోసాను పాటిస్తుందని, దేశ భిన్నత్వాన్ని, సమ్మిళిత తత్వాన్ని దృష్టిలో పెట్టుకుంటుందన్నారు. ఒక న్యాయవాదిగా, మొదటిసారి న్యాయమూర్తిగా తాను ఒకప్పుడు పనిచేసిన బోంబే హైకోర్టుపై ప్రశంసలు కురిపించారు. ప్రజలు బోంబే హైకోర్టు ఇచ్చే తీర్పులపై ప్రశంసలు కురిపించినప్పుడు తనకు ఎంతో గర్వంగా ఉంటుందన్నారు.

## 12 దేశాలకు రేపు ట్రంప్ టారిఫ్ లేఖలు

**వాషింగ్టన్ :** అమెరికా విధించిన టారిఫ్‌ల వాయిదా గడువు ముగింపు దశకు రావడంతో దాదాపు 12 దేశాలకు టారిఫ్ లేఖలు పంపేందుకు వైట్‌హౌస్ యంత్రాం గం సన్నాహాలు పూర్తిచేసింది. లేఖలపై సంతకం చేశాననీ, సోమవారంనాడు ఈ లేఖలను పంపుతామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. ఐతే ఏ దేశాలకు ఈ లేఖలు పంపుతారన్న విషయం సోమవారంనాడే ప్రకటిస్తారు. అమెరికాతో వాణిజ్య వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై గడచిన ఏప్రిల్ నెలలో సార్వత్రికంగా పెంచిన 10 శాతం టారిఫ్‌లను సంప్రదింపు చర్యలకు వీలుగా జులై 10వ తేదీ వరకూ వాయిదా వేశారు. ఈ గడువు దగ్గర పడటంతో టారిఫ్ లేఖలను ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం చేస్తున్నది. తైవాన్ నుండి యూరప్ వరకూ ఉన్న పలు దేశాలపై పది నుండి 70 శాతం మేరకు ట్రంప్ వాణిజ్య సుంకాలను అదనంగా విధించారు. దీంతో ఇప్పటికే పాకిస్థాన్ వాణిజ్య కార్యదర్శి జవద్ పాల్ నాయకత్వాన ఒక ప్రతినిధి బృందం వాషింగ్టన్ చేరుకుంది. గార్మెంట్స్, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రధానంగా 29 శాతం టారిఫ్‌లను తిరిగి విధించకుండా నివారించేందుకు ఈ బృందం చర్చలు ప్రారంభించింది. భారతదేశం కూడా ఈ నిర్ణీత గడువులోపు ఆదరాబాదరాగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు చర్చలు ముమ్మరంగా కొనసాగుతుండగా, రైతులకు తీవ్రనష్టం జరగే ప్రమాదం ఉన్నందువల్ల ఒప్పందం చేసుకోకూడదని దేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

టారిఫ్‌ల అమలుకు పొడిగించిన గడువుతేదీ ముగిసే జులై తొమ్మిదోతేదీన భారత్‌లో సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాలు కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చాయి. కాగా ట్రంప్ టారిఫ్‌లు పెంచినవెంటనే గడచిన ఏప్రిల్ నెలలో భారత్ సహా దాదాపు 50 దేశాలు టారిఫ్‌లపై సమీక్షకు అమెరికాను ఆశ్రయించాయని అమెరికా జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ కెవిన్ హాస్సెట్ చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని సమర్థించుకున్నారు.

**CHANGE OF NAME**

I, **GANDRATHI SRINIVAS,** S/o Yadagiri, H.No: 1-8-440/1, Balasamudram, LIC office, Hanamkonda town, Dist : Hanamakonda,TG. I have changed my Son name from **GANDRATHI ROMIK** (old name) to **GANDRATHI AADHVIK** (New name) for all purpose

**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా వేలేరు మండలములోని పీచర గ్రామ శివారులోని వేములపల్లికి చెందిన **గాలి శ్రీకాంత్, గాలి కుమార్**ల తండ్రి గాలి ఐలయ్య గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత మే నెలలో శ్రీకాంత్, కుమార్‌లు పీచర నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఖాతా నెంబర్ : 552. పట్టా పాసు బుక్కు నెం: **T21100030359**కు సంబందించిన డాక్యుమెంట్స్ పోయినవి. సంబంధిత డాక్యుమెంట్స్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు

**గాలి శ్రీకాంత్, గాలి కుమార్,**

తండ్రి ఐలయ్య,

ఇ.నెం. 7142, గ్రామం పీచర, వేములపల్లి,

వేలేరు మండలం, హనుమకొండ జిల్లా,

పిన్: 506145,

**ఫోన్ నెం. 8790557229, 9959919653.**



# జనరల్
STATE & REGIONAL NEWS

## రంగంలోకి దిగిన స్వాట్ బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగర పోలీసులు మొట్ట మొదటి సారిగా స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్ (ఎస్‌డబ్ల్యూఎటి) ను ప్రారంభించారు. ఈ బృందంలో 35 మంది మహిళా పోలీసులు ఉన్నారు. వీరికి క్రావ్ మా, నిరాయుధ పోరాటంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ స్వాట్ బృందం ప్రధానంగా ధర్నాలు, ర్యాలీలు, ఇతర బహిరంగ సభలలో మహిళా నిరసనకారులను సమర్థవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేయబడింది. హైదరాబాద్ నగరంలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలు, పండుగల సమయంలో కూడా వీరిని మోహరించనున్నారు. రెండు నెలల ప్రత్యేక శిక్షణ తర్వాత, స్వాట్ బృందాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ అధికారికంగా ప్రారంభించారు. స్వాట్ బృందం తమ కొత్త యూనిఫాం ధరించి, తెలంగాణ సచివాలయం వద్ద మొదటిసారి విధుల్లో మోహరించింది. హైదరాబాద్ సిటీ పోలీసులకు ధర్నాలు, ర్యాలీలు జన సమూహాల్లో మహిళలను నియంత్రించడంలో ఈ స్వాట్ బృందం చాలా ఉపయోగపడుతుంది.



## డెడ్ అయిన పార్టీ డెడ్‌లైన్ పెట్టడం విడ్డూరం

### అసెంబ్లీలో చర్చకు భయమెందుకు? : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు అర్థం కానట్లు ఉందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజా భవన్‌లో మంత్రి సీతక్క మీడియతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?, సమస్యలపై చర్చించేందుకు భయమెందుకు?అని కెటిఆర్‌ను మంత్రి నిలదీశారు. డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరమన్నారు. ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్‌లో చర్చించడానికి కాదు, అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ చేస్తే ప్రెస్ క్లబ్‌కు రమ్మనడం ఏంటని ప్రశ్నించారు. 72 గంటల డెడ్‌లైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని కెటిఆర్‌పై మంత్రి సీతక్క విమర్శలు వర్షం కురిపించారు. కెటిఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఏం మా ట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదన్నారు. నీ సొంత చెల్లే (కెటిఆర్‌ను ఉద్దేశించి).. నిన్ను నాయకుడిగా గుర్తించడం లేదన్నారు. కెటిఆర్ తమ నాయకుడే కాదని ఆమే ఓ ఇంటర్యూలో చెప్పారని సీతక్క అన్నారు.

## 'రైల్ రోకో'కు భీం ఆర్మీ మద్దతు..

### ఎమ్మెల్సీ కవితను కలిసి సంఘీభావం ప్రకటించిన నాయకులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ పాలకులు దిగొచ్చే విధంగా 'రైల్ రోకో' నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఉద్యమంలో పౌర సమాజం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ,విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టడం ఒక్కటే మార్గమని అన్నారు. తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న తలపెట్టిన 'రైల్ రోకో'కు భీం ఆర్మీ నాయకులు సంఘీ భావం ప్రకటించారు. భీంఆర్మీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆయాజ్ ఆధ్వర్యంలో నాయకులు కవితను హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో శనివారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా భీం ఆర్మీ చీఫ్, ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ 'రైల్ రోకో'కు మద్దతు ప్రకటించారని, రైల్ రోకోలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని సయ్యద్ అలీ ఆయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత మాట్లాడుతూ రిజర్వేషన్ల పెంపు బిల్లులను రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించినప్పటికీ నెలల తరబడి పెండింగ్ లో పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, హన్మంతరావు, సురేశ్ కుమార్, యూపీఎఫ్ కో ఆర్డినేటర్ ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన మాజి ఎంఎల్‌సి రామచంద్రారావుకు బిజెపి మేడ్చల్ జిల్లా నాయకురాలు ఎన్ హైమారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాద్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## మరో 40 ఏళ్లు జీవించాలనుకుంటున్నా : దలైలామా



**న్యూఢిల్లీ :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఇటీవల ప్రకటన రాగా, ఇప్పుడు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు తాను మరో 30–40 ఏళ్లు జీవించాలని ఆశిస్తున్నట్లు శనివారం చెప్పారు. ఆదివారం తన 90వ పుట్టిన రోజును దలైలామా జరుపుకోనున్నారు. అయితే తాజాగా ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. ఆ సమయంలో తన మనసులో మాటను దలైలామా బయటపెట్టారు. తనకు అవలోకితేశ్వరుడి ఆశీస్సులు ఉన్నాయని, తనకు అందుకు సంబంధించిన స్పష్టమైన సంకేతాలు, సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. 'అనేక ప్రవచనాలను పరిశీలిస్తే, నాకు అవలోకితేశ్వరుడి ఆశీస్సులు ఉన్నాయని భావిస్తున్నాను. ఇప్పటి వరకు నా వంతు కృషి నేను చేశాను. ఇంకా నేను 3040 ఏళ్లు జీవించాలని ఆశిస్తున్నాను. మీ ప్రార్థనలు ఇప్పటి వరకు ఫలించాయి. చిన్నప్పటి నుంచి నాకు, అవలోకితేశ్వరుడికి బలమైన సంబంధం ఉందని అనిపిస్తోంది. నేను ఇప్పటి వరకు బుద్ధ ధర్మానికి, టిబెట్ ప్రజల కోసం సేవ చేయగలిగాను. ఇంకా 130 సంవత్సరాలకు పైగా జీవించాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. తాను స్వదేశాన్ని దేశాన్ని కోల్పోయి భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నానని, అయినప్పటికీ టిబెట్‌లోని ప్రజల కోసం చాలా మేలు చేయగలిగాను అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైనా నాయకుడు మావో జెడాంగ్‌ను తాను కలుసుకున్న విషయాన్ని దలైలామా గుర్తు చేసుకున్నారు. 'మావో జెడాంగ్ 'మతం ఒక విషం' అని వ్యాఖ్యానించారు. కానీ నేను దానికి ప్రతిస్పందించలేదు. అతను మంచిని చెడుగా చూశాడు. కానీ అతనిపై నాకు కరుణ కలిగింది. తరువాత నేను నెహ్రూను కలిశాను. నా జీవితాంతం మతం పట్ల ఆసక్తి ఉన్నవారిని, ఏమాత్రం ఆసక్తి లేనివారిని చాలా మందిని కలిశాను' అని దలైలామా పేర్కొన్నారు.

## సమ సమాజ నిర్మాణమే ఎర్రజెండా లక్ష్యం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ





**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నారాయణపేట జిల్లా రెండవ మహాసభలు మరికల్ మండలంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ మహాసభ ప్రారంభంలో ఎర్రజెండా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ మనదేశంలో ఏర్పడి 100 సంవత్సరాలు అయ్యిందని అప్పటి నుండి ఇప్పటివరకు ఎప్పుడు అధికారంలో లేకున్నా నిరంతరం పేద ప్రజల పక్షాన ప్రజలకు అండగా నిలబడి వారికి జరిగే అన్యాయాల పైన దోపిడీల పైన వెట్టి చాకిరి విముక్తి పైన అనేక పోరాటాలు చేసిందన్నారు. మన దేశంలో చాలా పార్టీలు ఉన్నాయి కానీ పేద ప్రజల పక్షాన నిలబడే పార్టీ ఏదైనా ఉంది అంటే అది భారత కమ్యూనిస్టు పార్టీ అని అయిన అన్నారు. అదేవిధంగా మన దేశంలో బిజెపి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛ లేకుండా పోయింది. ఈ దేశంలో ఉన్న మేధావులకు గాయకులకు కవులకు ప్రశ్నించే హక్కు లేకుండా గొంతు నొక్కడమే ప్రధానపనిగా ఈ బిజెపి ప్రభుత్వం చేస్తుంది. ఈ దేశంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేదు విద్యార్థుల గురించి మనదేశంలో ఒక యూనివర్సిటీ కూడా తీసుకురాలేదు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఈ ప్రభుత్వం సంవత్సరానికి 20 వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయింది. అధికారం వచ్చిన మొదట్లో ప్రపంచంలో ఉన్న నల్ల ధనం తీసుకొని పేదలకు పంచుతానని చెప్పిన నరేంద్ర మోడీ పేద ప్రజలకు జన్ధన్ ఖాతా ఓపెన్ చేయించి ఒక్క రూపాయి కూడా పేద ప్రజల ఖాతాలో వేయకుండా తిరిగి వారి నుండే సంవత్సరానికి బ్యాంకు చార్జెస్ పేరుపైన 300 నుంచి 500 వరకు కోతలు విధిస్తున్నదని ఆయన అన్నారు. భారతదేశంలో అనేక మతాలకు చెందిన వారు జీవిస్తున్నారు. వాళ్ల మధ్యన ఏనాడు మత ఘర్షణలు లేవు కానీ ఈ బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి హిందూ మతం పేరు పైన మత రాజకీయాలు చేస్తూ ఎన్నికలలో నెగ్గుతూ వస్తుంది ఇది ప్రధానంగా బిజెపి ప్రధాన ఎన్నికల స్టంట్ మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామన్న మాటను ఇప్పటిదాకా నెరవేర్చుకోలేదు అదేవిధంగా రైతు భరోసా ఎకరాకు ఒక సంవత్సరానికి పదివేల నుంచి 15 వేల రూపాయాలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చెల్లించలేదు తక్షణమే ఈ రెండిటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ళ విషయంలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా మొదటి విడతలో ఇస్తున్న ఇండ్లను ఇల్లులేని పేద ప్రజలకు ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ విజయ, రాములు, నారాయణపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహ, వెంకటేష్, సంతోష్, రాము, కోస్గి శ్రీను, నాగరాజు వివిధ మండలాల గ్రామాల ప్రజలు, ప్రతినిధులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పన్‌పల్లి ప్రాజెక్టులో పడవ మునక

### ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం





**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి గ్రామ పరిధిలోని గోదుమగూడ, గ్రామపరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రిసార్టులు పెట్టి నిబంధనలకు విరుద్దంగా బోటింగ్ చేస్తూ అడ్డదిడ్డంగా రిసార్ట్‌లు నడిపిస్తున్నారు. అధికారుల అండదండలతో అనంతగిరి చూటు సుమురు 10రిసార్ట్‌లు నాడిపిస్తున్నారు. శనివారం, ఆదివారం వచ్చింది అంటే పర్యాటకులతో కళాకలడుతయి. శనివారం మధ్యాహ్నం వికారాబాద్ మండల పరిధిలోని గోదుమగుడా పరిధిలోని హైదరాబాద్ నుండి వికారాబాద్‌లోని క్యాంపు సైట్ రిసార్ట్‌కు వచ్చిన పర్యాటకులు ఎలాంటి అనుమతులు లేని సర్పన్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్‌లో ప్రయాణం చేసి ఇద్దరు మృతి చెందిన సంఘటన జరిగింది. ఈ సంఘటనలో పుణమ్‌సాంగ్ 54, రీతుకుమారి 55 బీహర్ రాష్టంనికి చెందిన ఇద్దరు మహిళలు మణించారు, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరల ప్రకారం సయత్నం సమయంలో అక్కడ ఏర్పాటుచేసిన బోటులో ఎలాంటి సెప్టీ జాకిట్స్ లేకుండానే నిర్వాహకులు రీతుమారి, పుణమ్‌సింగ్, మరో ఇద్దరు చిన్నరులు చెరువులోకి తీసుకెళ్లారు సాయత్రం సమయంలో వర్షం రావడంతో హుటాహుటిన వెనక్కి వచ్చే క్రమంలో ప్రయణిస్తున్న బోట్ బోల్తాపడింది. ఈ ప్రమదంలో ఇద్దరు మణించాగా పిల్లలు క్షేమంగా ఉన్న మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతిదేహాలను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించంగా పోలీసులకు పుణమ్ సింగ్ భర్త అజీత్‌కుమార్ ఫర్యాదు చేయగా కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బిమ్ కుమార్ తెలిపారు.



## వారం రోజుల్లో పది అడుగులు...

### సాగర్‌కు భారీగా ఇన్ ఫ్లో.. ఏడు అడుగులదూరంలో శ్రీశైల జలాశయం...

**ప్రజాపక్షం/నందికొండ:** మహారాష్ట్ర,కర్ణాటకలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తూ ఉండటంతో ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలంకు భారీగావరద నీరు ఇన్ ఫ్లోగావచ్చి చేరుతుంది దీనితో శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో పూర్తిస్థాయి లో విద్యుత్ ఉత్పత్తి చేపడుతుండటంతో66 వేల నుంచి 55 వేల క్యూసెక్కుల నీరుసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతుంది దీనితో క్రమంగా సాగర్ జర్వాయర్ నీటి మట్టం పెరిగుతుంది గత వారం క్రితం 514 అడుగులుగా ఉన్న రిజర్వాయర్ నీటిమట్టం శనివారం సాయంత్రానికిపది అడుగుల మేర పెరిగి 524 అడుగులుగా ఉన్నది. కేవలం శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్ కువస్తున్న నీటికి వారం రోజుల్లో పది అడుగులు మేర పెరిగితే శ్రీశైలం రిజర్వాయర్ మరో 7 అడుగులు పెరిగితే పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టానికి చేరుకోనుంది. వరద ఇదేవిధంగా కొనసాగితే రెండు మూడు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు తెరిచే అవకాశం ఉండడంతో మరి కొద్దిరోజుల్లోనే నాగార్జునసాగర్ రిజర్వాయర్ కూడా జలకళను సంతరించుకోనుంది.

### సాగర్ రిజర్వాయర్ సమాచారం

నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గంష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలు ప్రస్తుత రిజర్వాయర్ నీటి మట్టం శనివారం సాయంత్రానికి 524.60 అడుగులకు 157.7980 టీఎంసీల నీటి నిల్వతో ఉన్నది.ఎడమ కాలువ ద్వారా 3090 క్యూసెక్కులు, ఎస్ ఎల్ బిసి,ఏఎంఆర్ పి ద్వారా 1350 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా.కుడి కాలువ ద్వారా ఎటువంటి నీటి విడుదల కొనసాగడం లేదు అదేవిధంగాప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు. ప్రస్తుతం సాగర్ రిజర్వాయర్‌కు ఇన్ ఫ్లోగా 56662 క్యూసెక్కుల మీరు వచ్చి చేరుతూఉండడంతో 4440 క్యూసెక్కుల నీరు మొత్తం అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

## మెటల్ పౌడర్ కంపెనీతో ముప్పు

### మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమిళనాడుకు చెందిన మెటల్ పౌడర్ కంపెనీ హుజూర్‌నగర్‌లో నిర్మించడం వల్ల నెమలిపురి, తమ్మవరం, కృష్ణాపురం, మట్టపల్లి గ్రామాల ప్రజలు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని న్యాయవాది ఇమ్మానేని రామారావు శనివారం బాధితుల తరపున జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అటవీ భూములలో ఈ ఫ్యాక్టరీ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టిందని, ఈ ఫ్యాక్టరీ వల్ల నీటి వనరులు, నీటి పారుదల వ్యవస్థ కలుషితం, లోహపు పొడితో వాతరణం కాలుష్యమై ప్రజారోగ్యంపై దెబ్బ పడుతుందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నివారణ మండలి చైర్మన్ రాజీవ్ శర్మను ప్రతివాదిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. మెటల్ పౌడర్ సంస్థ ఎండి అన్నామలై శంకరలింగం పై చర్యలు తీసుకోవాలంటూ.. అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలంటూ ఆదేశాలు జారీ చెయ్యాలంటూ కమిషన్‌ను ఆయన కోరారు.

## బిహార్ ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాల విమర్శలు తిరస్కరించిన సిఇసి

**ఫిరోజాబాద్:** బిహార్‌లో ఈ ఏడాది చివరినాటికి శాసనసభ ఎన్నికలు సమీపించేలోపు ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలను నవీనీకరించాల్సిందేనని కేంద్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ గ్యానేశ్ కుమార్ చెప్పారు. ఫిరోజాబాద్‌లో శనివారంనాడు ఆయన పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిరస్కరించారు. ఎన్నికల సంఘం అధికారులు ప్రతిరోజూ అన్ని రాజకీయ పార్టీలతో సంభాషణలు చేస్తూనే ఉన్నారని, ఈ విధంగా గడచిన నాలుగు నెలలుగా అసెంబ్లీ స్థాయి నుండి 5000 సమావేశాలు నిర్వహించామని చెప్పారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఫిరోజాబాద్ వచ్చిన సందర్భంగా ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ లేవనెత్తిన ప్రశ్నలు, వ్యక్తం చేసిన ఆందోళన గురించి ప్రశ్నించగా సిఇసి పైవిధంగా స్పందించారు. బీహార్‌లో ఓటర్ల జాబితాలు అసంపూర్ణంగా ఉన్నాయని దాదాపు ప్రతి రాజకీయపార్టీ ఫిర్యాదు చేస్తోందని, అందువల్ల కాలానుగుణంగా వచ్చిన మార్పులు, చేర్పులతో ఆ జాబితాలను నవీనీకరించాల్సిందేనని అన్నారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితాల నిశితంగా పరిశీలనా ప్రత్యేక్ష సమీక్ష (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రతిపక్షాలన్నీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ తమ చర్యను సమర్థించుకున్నారు. కాంగ్రెస్ సహా 'ఇండియా కూటమి' పార్టీలన్నీ ముక్తకంఠంతో బీహార్‌లో ఓటర్ల జాబితా సమీక్షను వ్యతిరేకిస్తున్నాయి. నిర్ణీత సమయంలో ఈ ప్రక్రియ పూర్తిచేయడం సాధ్యంకాదనీ, ఉన్న ఓటర్లకు కూడా తీవ్ర అన్యాయం జరుగుతుందని, అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ఎముకల ఆరోగ్యంపై ఐఎస్ఎస్‌లో శుక్లా అధ్యయనం

**న్యూఢిల్లీ :** భారత రహితస్థితిలో ఉన్నప్పుడు ఎముకల ఆరోగ్యం ఎలా ఉంటుందన్న విషయంపై భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ (ఐఎస్ఎస్)లో పరిశోధనలు చేశారు. ఆక్సియం–4 మిషన్‌లో భాగంగా డ్రాగన్ అంతరిక్షనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్ళిన తొలి భారతీయుడు శుక్లా, భారత రహితస్థితిలో ఉన్నప్పుడు ఎముకల ఆరోగ్యం ఎలా ఉంటుంది? ఆ స్థితిలో ఉన్నప్పుడు ఎముకలకు ఎలాంటి సమస్యలు వస్తాయి? ఎముకలు ఆ సమయంలో ఎలా స్పందిస్తాయి? అనే విషయాలపై అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం భూమి మీద ఎముకల వ్యాధులు వచ్చిన మానవులకు చికిత్సలు చేయడానికి ఎంతో ఉపయోగపడుతుంది. శుక్లా ఐఎస్‌స్‌కు వెళ్ళి శనివారంనాటికి పదిరోజులు పూర్తయ్యాయి. మరో నాలుగు రోజుల తర్వాత ఆయన తిరిగి భూమికి బయలుదేరతారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో రేడియేషన్ ప్రభావం ఎలా ఉంది? అనే విషయంపై కూడా ఆయన అధ్యయనం చేశారు. భూమికి దూరంగా దీర్ఘకాలంపాటు వ్యోమగాములు అంతరిక్షంలో ఉన్నప్పుడు ఎలాంటి రేడియేషన్ ప్రభావం పడుతుందో పర్యవేక్షించడానికి జరిగిన పరీక్షల్లో కూడా శుక్లా పాల్గొన్నారు. ఈ పరీక్షలవల్ల భవిష్యత్‌లో వ్యోమగాములు ఏ విధంగా దీర్ఘకాలం అంతరిక్షంలో మనుగడ సాగించవచ్చుననే విషయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు ఈ అధ్యయనాలు దోహదం చేస్తాయి.

ఉత్తరప్రదేశ్ లక్నోలో జన్మించిన శుభాంశు శుక్లా వయసు 39 సంవత్సరాలు. ఆయనను ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు 'షక్స్' అనే కోడ్‌తో పిలుస్తారు. ఆయన ఆక్సియం–4 మిషన్‌కు పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తం నలుగురు వ్యోమగాములు జూన్ 26వ తేదీన ఫాల్కన్–9 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశించారు. అమెరికాకు చెందిన అనుభవజ్ఞురాలైన నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ ఈ మిషన్‌కు కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు.

## సంపద కొందరు ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతం

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**నాగ్‌పూర్ :** దేశంలో పేదల సంఖ్య క్రమంగా పెరుగుతోందని.. సంపద కొందరు ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నదని.. ఇది ప్రమాదకరమైన పరిస్థితని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. సమాజంలో సంపద వికేంద్రీకరణ జరగాలన్నారు. సంపద అంతా కొద్దిమంది వద్దే కేంద్రీకృతం కావొద్దని.. ఉపాధిని సృష్టించే, గ్రామాలను అభివృద్ధి చేసే ఆర్థిక వ్యవస్థ కోసం మనం కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 నుంచి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్న ఆయన.. దేశ జిడిపికి ఈ రంగం సహకారం 12శాతం మాత్రమేనన్నారు. పరిశ్రమ రంగం సహకారం 22 నుంచి 24 శాతం, సేవారంగం సహకారం 52 నుంచి 54 శాతం ఉందన్నారు. కేంద్రమంత్రి తన ప్రసంగంలో మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలను ప్రసంసించారు. నియంత్రణ లేకుండా కేంద్రీకరణ గురించి జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్వామి వివేకానందను ఉటంకిస్తూ కడుపు ఖాళీగా ఉన్న వ్యక్తికి తత్వశాస్త్రం బోధించలేమన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్రపై మాట్లాడుతూ.. సీఏలు కేవలం పన్ను ట్యాక్స్ రిటర్న్‌లను దాఖలు చేయడానికి పరిమితం కాదని.. దేశ ఆర్థిక వ్యవస్థనకు ఇంజిన్‌గా మారగలరన్నారు. రోడ్ల నిర్మాణరంగంలో జరిగిన పనిపై ప్రస్తావిస్తూ.. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బిఒటి) వ్యవస్థను మొదటగా ప్రారంభించిన వ్యక్తి తానేనని అన్నారు. నేడు రోడ్డు అభివృద్ధికి డబ్బు కొరత లేదని గడ్కరీ పేర్కొన్నారు. టోల్ ద్వారా మనం ఏటా రూ.55వేల కోట్లు సంపాదిస్తున్నామన్నారు. రెండేళ్లలో రూ.1.40 లక్షల కోట్లకు పెరుగుతుందన్నారు.

## ఆయుధ కన్సల్టెంట్ సంజయ్ భండారీ పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు

### ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ



**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) పిటిషన్ అభ్యర్థనపై యుకెకు చెందిన ఆయుధ కన్సల్టెంట్ సంజయ్ భండారీని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడుగా శనివారం ఢిల్లీ కోర్టు ప్రకటించింది. ఈ విషయాన్ని అధికారులు చెప్పారు. పారిపోయిన ఆర్థిక నేరస్తుల చట్టం (ఎఫ్ఇఒఎ)2018 కార్యకలాపాల కింద సంజయ్ భండారీపై కోర్టు ఈ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వు ఫెడరల్ దర్యాప్తు ఏజెన్సీకి ఒక అవకాశంగా మారింది. ఎందుకంటే ఇప్పుడు భండారీకి చెందిన కోట్లాది విలువైన ఆస్తులను జప్తు చేయగలిగే అవకాశాన్ని కలిగి ఉండటమే అని చెప్పవచ్చు. 2016లో సంజయ్ భండారీ లండన్‌కు పారిపోయాడు. ఢిల్లీలో తనపై ఆదాయపు పన్ను శాఖ (ఐటి) అధికారులు దాడి చేసిన కొద్దిసేపటికే ఆయన 2016లో లండన్‌కు పారిపోయాడు. ఈ నేపథ్యంలో ఈడి భండారీ, మరికొంతమంది ఇతరులపై 2017లో ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) కింద ఒక క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీనిపై యాంటీ బ్లాక్ మనీ లా2015కింద సంజయ్ భండారీపై ఆదాయపు పన్ను శాఖ ఒక చార్జిషీట్ దాఖలు చేసింది. భండారీపై ఏజెన్సీ తన మొట్టమొదటి చార్జిషీట్‌ను 2020లో దాఖలు చేసింది. అంతే కాకుండా సంజయ్ భండారీకి రాబర్ట్ వాద్రాతో ఎలాంటి లింక్‌లు ఉన్నాయన్న విషయమై దర్యాప్తు జరుపుతోంది. కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్‌వాద్రా వ్యాపారవేత్తగా ఉన్నారు. 2009లో సంజయ్ భండారీ లండన్‌లోని 12, బ్రైయాన్‌స్టన్ స్క్వేర్ హౌస్‌ను స్వాదీనం చేసుకున్నారని ఆరోపిస్తూ ఈడి 2023లో అతడిపై ఒక ప్రాథమిక అభియోగ పత్రాన్నిదాఖలుచేసింది.రాబర్ట్ వాద్రా సమకూర్చిన నిధులు, మార్గదర్శకాలతోనే బ్రైయాన్‌స్టన్ స్క్వేర్ హౌస్‌ను పునరుద్దరించేందుకు సంజయ్ భండారీ పునరుద్ధరణ పనుల కోసం ఉపక్రమించాడని ఈడి చార్జిషీట్‌లో పేర్కొంది. అయితే తనకు లండన్‌లో ఎలాంటి ఆస్తి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లేదని రాబర్ట్ వాద్రా ఖండించారు. ఈడి ఆరోపణలను ఆయన 'రాజకీయ మంత్రగత్తె'తగా అభివర్ణించారు. తనను వెంటాడి, వేధిస్తున్నారని ఈడిపై ఆరోపణలు చేశారు.

## ఆయుష్‌లో నియామకాల జాబిత విడుదల


**ప్రజాక్షపక్షం/హైదరాబాద్:** ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, ఎంఎన్‌జె హాస్పిటల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన ఎంపిక జాబితాను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శనివారం విడుదల చేసింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156 ఉండగా, ఎంఎన్‌జెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45 ఉన్నాయి.ఈ పోస్టులకు ఎంపికైన వారి వివరాలను బోర్డు ప్రకటించింది. ఈ పోస్టుల భర్తీతో ఆయుష్ వైద్య సేవలు మరింత మెరుగవుతాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను గుర్తు చేశారు. ఆయుష్‌లో ఇటీవలే సుమారు 630 వరకు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, మరో 200లకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. కేన్సర్ పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేన్సర్ వైద్య సేవలను విస్తరిస్తున్నామన్నారు. కొత్తగా 45 మంది డాక్టర్ల నియామకంతో ఎంఎన్‌జె కేన్సర్ హాస్పిటల్‌లో వైద్య సేవలు మరింత మెరుగావుతాయని చెప్పారు. జిల్లాలకు కూడా ప్రభుత్వ కేన్సర్ వైద్య సేవలను విస్తరిస్తున్నామని, కొత్త జిల్లాల్లో డిస్ట్రిక్ట్ కేన్సర్ కెఎ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రీజనల్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ సెంటర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత పే షెంట్లు హైదరాబాద్ వరకు రావాల్సిన అవసరం ఉండదని, జిల్లా స్థాయిలోనే మెరుగైన వైద్యసేవలు అందుతాయని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

## కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/కొత్తూరు:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. శనివారం హైద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. త్వరగా కొలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగానికి సిద్ధమైన కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు.

## అట్టహాసంగా అనన్య ప్రస కూచిపూడి అరంగేట్రం



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** అనన్య ప్రస కూచిపూడి నాట్య అరంగేట్రం అట్టహాసంగా జరిగింది. శ్రీ వెంకటేశ కూచిపూడి అకాడమీ నృత్య గురువు కుభేరిణి ఆశీర్వాదంతో శనివారం సాయంత్రం రవీంద్రభారతిలో అనన్య ప్రస కూచిపూడి నాట్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకొన్నది. ముఖ్యఅతిథిగా కూచిపూడి డ్యాన్సర్, కొరియోగ్రాఫర్, సినీ నటి బి.సంధ్య రాజు హాజరయ్యారు. అనన్య ప్రస కూచిపూడి నాట్య ప్రదర్శన చూసి, అభినందించారు. తల్లిదండ్రులు అవినాశ్ పర్స, నీత బి.పర్స ప్రోత్సాహంతో అనన్య పర్స ఎనిమిదేళ్ల వయసు నుంచే కూచిపూడిలో శిక్షణ తీసుకోవడం ప్రారంభించారు. తిరుమల శ్రీవారి ఆలయం, న్యూయార్క్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో భక్తి, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు చేసి, వీక్షకుల మెప్పు పొందారు. అంతేగాక, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న అనన్య ప్రస గోల్డ్‌మెడల్ కూడా సాధించారు.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఖనిజ అభివృద్ధి



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోని తన సొంత నిధులతో ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన పున్న గణేష్ సేవలు అభినందనీయం అని రాష్ట్ర ఖనిజ అభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనీల్‌కుమార్, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కెపురం డివిజన్‌లోని శ్రీ రామకృష్ణపురం కాలనీ పార్కులో పిడిఆర్ ఫౌండేషన్ చైర్మన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మల గణేష్ నేత తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ వారు ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మదుసూదన్‌రావు, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, దేవాలయ చైర్మన్ లు తలాటి రమేష్‌నేత, సురేష్, గట్ల రవీంద్ర, రాజునాయక్, ఎల్లయ్య, జ్ఞానేశ్వర్, సైదులులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేస్తే చర్యలు




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** రైతు సంక్షేమమే ముఖ్యమని, మార్కెట్‌కు వచ్చే రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేస్తే చర్యలు తప్పవని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి కమీషన్ ఏజెంట్లను హెచ్చరించారు. శనివారం ఎన్‌టిఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ యార్డు కార్యాలయంలో కమీషన్ ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పి. ప్రసాద్‌రావు హాజరయ్యారు. ముందుగా రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను, ఇతరుల లైసెన్స్ పేరుతో నడుస్తున్న బినామి ఏజెంట్లపై చర్యల గురించి, కమీషన్ ఏజెంట్లు తీసుకోవాల్సిన బాధ్యతపై చర్చిండటం జరిగిందన్నారు. అంతేకాకుండా మార్కెట్ బయట రైతుల ముసుగులో దళారి వ్యవస్థపై కూడా చర్యలు చెపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, వైస్ చైర్మన్ భాస్కరచారి, సభ్యులు మచ్చేందర్‌రెడ్డి, లక్ష్మీ, గణేష్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, ఇబ్రహీం, జైపాల్‌రెడ్డి, బండి మదుసూదన్‌రావుత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగార్జున స్కూల్ ఫ్రెషర్స్ డే వేడుకలు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ /సరూర్‌నగర్:** హస్తినాపురం డివిజన్‌లోని సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిసోరి, ఐఐటి కాన్సెప్ట్ స్కూల్లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్ పర్సన్ గుమ్మకొండ రజని విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త, పాత తేడలేకుండా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యాను పొందాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అందరూ కలిసి మెలిసి ఉండాలని చక్కటి వాతావరణానికి విద్యార్థులు అలవాటు చేసుకోవాలని తెలిపారు. విద్యతో పాటు చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తమ విద్యా సంస్థలో అధిక ప్రాధాన్యం ఇస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారికి ఇష్టం ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని ఆమె గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతోగాను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఇంచార్జిలు ఉషాశ్రీ, సలోమి, పుష్పలత, దివ్య జ్యోతి, సవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### మీర్‌పేట నాగార్జునస్కూల్ ...



విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేటలోని నాగార్జున మాంటిసోరి, ఐఐటి ఒలింపియాడ్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ కొత్త విద్యార్థులు తెలికగా ఇతర విద్యార్థులతో కలిసి పోయి కొత్త వాతావరణానికి అలవాటు పడడానికి ఈ వేడుకలు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, ఇంచార్జి దుర్గ, రాధిక, సంధ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుఖ్‌నగర్ మలబార్ గోల్డ్ ఆండ్ డైమండ్స్‌లో 'మైన్' డైమెండ్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విశ్వసనీయ బంగారు, వజ్రాభరణాల రిటైలర్, బాధ్యతాయుతమైన అభరణాల వ్యాపార సంస్థగా మలబార్ గోల్డ్ ఆండ్ డైమాండ్స్ ప్రఖ్యాంతిగాంచిందని దిల్‌షుఖ్‌నగర్ స్టోర్ హెడ్ షఫీ అన్నారు. శనివారం షోరూంలో నువా, మైన్ అభరణాల ప్రదర్శనను వినియోగదారుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ మలబార్ అభరణాలు కళానైపుణ్యతతో హుందాతనంతో కూడిన ఆభరణాలు అని అన్నారు. నగిషి చెక్కిన ప్రతి ఆభరణం, తయారు చేసిన వారి అనుభవం కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




# హైదరాబాద్‌లోని పలు క్లినిక్‌లు, వైద్య కేంద్రాలలో మెడికల్ కౌన్సిల్ తనిఖీలు

● 8 మంది నకిలీ వైద్యులపై కేసు నమోదు ● అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్తే.. ప్రాణానికే ప్రమాదం : తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆధునిక అల్లోపతి వైద్యం అందిస్తున్న నకిలీ వైద్యులపైన తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కేసు నమోదు చేసింది. హైదరాబాద్ నగరంలోని బౌరంపేట్, దుండిగల్,సూరారం పరిసర ప్రాంతాల్లో ఆధునిక అల్లోపతి వైద్యం అందిస్తున్న కేంద్రాలను మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్,సభ్యులు డాక్టర్ కెయుఎన్ విష్ణు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 8 మంది అర్హతలేని వ్యక్తులు అల్లోపతి వైద్యం అందిస్తున్నట్టు గుర్తించారు. అనారోగ్యంతో వచ్చే ప్రజలపైన అధిక స్థాయి యాంటీ బయోటిక్స్,స్టెరాయిడ్లు, పెయిన్ కిల్లర్లు, ఐవి ఫ్లూయిడ్స్ వంటి మందులను ఉపయోగిస్తున్నారని, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని హానికర స్థాయికి తీసుకెళ్తున్నారని మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. అర్హతలు లేకపోయినప్పటికీ వైద్యం అందిస్తున్న వారిపైన ఎన్ ఎంసి చట్టంలోని సెక్షన్ 34, 54, తెలంగాణ స్టే ట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రెగ్యులేషన్ యాక్ట్ సెక్షన్ 22, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సె క్షన్లు 318, 319 ప్రకారం కేసులు నమోదు చే యనున్నట్టు డాక్టర్ కెయుఎన్ విష్ణు తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని సూరారం ప్రాంతంలోని నాని మినీ హాస్పిటల్‌లో కె.వెంకటేశ్ (బిఎస్సి ), దుండిగల్ లని శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో వై. సూర్య నారాయణ, శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో శివ శంకర్ (8 పడకల కేంద్రం), హై ఎండ్ స్టెరాయిడ్లు, పెయిన్ కిల్లర్స్, ఐవి ఫ్లూయి డ్స్ వినియోగిస్తున్నట్టు మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. బాలాజీ క్లినిక్‌లోని విట్టల్,నందుశ్వర్ ఫ స్ట్ ఎయిడ్ సెంటర్‌లో శంకర్ గౌడ్, మస్తాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఎస్.కెమస్తాన్, ఆరెంజి క్లినిక్‌లో ఎస్‌కె నగుల మీరా, బి ఎల్ ఆర్ క్లినిక్‌లో పి. సూర్యలత, గాంధీమైసమ్మలో అల్లోపతి వైద్యం చేస్తూ హై ఎండ్ యాంటీబయాటిక్స్, ఐటి ఫ్లూయిడ్స్ ఇస్తున్నట్టు మెడికల్ కౌన్సిల్ బృందం గుర్తించింది.

### అర్హతలు లేని వైద్యులతో వైద్యం వద్దు.. ప్రాణానికి ప్రమాదం: డాక్టర్ నరేష్ కుమార్

అర్హతలు లేని వ్యక్తుల వద్దకు వైద్య సేవల నిమ్మితం వెళ్లవద్దని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. ఇటువంటి నకిలీ వైద్యుల కారణంగా ఆరోగ్యపరంగా మరింత సమస్యలు వస్తాయని, ఆర్థిక భారం కూడా పెరుగుతుందని, కొన్ని సార్లు వైద్యం వికటించి, లేదా వ్యాది తీవ్ర స్థాయికి వెళ్తే ప్రాణాకి ప్రమాం అని నరేష్ కుమార్ తెలిపారు. ఎవరైనా నకిలీ వైద్యుల వైద్యం అందిస్తున్నట్టు సమాచారం ఉంటే వెంటనే 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

## ముందు దేవుడి పటం.. వెనకాల గంజాయి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధూల్‌పేట్ ఆనంద్‌నగర్‌లో గంజాయి స్మగ్లర్ రో హన్ సింగ్ ఇంట్లో పెద్ద ఎత్తున గంజాయి ఉందని ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు టీం లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో హుటాహుటీనా రోహన్ సింగ్ ఇంట్లో సుమారు నాలుగు గంటల పాటు సోదాలు నిర్వహించినా గంజాయి ఆనవాళ్లు లభించలేదు. అయితే తమకు వచ్చిన సమాచారం తప్పుగా వచ్చిందని అధికారులు భావించారు. మరోసారి అధికారులు ఈ విషయంపై రుడీ చేసుకునేందుకు ప్రయత్నించగా రోహన్‌సింగ్ ఇంట్లో తప్పకుండా గంజాయి లభిస్తుందనే సమాచారం మళ్లీ వచ్చింది. దీంతో అధికారులు పూజ గదిలోని దేవుళ్ళ చిత్రపటాల వెనుక పేపర్లో చుట్టిపెట్టిన పెద్ద పెద్ద కట్టలు కనిపించడంతో అవి ఏమిటని బయటకు తీసి చూడడంతో అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఇలా పాకెట్లలో ఉన్న గంజాయిని తూకం వేయగా 10.934 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని దేవుడి చిత్రపటాల వేనుక దాచిపెట్టి ఆర్డర్ వచ్చినప్పుడల్లా మాదాపూర్ ప్రాంతంలోని ఐటి కంపెనీ ఉద్యోగులకు విక్రయించేవాడని దర్యాప్తులో తేలింది. ఈ గంజాయి ఒరిస్సా నుంచి వచ్చిందని నిందితుడు తెలిపాడు. రోహన్‌సింగ్‌తో పాటు అతని అనుచరుడు యశ్వంత్‌సింగ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ఒరిస్సాకు చెందిన స్వప్న మం డల్ , రాజా వీర్ భక్రి హైదరాబాద్‌కు చెందిన రోహిత్ కూడా కేసులు నమో దు చేసినట్లు ఎస్‌టిఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

### మరో కేసులో 10.4 కేజీల గంజాయి స్వాధీనం..

ఎస్‌టిఎఫ్ పోలీసులు శివలాల్‌నగర్‌లోని సంకీర్‌సింగ్ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో 10.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సంకీర్‌సింగ్‌తో పాటు సుశీల్ సింగ్, సరితా, ఒరిస్సాకు చెందిన స్వప్న మండల్ అలియాస్ మీనా బాయ్‌లను అరెస్టు చేశారు.

## నాన్ బెయిలబుల్ కేసులు లేకుండా చేయడమే తమ లక్ష్యం

రాచకొండ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** నాన్ బెయిలబుల్ (ఎన్‌బి డబ్ల్యూ) కేసులు లేకుండా చేయడమే తమ లక్ష్యమని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు అన్నారు. శనివారం నాగోల్‌లోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో సిపి సుధీర్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజుల్లో తమ కమిషనరేట్ పరిధిలో నాన్ బెయిలబుల్ కేసులు లేకుండా చేస్తామని చెప్పారు. గత ఏడాది 1088 ఎన్ బిడబ్ల్యూ పెండింగ్ కేసులు ఉండగా ఈ ఏడాదికి ఆ సంఖ్య 2847 పెరిగిందన్నారు. కాగా ఈ ఏడాది 2024 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిపి సుధీర్ బాబు తెలిపారు. అందులో భాగంగానే మరో 58 మంది నాన్ బెయిలబుల్ వారెంట్ కలిగిన వారు చనిపోయినట్లు గుర్తించడం జరిగిందని రాచకొండ సిపి సుధీర్ బాబు పేర్కొన్నారు. మిగిలిన నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయడం జరిగిందని సిపి తెలిపారు.మిగిలిన నిందితులను పట్టుకునేందుకు తమ కమిషనరేట్ నుండి యంగ్ ఆఫీసర్స్‌తో కూడిన 14 బృందాలను తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లోని నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దింపినట్లు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో కేసులు చేదించడంలో చురుకుగా పని చేసిన వివిధ స్థాయిలోని సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గండిపేట్ :** కాంగ్రెస్ పార్టీ హాయంలోనే అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి 7.52 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణికొండ మున్సిపల్ 42.00 లక్షల సాధారణ నిధులతో 18వ వార్డులోని శివనగర్ కమ్యూనిటీ హాల్‌ని ప్రారంభించారు. అనంతరం 100 లక్షల నిధులతో ఆల్కపూర్ పార్క్ 1లో జరుగుతున్న వాల్ పెయింటింగ్స్,అభివృధి పనులనుపరిశీలించారు.75.00 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 7వ వార్డులోని స్పెక్ట్రం విల్లాస్ వద్ద ఏర్పాటు చేసిన బాక్స్ కల్వర్ట్‌ని ప్రారంభించారు. 6 వ వార్డులోని అలిజాపూర్ రోడ్డులో సెంట్రల్ మీడియని వెంకటేశ్వర కాలనీలో 50.00 లక్షల నిధులతో సిసి రోడ్డు, పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్,మేనేజర్ శ్రీధర్,డిఈ శివ సాయి, ఏఈ సంజయ్, మణికొండ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కస్తూరి నరేందర్ పాల్గొన్నారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాజకీయాలకు అతీతంగా ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరు వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సుడిగాలి పర్యటనలు చేసి రూ.21.58కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ కమీషనర్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటికి చెందిన మాస్టర్ ప్లాన్‌ను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వల్లనే అభివృద్ధి పనులు అస్తవ్యస్థంగా మారినట్లు వివరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఇష్టానుసారంగా వ్యవహరించడంతోనే షాద్‌నగర్‌కు ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వేల కోట్ల నిధులు గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగా బుడిదలో పోసిన పన్నీరు మాదిరిగా తయారైందని తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రామాణాలు ఏమి పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపటడం వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పార్కులు, సిసిరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిగణలోకి తీసుకొని రాజకీయాలకు అతీతంగా నాణ్యత ప్రమాణాలతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపాలిటిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే రూ.39కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చామని, మరో రూ.50కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని గుర్తు చేశారు. దినదినంగా మున్సిపల్ విస్తరిస్తుందని, అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు అభివృద్ధి పనులు ప్రణాళిక బద్దంగా అమలు చేసే విధంగా కృషి చేయాలని సూచించారు.

### వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నదే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటిలో ఉన్న 28వార్డులతోపాటు కొత్తగా మరికొన్ని వార్డులు విస్తరించే అవకాశాలు ఉంటాయని, ఎన్ని వార్డులు అనే విషయంపై స్పష్టత లేదని వివరించారు. ఎన్నిక వార్డులు విస్తరించినా కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవులతోపాటు నామినేటెడ్ పోస్టులు వస్తాయని గుర్తు చేశారు. ప్రభుత్వ స్థలాలతోపాటు పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ చైర్మెన్ విశ్వం, నేతలు సయ్యద్ ఇబ్రహీం, మహ్మద్ ఇబ్రహీం, జమ్మద్‌ఖాన్, సర్వర్‌పాషా, శ్రావణీ, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, లింగారెడ్డి గూడ అశోక్‌లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిసిన బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా పదవీ భాధ్యతలు చేపట్టుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావును బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యక్షులు పవన్‌రెడ్డి, డివిజన్ బిజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## కార్మికుల టార్గెట్‌గా గంజాయి విక్రయాలు



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులే టార్గెట్‌గా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారంతోనే దాడులు చేశామని రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారిని ఉజ్వలరెడ్డి వివరించారు. శనివారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్వలరెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని నందిగామ మండల కేంద్రం సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన బిహార్ రాష్ట్రానికి చెందిన ఫింటుసింగ్ అనేక యువకుడు కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత కొన్ని రోజుల నుండి బిహార్ నుండి అక్రమంగా గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని కిరాణాషాపును తనిఖీ చేయగా అసలు విషయం బయటపడిందని తెలిపారు. ఫించుసింగ్ నుండి రెండు కిలోల గంజాయి, 9కిలోల 150గ్రాముల 40గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు మొత్తం 11కిలోల 130గ్రాముల గంజాయి లభించినట్లు వివరించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3.50లక్షల ఉంటుందని, నింధితుడి నుండి గంజాయితోపాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్ సిఐ టి.శేఖర్, ఎస్‌ఐలు సునీత, శ్రీనునాయక్, సిబ్బంది రాజయ్య, వినోద్, రవికుమార్, సుధీర్‌లు పాల్గొన్నారు.

## ఫోన్ల ట్యాపింగ్ రాజ్యాంగ విరుద్ధం


షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు బిఆర్ఎస్ నేతలకు ఎవరు ఇచ్చారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్ ఖాన్ మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఫోన్లు ట్యాపింగ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్య దేశంలో ఎవరు ఎవరితోనైనా మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందని, ఫోన్ ట్యాపరింగ్ చేయడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని వాపోయారు. పదేళ్ళు అధికారంలో ఉండి ఫోన్ ట్యాపరింగ్ చేయడమే కాకుండా కాంగ్రెస్ నాయకులను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుండి ఏసిపి వెంకటగిరి నుండి తమకు ఫోన్ ట్యాపరింగ్ అయిందని సమాచారం వచ్చిందని, విచారణకు హాజరు కావాలని చెప్పారని వివరించారు. యువనేతను విమర్శించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 48గంటల్లో సమాదానం చెప్పాలని లేనిపక్షంలో న్యాయపరంగా విచారణతోపాటు తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపరింగ్ విషయంలో బిఆర్ఎస్ నేతలు పెట్టిన మీడియా సమావేశానికి ఏమి సంబందమో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ నేతలు వార్నింగ్ ఇవ్వడం వెనుక అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బాబర్‌ఖాన్ నుండి మొదలుకొని రఘునాయక్, కృష్ణారెడ్డి, జమృద్‌ఖాన్, శ్రావణి వంటి వారి ఫోన్లు ట్యాపరింగ్ చేశారని స్వయంగా పోలీసులు విచారణకు రావాలని నోటీసులు సైతం ఇచ్చారని తెలిపారు. ఇంత జరుగుతుంటే స్థానిక బిఆర్ఎస్ నేతలు మన్నె నారాయణ, లక్ష్మణ్‌నాయక్, పిల్లి శేఖర్, గుండు అశోక్, శీలం శ్రీకాంత్, జుపల్లి శంకర్, సంజు నాయక్‌లపై షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఓబిసి సెల్ తాలుకా చైర్మెన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఇంటర్ విద్య ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లను ఆదుకోవాలి

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఇంటర్ విద్య ఒకేషనల్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటర్ విద్య జనరల్ విభాగంలో అందరినీ రెగ్యులర్ చేసి ఒకేషనల్ విభాగంలో 411 మందిని వివిధ కారణాలతో పక్కనపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నుంచి పనిచేస్తున్న వీరిని పట్టించుకోలేదన్నారు. కొద్దికాలం క్రితమే కొత్త జూనియర్ కాలేజీలకు 273 పోస్టులను మంజూరుచేసిన ప్రభుత్వం ఒకేషనల్ అధ్యాపకులను మరిచిపోవడం బాధాకరమన్నారు. వెంటనే 411 ఒకేషనల్ పోస్టులను మంజూరు చేసి, తమకు న్యాయం చేయాలని రవిశంకర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు హసీనా, గౌతం, చందు, రవి, ఆంజనేయులు, ఎ.చంద్రశేఖర్, నగేశ్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గు చేటు

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అనుచిత వాక్యలు చేయటం సిగ్గు చేటని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పదిహేను యేండ్లలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేయని అభివృద్ధి కేవలం పదిహేను నెలలో నియోజక వర్గంను అన్ని రంగాలలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి చేశారని ధిమా వ్యక్తం చేశారు.అభివృద్ధిపై మల్‌రెడ్డి రంగారెడ్డిని విమమర్శించే నైతిక హక్కు, అర్హత కిషన్ రెడ్డికి లేవని తీవ్రంగా ఖండించారు. అభివృద్ధిపై మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే మాజీ ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బి మహీపాల్,గురునాథ్‌రెడ్డి,పాండు రంగారెడ్డి,రాచర్ల వెంకటేష్,మంఖాల దాసు తదితరులు పాల్గొన్నారు.



## ఎఓసి పరిధిలో అదనపు రోడ్లకు వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గం ఎఓసి పరిధిలో అదనపు రోడ్ల నిర్మాణానికి, రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం బొల్లారంలోని ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్‌లో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు రాజీవ్, కర్నల్ క్యూ వినయ్‌కుమార్, కమాండింగ్ జి.సురేష్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జగదీష్‌బాబు, మీతానియల్, బిఆర్‌ఎస్ నేత అరుణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/కాప్రా:** నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై ప్రజలకు అవిశ్రాంతమైన సేవలందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఆరోగ్య సంరక్షణ కోసం జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లను పంపిణీ చేసారు. ప్రతి రోజు తెల్లవారు జామునుండే వీధివీధినా పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఎల్‌లు, మల్లాపూర్ డివిజన్ కార్మికులు పాల్గొన్నారు.

## వ్యాధులు సోకకుండా అప్రమత్తత తప్పనిసరి

### కార్పొరేటర్ శ్రవణ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వర్షాకాలం దృష్ట్యా ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు గాను ఎక్కడా నీరు నిలువకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ కోరారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ లాంటి అంటు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తమ ఇళ్లతో పాటు సమీప ప్రాంతాల్లో నీరు నిలువ ఉండటం వల్ల పెరిగే దోమలు, లార్వాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శనివారం ఓల్డ్ నేరేడ్‌మెట్, న్యూ విద్యానగర్, శేషునగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేసిన ఆయన బోర్ వెల్ పనులను ప్రారంభించారు. వర్షాకాలం ఎమర్జెన్సీ పనుల బాధ్యతలు చేపట్టిన హైడ్రా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నీరు నిలువ లేకుండా చూడాలన్నారు.

## అర్హతలు లేకుండా వైద్యం : 8 మందిపై కేసులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** అనుమతులు, అర్హతలు లేకుండా వైద్యం అందిస్తున్న 8 మందిపై తెలంగాణా మెడికల్ కౌన్సిల్ శనివారం కేసులు నమోదు చేసారు. విశ్వసనీయ సమాచారంతో మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డా.శ్రీనివాస్ కౌన్సిల్ సభ్యుడు డా. విష్ణులు మేడ్చల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మైసమ్మ ప్రాంతంలో ఆరెంజి క్లినిక్ నిర్వాహకుడు నగుల్ మీరా బిఎఎంఎస్ సర్టిఫికెట్‌తో అలోపతి వైద్యం చేస్తున్నాడని,బిఎస్‌సి సర్టిఫికెట్ ఉన్న కె.వెంకటేష్ సూరారం ప్రాంతంలో నాని మిని హాస్పిటల్ నిర్వహిస్తున్నాడని, దుండిగల్‌లో ఎలాంటి




అర్హతలు లేకుండానే వై.సూర్యనారాయణ సాయి ఫస్ట్ ఎయిడ్ నిర్వహిస్తున్నాడని, అదే ప్రాంతంలో శివశంకర్ శ్రీ శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట ఏకంగా 8 పడకల కేంద్రం నిర్వహిస్తూ స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారని, దీంతో పాటు బాలాజి క్లినిక్ నిర్వహిస్తున్న విఠల్, నందేశ్వర్ ఫస్ట్ ఎయిడ్ నిర్వహిస్తున్న శంకర్‌గౌడ్, మస్తాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్న ఎస్‌కె మస్తాన్‌లపై కేసులు నమోదు చేసి వాటిని సీజ్ చేసామని తెలిపారు. అర్హత లేకుండా వైద్యం చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంలో సమాచారం తెలిస్తే తమకు 9154382727 ద్వారా సమాచారం అందించాలని మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటి చైర్మన్ డా.నరేష్‌కుమార్ కోరారు.



## 100 రోజుల ప్రణాళికతో మున్సిపల్ అభివృద్ధి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సీజనల్ వ్యాధులు, తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని నర్సయ్య కాలనీలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా అవగాహన కల్పించారు. 13వ వార్డు లో 130 మొక్కలు నాటారు. ఇందిరమ్మ ఇళ్లు, పబ్లిక్ టాయిలెట్స్ పరిశీలన, గుంతల రోడ్డులను పూడ్చారు. రోడ్డుకిరువైపుల పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిఇ. బాలమురళి, మేనేజర్, అంగన్‌వాడి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు నరికివేసిన వారిపై చర్యలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జీవరాసులకు ఆవాసంగా ఉన్నవంద ఏళ్ల నాటి పురాతనమైన మర్రి, తాటి చెట్లు నరికేసిన వ్యక్తులపై చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ కాలనీలో నరికివేతకు గురైన ఏళ్ల కాలంనాటి మర్రి మహా వృక్షాన్ని శనివారం అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అటవీ అధికారి రేణుక స్పందించి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మహా మర్రి చెట్టు నరికివేతతో పక్షులు



చనిపోయిన విషయాన్ని గుర్తించామన్నారు. స్థానికులు ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి సంతకాలు తీసుకున్నామని తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీ ప్రతినిధులు కె అశోక్, బి బిక్షపతిగౌడ్, సత్యనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రాయల్ ఎన్‌క్లేవ్ వాసుల వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** తమ కాలనీలో సిసి రోడ్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని మచ్చ బొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేందర్‌నాథ్‌కు రాయల్ ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘ ప్రతినిధులు కోరారు. శనివారం కార్పొరేటర్‌ను కల్సిన ప్రతినిధులు అనిల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ సుకుర్, వివి రెడ్డి, సాండే రంగాచారి, కరిష్మా, రాణి, రంగాచారిలు సిసి రోడ్లు లేనందున ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నార.

# పోస్టుమేన్‌లకు..ఆటంకాలు తొలగించండి

- జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను కోరిన హైదరాబాద్ పోస్ట్‌మాస్టర్ జనరల్
- డిప్యూటీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసిన జిహెచ్‌ఎంసి కమిషనర్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించవద్దు అంటూ గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు. నగరంలో ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక విధులను నిర్వర్తించకుండా అడ్డుకోవడం భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 221 ప్రకారం శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. నిబంధనలను పాటించకపోవడం కొనసాగితే అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సంబంధిత ప్రజలకు గుర్తు చేశారు. ప్రజాసేవచేసే వారి గౌరవాన్ని నిలబెట్టడానికి, హైదరాబాద్ పౌరులకు తపాలా సేవలను సజావుగా, సమర్థవంతంగా అందజేయడానికి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆర్‌డబ్ల్యుఎ)లు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లకు ఉత్తరాలు, పార్సిల్స్ లను అందించే పోస్ట్‌మేన్‌లకు విధి నిర్వహణలో ఎలాంటి అటంకం కలిగించకుండా చూడాలని జిహెచ్‌ఎంసి సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లను కమిషనర్ కర్ణన్ ఆదేశించారు. పోస్టుమేన్‌లకు ఆటంకాలు కలగకుండా సర్కిళ్ళ పరిధిలో అమలు జరిగేలా చూడాలని జోనల్ కమిషనర్‌లకు తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, బహుళ అంతస్థుల భవనాలు, ఆకాశహర్మ్యాలు, గేటెడ్ కమ్యూనిటీలకు, అపార్టుమెంట్లలోనూ పోస్టల్ వస్తువులను డెలివరీ చేయడానికి పోస్టుమేన్‌లు ప్రయత్నిస్తున్నప్పుడు వారికి వివిధ రకాలుగా ఆటంకాలు ఎదురవుతున్నాయి. పోస్ట్‌మెన్‌లకు తరచుగా వస్తువులకు సంబంధిత వ్యక్తులను అందజేసే క్రమంలో పలు సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారు నేరుగా పోస్టల్ అడ్రస్‌లో ఉన్నవారిని కలిసేందుకు, ఆ చిరునామాకు చేరుకునేందుకు వీలు కలగకుండా సెక్యూరిటీ సిబ్బంది నిరాకరిస్తున్నారు. అనవసరమైన ఆంక్షలతో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ దృష్టికి హైదరాబాద్ పోస్ట్‌మాస్టర్ జనరల్ తీసుకొచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిహెచ్‌ఎంసి పరిధిలోని డిప్యూటీ కమిషనర్లకు ప్రత్యేక సూచనలు కమిషనర్ చేశారు. పోస్టుమేన్‌లతో పాటు ప్రజావసరాల నిమిత్తం విధి నిర్వహణలో భాగంగా ఆ ప్రాంతాలకు వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన సదుపాయాలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్‌లను ఆయన ఆదేశించారు. ప్రధానంగా వివక్షత లేకుండా ప్యాసింజర్ లిఫ్టులు, వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, నేరుగా పోస్టల్, పార్సిల్ పరికరాలను అందజేసే వీలుండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అందుకు ఆయా సంఘాలతో చర్చించాలన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఎఐ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద్




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** శనివారం రోజు 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భగత్ సింగ్ మార్గ్‌లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ.) తరగతి గదులను బిఆర్‌ఎస్ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని ఎదగాలని విద్యావిధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా రోబోటిక్ విద్య ఎంతో అవసరమన్నారు. విద్యా వ్యవస్థలో రోజురోజుకు పెరుగుతున్న మార్పులకు అనుగుణంగా సాధారణ విద్యతోపాటు, సాంకేతిక విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముందుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చైతన్య పాఠశాలలో రోబోటిక్, ఏఐ ల్యాబ్ ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల యాజమాన్యానికి అయన అభినందనలు తెలిపారు. రోబోటిక్ ద్వారా సులభతరంగా పాఠ్యాంశాలు విద్యార్థులు అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి, కార్పొరేటర్ జగన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జె.నాగరాజు, కోశాధికారి పరుశురాం గౌడ్, వివిధ ట్రస్మా కే.శ్రీనివాస్ చారి, నర్సిరెడ్డి, శ్రీకాంత్, సుశీల్ కుమార్, కాశిరెడ్డి, సుబ్రహ్మణ్యం, షోయబ్, అంజన్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, ధన్ సాగర్ తో పాటు వివిధ పాటల కరస్పాండెంట్ లు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**డబుల్ 'బెడ్ రూమ్' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**నిజాంపేట్ :** డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై హౌసింగ్, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులతో వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయా ల్లో మంజీరా నీరు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, లిఫ్టుల నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు తదితర సదుపాయాలను కల్పించాలని అన్నారు. విద్యుత్ మీటర్లను జిహెచ్‌ఎంసి పేరున కాకుండా లబ్దిదారుల పేరుకు మార్చి బిల్లులను ఇవ్వాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణను చేపట్టి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ సమయంలో అందరికి ఉపయోగపడే విధంగా ఆరోగ్య కేంద్రంతో పాటు మహిళ, శిశు, గర్భిణిలకు ఉపయోగపడే అంగన్‌వాడీసెంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు.

దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లవద్ద విద్యార్థుల కోసం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని, అధికారులు సముదాయాల్లో మౌలిక వసతుల కల్పన ప్రత్యేక దృష్టి సారించి సమకూర్చాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్‌లు సాబెర్ అలీ, వెంకటేశ్ నాయక్, హౌసింగ్ కార్పొరేషన్ ఇఇ రవీందర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ



**ప్రజాపక్షం/కొడంగల్ :** ఫీర్ల పండుగను పురస్కరించుకుని శనివారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని మసీద్‌లో ప్రతిష్టించిన బీబీ ఫాతిమా అలీ అబ్బాస్, ఇమామ్ ఖాసీమ్ ఫీర్లకు పూలు, దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతు మత సామరస్యానికి ప్రతీక ఫీర్ల పండుగ అని ప్రతి ఒక్కరు ఈ పండుగలో బాగస్వాములై శాంతియుతంగా పండుగను నిర్వహించుకుంటారని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని షాబాజర్ పెద్ద మసీద్ సమీపంలో ప్రతిష్టించిన హోల్ సాబ్ కాసీం దూల అలీ అబ్బాస్ ఫీర్లకు మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబులు పూలు, దట్టీలతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉపసర్పంచ్ ఎస్‌ఎం గౌసన్, వాహేద్ రజ, అబ్దుల్ సత్తార్, రహమత్‌ఖాన్, సతీష్‌లతో పాటు తదితరులు పాల్గోన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత

### ఎంపిడిఓ కరీం



**ప్రజాపక్షం/పరిగి :** పరిగి మండలపరిధిలోని పాలు గ్రామ పంచాయతీలను అందులో పోల్కంపల్లి, పేట మాదారం, మాధారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కరీం మాట్లాడు తూ, గ్రామాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, అంటురోగాలు రాకుండా కార్యక్రమంలో బాగంగా గ్రామంలోని వీధులను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని తొలగించాలని లేదంటే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామ ప్రజలకు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్ చేయడం జరిగింది. గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పిచ్చి మొక్కల తొలగింపు, గ్రామాలకు కేటాయించిన మొక్కల లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని ఇందిరమ్మ ఇండ్లు మార్కింగ్ నిర్మాణంలో వేగవంతం పెంచాలని పంచాయతీఇ కార్యదర్శిలకు సూచించారు.

### కార్మిక హక్కుల పరిరక్షణకోసం

## దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె

### సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ కార్మిక హక్కుల పరిరక్షణకోసం దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి కోరారు. దేశానికి స్వాతంత్రం రాకముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులు పోరాటాలు నిర్వహించి అనేక హక్కులు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం క్రమక్రమంగా కార్మికుల హక్కులను కాలరాసే విధంగా 44 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడులుగా విభజించడం గర్హనీయమన్నారు. ఇక కంపెనీలలో, వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు పనిచేస్తున్న చోట కార్మిక సంఘాన్ని నెలకొల్పాలంటే కనీసం వందమంది సభ్యులు ఉండాలని నిబంధన విధించటం అనేది అత్యంత దుర్మార్గమన్నారు. శ్రమనే నమ్ముకుని బతుకుతున్న కార్మికవర్గం ద్రోహం చేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారుల యొక్క ప్రయోజనాలను కోసం మాత్రమే పనిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మికరంగం ఒక బలమైన ఉద్యమానికి సిద్ధపడుతూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో సకల జనులు పాల్గొని విజయవంతం చేయాలని ఛాయాదేవి శనివారం ఓ ప్రకటనలో కోరారు.




## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు డివైఎఫ్ఐ, ఐద్వా మద్దతు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సంఘాల మద్దతు జులై 9వ తారీకు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా కుత్బుల్లాపూర్ మండల కమిటీలు సమ్మెకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తు షాపూర్ నగర్ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి మాట్లాడుతూ, యువతీ యువకులు, మహిళలు, నిరుద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, జులై 9న సార్వత్రిక సమ్మెను మన ప్రాంతంలో కూడా జయప్రదం చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని 8 గంటల పని విధానం ఉండాలని అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వరంగాన్ని కాపాడుకోవాలని, కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాల రద్దు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఎండి.భాష, యువజన సంఘం నాయకులు సాయికుమార్, బీరయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు శామీర్‌పేట మండల బాధ్యుడు కిష్టప్ప పిలుపునిచ్చారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటిలో మున్సిపల్ కార్మికులతో కలిసి దేశవ్యాప్త కార్మికుల సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో కేంద్ర, రాష్ట్ర, కార్మిక సంఘాలు ఫెడరేషన్లు, అసోసియేషన్లు అన్ని రంగాల కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ముత్యాలు, హరికృష్ణ, ఆరోగ్యం, అనిత, లక్ష్మి ,శోభ,తదితరులు పాల్గొన్నారు.

## భర్త గొంతు నులిమి హత్య చేసిన భార్య

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కట్టుకున్న భర్త గొంతు నులిమి ఓ భార్య హత్య చేసిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా, రామకృష్ణయ్య పల్లి గ్రామానికి చెందిన అంజిలప్ప 2014 సంవత్సరంలో రాధ అనే మహిళని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్, ముంబైలలో కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. గత కొద్ది నెలలనుండి బాచుపల్లిలోని ప్రతీక్ కన్‌స్ట్రక్షన్స్‌లో దంపతులిద్దరు కూలీ పనులు చేస్తున్నారు. అంజిపల్ల నిత్యం మద్యం సేవించి అనుమానంతో భార్య రాధను వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన రాధ ఈ జూన్ 22వ తేదీన రాత్రి మద్యం మత్తులో ఉన్న అంజిలప్ప గొంతు నులిమి హత్య చేసింది. మరుసటి రోజైన 23న ఉదయం అంజిలప్ప సహజంగానే మరణించాడని తాను పనిచేస్తున్న తోటి కార్మికులను నమ్మించి అంత్యక్రియల నిమిత్తం అంజిలప్పను స్వగ్రామానికి తరలించింది. స్వగ్రామంలో అంజిలప్ప గొంతుపై చారలు ఉండటంలో అతని సోదరుడు



శవ పరీక్ష నిర్వహించి అంజిలప్పను హత్య చేసినట్లుగా గుర్తించాడు. ఈ మేరకు మహబూబ్ నగర్, రామకృష్ణయ్య పల్లికి చెంది ఠాణా నుండి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కి కేసును బదిలీ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని నిందితురాలిని అందుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలపై తగు జాగ్రత్తలు

### జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను పరిశీలించి మర్పులు చేర్పులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శనివారం ధారూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులకు, సుపర్‌వైజర్లకు జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6,7,8 నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ జాబితాలో అవసరమైన చో పాత పోటోలు తొలగించి ఓటర్లకు సంబంధించిన నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు చేయాలని కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఫారం 7 ద్వారా తొలగించాల్సినవి, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఫారం 8ను పేరు మార్పులకు వినియోగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపిడిఒ నర్సింలు ఎలక్షన్ డిటి అనిత తదితరులు పాల్గొన్నారు.




**రాష్ట్ర,కేంద్ర పథకాల రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి :** రైతు రుణాలు,రాష్ట్ర కేంద్ర పథకాల రుణాలు మంజురుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, యువత, స్త్రీలకు ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి అన్ని రంగాలలో అభివృద్ధికి ఆర్థిక సహాయాన్ని అందించడం ద్వారా ప్రభుత్వం లక్ష్యాలను నెరవేర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ బ్యాంక్ అధికారులను అదేశించారు. బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ,కేంద్రా , రాష్ట్ర ప్రభుత్వాల బ్యాంకు లింకేజీ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలని బ్యాంకర్లను అదేశించారు. రుణాల మంజూరు విషయంలో సమస్య ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకర్లదేనని అన్నారు. ఈ సంవత్సరానికి 8,527,05 కోట్లు నిర్ధారించా బడినవని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు నూరు వాతం ప్రజకు డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణఅభివృద్ధి అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, ఆర్‌బిఐ నాబార్డ్ మేనేజర్ హర్ష, జిల్లా పరిశ్రమల అధికారి మహేశ్వర్, తదితరులు పాల్గోన్నారు.

# క్రీడ

# గిల్ మరో సెంచరీ

## ఆ ఘనత సాధించిన తొలి ఇండియన్ క్రికెటర్..



తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో అలరించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటాడు. మరో అద్భుత శతకం సాధించాడు. ఇప్పటివరకు జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో గిల్‌కు ఇది మూడో సెంచరీ. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులకు ఆలౌట్ అయిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో గిల్ శతకంతో భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎంతో ఓర్పు, సంయమనంతో చూడ చక్కని ఇన్నింగ్స్ ఆడిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం వేగంగా పరుగులు చేశాడు. మరో సెంచరీ చేశాడు. 127 బంతుల్లో 100 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి ఇండియన్ క్రికెటర్‌గా నిలిచాడు. తాజా మ్యాచ్‌లో గిల్ 369 పరుగులు చేశాడు. ఇంతకు ముందు ఈ రికార్డు సునీల్ గవాస్కర్ (344 వెస్టిండీస్‌పై) పేరిట ఉండేది. అలాగే ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ, సెంచరీ సాధించిన రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా తొమ్మిదో అంతర్జాతీయ క్రికెటర్‌గా నిలిచాడు. ప్రస్తుతానికి టీమిండియా 4 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ప్రస్తుతానికి టీమిండియా ఇంగ్లండ్‌పై 484 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## చరిత్ర సృష్టించిన వైభవ్..!

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి చరిత్ర లిఖించాడు. పద్నాలుగేళ్లకే ఐపిఎల్‌లో 35 బంతుల్లోనే శతకంతో రికార్డులు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఇంగ్లాండ్‌పై తన ప్రతాపం చూపించాడు. అండర్ 19 జట్టు తరపున ఆడుతున్న ఈ కుర్రాడు శుక్రవారం 52 బంతుల్లోనే సెంచరీతో చెలరేగాడు. నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు బౌలర్లపై ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడిన వైభవ్ మూడంకెల స్కోర్‌తో గర్జించాడు. ఐపిఎల్ 18వ సీజన్‌లో వేగవంతమైన సెంచరీతో వార్తల్లో నిలిచిన వైభవ్.. విదేశీ గడ్డపై కూడా పరుగుల వరద పారిస్తున్నాడు. ఇంగ్లాండ్ అండర్ 19 జట్టుతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న ఈ హిట్టర్ శుక్రవారం తన విధ్వంసాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు. ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోస్తూ 52 బంతుల్లోనే శతకంతో తన సత్తా ఏంటో మరోసారి ప్రపంచానికి చాటాడు. కేవలం 78 బంతుల్లోనే 143 రన్స్‌తో భారత్‌కు భారీ స్కోర్ అందించాడీ యువకెరటం. అతడి విధ్వంసానికి పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ పేరిట ఉన్న రికార్డు తుడిచిపెట్టుకు పోయింది. పన్నెండు ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన వైభవ్‌ను మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.1.5 కోట్లకు రాజస్థాన్ శిబిరంలో చేరిన ఈ కుర్రాడు తన బ్యాటింగ్‌ను సాన బెట్టుకున్నాడు. కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో లక్నోతో మ్యాచ్‌లో వైభవ్‌కు ఓపెనర్‌గా అవకాశం వచ్చింది.



తొలి పోరులోనే 35 పరుగులతో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు.. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో గర్జించాడు. ఐపిఎల్ హిస్టరీలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకే అన్నట్టు చెలరేగిన వైభవ్.. 35 బంతుల్లోనే వందతో జైపూర్ ప్రేక్షకులకు సెల్యూట్ చేశాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 11 సిక్సర్లు ఉండడం విశేషం. ఐఎల్‌లో వేగవంతమైన సెంచరీ బాదిన వాళ్లలో క్రిస్ గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడుతున్న రోజుల్లో గేల్ 30 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. 35 బంతుల్లోనే వంద కొట్టేసిన వైభవ్ రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. యూసుఫ్ పఠాన్, డేవిడ్ మిల్లర్‌లు కూడా ఫాస్టెస్ట్ సెంచరీ వీరుల జాబితాలో ఉన్నారు.


## బంగ్లాలో భారత్ పర్యటన వాయిదా..!



బంగ్లాదేశ్–భారత్ మధ్య జరగాల్సిన వన్డే సిరీస్ 2026 సెప్టెంబర్‌కు వాయిదా పడింది. ఈ విషయాన్ని బిసిసిఐ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. వాస్తవానికి ఈ సిరీస్ వచ్చే ఆగస్టులోనే జరగాల్సి ఉంది. ప్రస్తుతం బంగ్లాలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ నియంత్రణ బోర్డు వన్డే, టీ20 సిరీస్‌లను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్ణయించాయి. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. అయితే, రాజకీయ అనిశ్చితి కారణంగా బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నా యి. ఆగస్టులో జరగాల్సిన వన్డే, టీ20 సిరీస్‌కు బంగ్లాదేశ్‌కు భారత జట్టును పంపేందుకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం జట్టును భారత్‌కు పంపేందుకు అనుమతి ఇవ్వలేదని సమాచారం. అయితే, రాజకీయ అనిశ్చితి కారణంగా బంగ్లాదేశ్‌లో తీవ్ర అలజడి వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సిరీస్ వాయిదా వేసేందుకు బిసిసిఐ మొగ్గు చూపినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే, ప్రస్తుతానికి సిరీస్‌ను రద్దు చేయకుండా ఏడాది వాయిదా వేసేందుకు బిసిసిఐ, బిసిబి అంగీకరించాయి. సెప్టెంబర్‌లో నైనా కేంద్రం నుంచి అనుమతి వస్తుందా లేదా అన్నది ఎదురుచూడాల్సిందే. ఇదిలా ఉండగా.. భారత్–బంగ్లాదేశ్ చివరిసారిగా ఈ ఏడాది జరిగిన ఐసిసి చాంపియన్స్ ట్రోఫీలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండు జట్లు చివరిగా 2024లో భారతదేశంలో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో ఆడాయి. ఇందులో రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి.

# ఫోకస్ స్పోర్ట్స్






## ఆరోగ్యానికి సైక్లింగ్

సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది సులభంగా చేయగల వ్యాయామం. రోజూ కనీసం 15 నుంచి 30 నిమిషాలు సైక్లింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది, రక్త ప్రసరణ బాగా జరుగుతుంది, బ్లడ్ షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. బిపి సమస్యలు తగ్గుతాయి. సైక్లింగ్ వల్ల కాళ్ల, తొడల, పిక్కల కండరాలు బలంగా మారతాయి. ఎముకల బలం పెరుగుతుంది, ఆర్థరైటిస్ వంటి కీళ్ల సమస్యలకు సహాయం చేస్తుంది. సైక్లింగ్ జీవక్రియ రేటును పెంచి శరీరంలో కొవ్వు కరిగించడంలో సహాయపడుతుంది. గంట సేపు సైక్లింగ్ చేస్తే, సుమారు 300 కేలరీలు బర్న్ అవుతాయి. ఇది బరువు నియంత్రణకు ఉపయోగపడుతుం ది. సైక్లింగ్ వల్ల మానసిక ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జయిటీ తగ్గి, మెదడు చాలా చురుగ్గా పనిచేస్తుంది. ఇది కీళ్లపై తక్కువ ఒత్తిడి కలిగించే వ్యాయామం కాబట్టి, మోకాళ్ళు, కీళ్లకు ఎలాంటి అదనపు ఒత్తిడి ఉండదు. సైక్లింగ్ వల్ల పెద్దప్రేగు, రొమ్ము కేన్సర్ ప్రమాదం తగ్గుతుంది. అలాగే టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని నిపుణులు అంటారు. సైక్లింగ్ వల్ల శరీరానికి మంచి ఆక్సిజన్ సరఫరా జరుగుతుంది, ఇది రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. స్థూలంగా చెప్పాలంటే, సైక్లింగ్ ఆరోగ్యాన్ని సమగ్రంగా మెరుగుపరచే, సులభంగా చేయగల వ్యాయామం. రోజువారీ అలవాటుగా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు అందుకోవచ్చు.

## మహిళా సైక్లిస్టులకు పరీక్ష గిరో డెఇటాలియా

పురుషులకు మాత్రమే పరిమితమనుకున్న ఎన్నో క్రీడా విభాగాల్లో మహిళలు సైతం దూసుకెళుతున్నారు. అత్యంత కష్టతరమైన క్రీడల్లో ఒకటిగా పేర్కొనే సైక్లింగ్‌లోనూ మహిళలు రాణిస్తున్నారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకూ జరిగే ఇటలీలో జరిగే 'గిరో డెఇటాలియా' మహిళా సైక్లింగ్ చాంపియన్‌షిప్స్ వారి సామర్థ్యానికి పరీక్ష పెట్టడం ఖాయం. అంతర్జాతీయ సైక్లింగ్ యూనియన్ (యుసిఐ) ఆధ్వర్యంలో జరిగే ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఈ చాంపియన్‌షిప్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. మహిళల విభాగంలో జరిగే 'టూర్ డెఫ్రాన్స్ ఫెమ్మీస్' తర్వాత, 'గిరో డెఇటాలియా' రెండో స్థానంలో ఉంది. ఇందులో పాల్గొనే అర్హత సంపాదించడమే గొప్ప విజయంగా సైక్లిస్టు భావిస్తారు. యుసిఐ ఉమెన్స్ వరల్డ్ టీమ్స్ 15, ఉమెన్స్ ప్రో టీమ్స్ 2, ఉమెన్స్ కాంటినెంటల్ టీమ్స్ 5 చొప్పున మొత్తం 22 జట్లు వివిధ విభాగాల్లో టైటిళ్ల కోసం పోటీపడతాయి. ఇండివిజువల్ విభాగంలో నిరుటి విజేత ఎలిసా లాన్గో బొర్గిని మరోసారి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంది. ఎనిమిది రోజులు, ఎనిమిది దశల్లో రేస్ కొనసాగుతుంది. ఈ నెల 6వ తేదీ, మొదటి రోజున బెర్గామో నుంచి మొదలయ్యే ఇండివిజువల్ టైమ్ ట్రయల్ 13.6 కిలోమీటర్లు కొనసాగుతుంది. రెండో రోజు (జులై 7) క్లూసోన్ నుంచి అప్రికా వరకు హిల్లీ స్టేజ్ రేస్ 99 కిలోమీటర్లు ఉంటుంది. మూడో రోజు (జులై 8) వెజ్జా డి ఒగ్లియో నుంచి ట్రెంటో వరకు 124 కిలోమీటర్ల హిల్లీ స్టేజ్ రేస్‌ను నిర్వహిస్తారు. నాలుగో రోజు (జులై 9) కాస్టెల్లో టెసినో నుంచి పియానెజ్జె (వ్లాడొబియన్‌డెన్) వరకు మౌంటైన్ స్టేజ్ రేస్ 156 కిలోమీటర్లు కొనసాగుతుంది. ఐదో రోజు (జులై 10) మిరానో నుంచి మొసెలిస్ వరకూ 108 కిలోమీటర్ల దూరం ఫ్లాట్ స్టేజ్ రేస్ ఉంటుంది. ఆరో రోజు (జులై 11) బెల్లారియా నుంచి ఇగియా మారియా వరకు 144 కిలోమీటర్ల హిల్లీ స్టేజ్ రేస్‌ను నిర్వహిస్తారు. ఏడో రోజు (జులై 12) ఫెర్మిగ్నానో నుంచి మాంటే నెరోన్ వరకూ 157 కిలోమీటర్ల మౌంటైన్ స్టేజ్ రేస్ జరుగుతుంది. ఈ మొత్తం ఈవెంట్‌లో ఇదే అత్యంత క్లిష్టమైన దశ. చివరిదైన ఎనిమిదో రోజు (జులై 13) ఫోర్లీ నుంచి ఇమోలా వరకూ 138 కిలోమీటర్ల దూరం జరిగే రేస్‌తో 'గిరో డెఇటాలియా' ముగుస్తుంది. మొత్తం ఈ రేస్‌లో మహిళా సైక్లిస్టులు 939.6 కిలోమీర్ల దూరాన్ని పూర్తి చేస్తారు.

## ప్రఖ్యాత మహిళా సైక్లిస్టులు..




**అన్నెమీక్ వాన్ వ్ల్యూటెన్:** నెదర్లాండ్స్‌కు చెందిన రోడ్ సైక్లిస్టు. ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్.

**ఎలిసా లాన్గో బొర్గిని:** ఇటలీకి చెందిన సైక్లిస్ట్. రోడ్ ఈవెంట్స్‌తోపాటు, మౌంటైన్, హిల్ విభాగాల్లోనూ రాణిస్తున్నది. గత ఏడాది 'గిరో డిఇటాలియా' విజేతగా నిలిచింది.

**మారియన్ వోస్:** నెదర్లాండ్స్‌కు చెందిన మల్టీడిసిప్లిన్ సైక్లిస్టు, పలు వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లు, ఒలింపిక్ పతకాలు గెల్చుకుంది.

**ఎలెన్ వాన్ డైక్:** టైమ్ ట్రయల్ స్పెషలిస్ట్, వరల్డ్ టైమ్ ట్రయల్ ఛాంపియన్, అవర్ రికార్డ్ హోల్డర్.

**క్రిస్టిన్ ఆర్మ్‌స్ట్రాంగ్:** అమెరికా నుంచి వచ్చిన మూడు ఒలింపిక్ గోల్డ్ మెడల్స్ సాధించిన రోడ్ టైమ్ ట్రయల్ స్పెషలిస్ట్.

**ఫాబియానా లూపెర్జిని:** ఇటలీకి చెందిన మల్టిపుల్ జిరో డోనె విజేత.

**లిజీ డెగనన్:** బ్రిటన్‌కు చెందిన వరల్డ్ ఛాంపియన్, ఒలింపిక్ పతక విజేత.

# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ




**ప్రజాపక్షం/బోధన్ :** కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి ప్రస్తుత రాజ్యాంగంలో ఉన్న సోషలిజం, సెక్యులరిజం తొలగించి మనువాదం తెచ్చే కుట్రలు చేస్తున్నదని రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శనివారం సిపిఐ బోధన్ మండల మహా సభ లెర్నర్ స్కూల్ ఆవరణలో కంజర భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మైనార్టీ ప్రజలపై దాడులు చేస్తూ భయానక పరిస్థితి నెలకొల్పుతున్నదని అన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు ఊడిగం చేయటంలో భాగంగానే అమెరికా దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా జూలై 9న జరిగే సమ్మెలో గ్రామీణ ఉపాధి కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. సిపిఐ గ్రామ శాఖ, మండల, జిల్లా మహాసభ జరుపుకొని ఆగస్టులో మేడ్చల్ జిల్లాలో రాష్ట్ర మహా సభలు, సెప్టెంబర్‌లో చండీగర్ రాష్ట్రంలో జాతీయ మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహా సభల సందర్భంగా అన్నీ శాఖలలో ప్రజా సమస్యలను చర్చించి పోరాటాలను రూపొందించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ బోధన్ మండల కార్యదర్శిగా రాధాకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఖురేషి, కార్తిక్ సభ్యులుగా హనుమంతరావు, యాదు, ఎస్కే మన్నన్, మహమ్మద్, గౌస్ సలీం, ఎం.వెంకటేష్, డి.శంకర్, బోధన్ రూరల్ మండల కార్యదర్శిగా జయమ్మ, సహాయ కార్యదర్శిగా గౌతమ్ ప్రకాష్ పటేల్ సభ్యులుగా గైని రాములు, సాయిబాబా, గంగవ్వలను ఎన్నుకున్నారు.

# 'ఉపాధి' పథకానికి నిధులు పెంచండి

### బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 9వ మహాసభలను జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలకొండ కాంతయ్య మాట్లాడుతూ కూలీలు పనిచేస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచడంతోపాటు పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2005లో ఉపాధి హామీ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని, అప్పట్లో వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి బ్రహ్మాండంగా సాగిందని వివరించారు. క్రమక్రమంగా ఈ పథకానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం, ఉద్యోగులను తొలగించడం వెనుక ఉద్దేశం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తుందని, ఉపాధి హామీ పథకం జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఐదు లక్షలు ప్రోసిడింగ్స్‌లు దళిత, గిరిజనుల లబ్ధిదారుల చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటుందని మండిపడ్డారు. చిత్తశుద్ధి లేని హామీలు ఇస్తున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు పరచడంలో పునర్ ఆలోచన చే యాలని సూచించారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఉచిత బియ్యం ఇచ్చి ప్రజల ఓట్లు కొల్లగొట్టి అధికార దాహంతో జల్సాలు చేస్తున్నారని వాపోయారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఎఐటియు సి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతూ ఈ మహాసభలు మూడేళ్లకు ఒకసారి జరుగుతాయని, ఈ మూడు సంవత్సరాల కాలంలో మరణించిన కార్మికులకు సంతాపం తెలిపారు. మూడేళ్లకు సంబంధించిన రిపోర్టును జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ప్రవేశపెట్టగా మండల నాయకత్వం చర్చల్లో పాల్గొని చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.లక్ష్మయ్య, రమేష్ యాదవ్, జిల్లేల వెంకటేష్, తదితరులులలపాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాల మద్దతు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో జరిగిన వామపక్షాల సంయుక్త సమావేశంలో మేకల రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గత పదకొండు సంవత్సరాలుగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న నలభై నాలుగు కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్ లను ఏర్పాటు చేసి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తునా, మోడీ పాలనను గమనిస్తే పూర్తిగా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నాడని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన కోసం, రైతుల సంక్షేమం కోసం, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం, మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను ఈ నెల 9న జయప్రదం చేయాలని, సంఘటిత, అసంఘటిత రంగ ఉద్యోగులకు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని ఈనెల 8న వ రంగల్ చౌరస్తాలో అన్ని వామపక్ష పార్టీలతో సమ్మెకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో కార్మిక వర్గ శ్రే యోభిలాష లు రైతు పక్షపాతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా మోదీ ప్రభు త్వం కొనసాగిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని లేదంటే రానున్న రోజుల్లో అన్ని కార్మిక సం ఘాలు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ఉద్యమాలను ఉధృతం చేస్తామని మోదీ ప్రభుత్వా న్ని గద్దె దించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు . ఈ సమావేశానికి న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఏలాంటీ ప్రయోజనాలు లేవని, బడా కార్పొరేట్ వ్యాపార వర్గాల ప్రయోజనాల కోసం మాత్రమే వాటిని అమలు చేస్తున్నారని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు విమర్శించారు. శనివారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశంలో పాల్గొని జూలై 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు బిజెపి ప్రభుత్వ మనుగడకు తోడ్పడే విధంగానే ఉన్నాయే తప్ప, కార్మికులకే ఏమాత్రం మేలు చేసేవి కావన్నారు. బిజెపి ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లెబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, జులై 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడేపూ రాజమొగిలి, కొంకుల రాజేష్, విజ్జగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటికీ సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. రానున్నది వర్షాకాలమని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొన్ని బిల్డింగ్స్ శిథిలావస్థలో ఉన్నాయని అలాంటి పాఠశాలల బిల్డింగ్‌ను గుర్తించి డిస్మెంటల్ చేసి నూతన భవనాలు నిర్మించాలన్నారు. అదే విధంగా తరగతులకు అనుగుణంగా టీచర్స్‌ను నియమించాలని, పాఠశాలలో పరిశుభ్రత కోసం స్కావెంజర్స్‌లను నియమించాలన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు పరిమిషన్ లేకుండా నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇష్టానుసారంగా సిటీ నగరంలో హోల్డింగ్‌ను పెట్టి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలన్నారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ హరీష్, శివకుమార్, సోను, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు



## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర




### అధిక ఫీజుల వసూళ్లకు ప్రభుత్వం వత్తాసు ప్రజాప్రతినిధుల విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలి : కసిరెడ్డి మణికంఠరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. పెండింగ్ బకాయిలపై పూటకో మాట మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాట మాడుతుందన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని, ప్రజాప్రతినిధులు సేవకులైతే వారి విద్యాసంస్థల్లో ఉచిత విద్య ఇవ్వాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు పేరుతో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరిస్తుందని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి కేటాయింపు ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అధికారంలోకి వస్తే ఒకేసారి బకాయిలు విడుదల చేస్తామన్న రేవంత్‌రెడ్డి నేడు 18 నెలలు కావస్తున్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. అన్ని బకాయిలను విడుదల చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రూ.8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ విద్యాను వ్యాపారంగా మారుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉ న్న వారి విద్యాసంస్థలను ప్రభుత్వం వెంటనే ప్రభు త్వ విద్యాసంస్థలుగా మార్చాలని, అందులో ఉచిత విద్య అందించాలని, రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి ఆర్టీసీలో ఉచిత రవాణా అందించాలని, ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యార్థినులకు తక్ష ణమే ఎలక్ట్రిక్ స్కూటీలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెం టనే వివడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చరమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కేశబోయిన రాము యాదవ్, కనకం సాగర్ తదితరులున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ : విద్యార్థులకి మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం సూర్యాపేట మండలం బాలెంలలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలు, వంట సామాగ్రిని పరిశీలించారు.





## జూరాలకు కొనసాగుతున్న వరద

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి : కర్ణాటక జలశయాల నుంచి జూరాల ప్రాజెక్టు జలశయంలోకి శనివారం సాయంత్రం 1,20,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో డ్యాం అధికారులు 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. స్పిల్ వే ద్వారా 92,890 క్యూసెక్కులు బయటకు వెళ్తుండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,571 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తంగా 1,24,710 క్యూసెక్కుల వరద నీరు ప్రవ హిస్తోంది. కాగా, జురాల డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.518 మీటర్లు ఉండగా ప్రస్తుతం నీటిమట్టం 317.390 మీటర్ల వద్ద ఉన్నది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.444 టీఎంసీలు నీటి నిల్వ ఉంది.

## విపత్తుల నిర్వహణకు సంసిద్ధం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారులకు తెలిపారు.శనివారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారుల బృందం జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్, అండర్ సెక్రెటరీ అభిషేక్ బీస్వాల్ , వసీం ఇక్బాల్‌ల బృందం రాష్ట్ర విపత్తుల నిర్వహణ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో ఒక రోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయస్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలో జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామని,ఇందులో అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పవర్ మాట్లాడుతూ పోలీస్ తరపున జిల్లాలో 12 వ పోలీస్ బెటాలియన్ ఉందని ,ఒక కంపెనీ దళాలు (సుమారు 80 నుండి 100 మంది) కి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ కింద 2021 లో ఆపదమిత్ర వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని జిల్లాలలో ఆపదమిత్రలను ఏర్పాటు చేస్తున్నామని, అంతేకాక విపత్తుల సమయంలో అవసరమైన రిసోర్సెస్ ఏర్పాటు చేస్తున్నామని, ఆపద మిత్రుల శిక్షణ, విపత్తుల్లో వారు తీసుకోబోయే చర్యలపై అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కోర్టులను తనిఖీ చేసిన జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నాగరాజు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నాగరాజు శనివారం పట్టణంలోని కోర్టులను తనిఖీ చేశారు. తొలిసారి మిర్యాలగూడకు వచ్చిన ఆయనకు ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎ.భూపతిరెడ్డి, కోశాధికారి సాయికుమార్‌లు మొక్క అందించి స్వాగతం పలికారు. సముదాయంలోని కోర్టులను, రికార్డులను, న్యాయమూర్తుల నివాస గృహాలను పరిశీలించారు. కోర్టులో పెండింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. కోర్టులో పెండెన్సీ తగ్గించాలన్నారు. బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ కోర్టు ఆవరణలో మహిళాశక్తి క్యాంటీన్, జిరాక్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం లింగయ్య, శ్రీనివాస్, బాలు, నాయుడు, ఎల్లయ్య, ప్రసాద్, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

## సాగర్ సందర్శించిన విపత్తు నిర్వహణ పర్యవేక్షణ బృందం

ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను కేంద్ర విపత్తు నిర్వహణ పర్యవేక్షణ బృందం సభ్యులు సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన డ్యాము ను సందర్శించి పరిశీలించారు అనంతరం బుద్ధ వనమును చేరుకొన్న ఈ బృందం బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి ఆపైన బుద్ధ చరితవనం, జాతక వనం, ధ్యానవనం,స్థూప వనాలను సందర్శించి మహాస్తుపంలోని ధ్యాన మందిరంలో కొద్దిసేపు గడిపారు. ధ్యాన మందిరంలోని బుద్ధ భగవానుని వద్ద బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన ఈ బృందంచే బుద్ధ జ్యోతిని వెలిగించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు ఈ బృందంలో నావెల్ ప్రకాష్ అభిషేక్ విశ్వాన్ బి పి యాదవ్, సలీం ఉన్నారు.



## పెట్టుబడీదారులకు కొమ్ముకాస్తూ

9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

పల్లా దేవేందర్ రెడ్డి

ప్రజాపక్షం/ నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపైన రైతుల పైన దాడి తీవ్రతరం చేసిందని , కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గాన్ని తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెబుతున్నారని ఆరోపించారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షత వహించగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి ఎండి సయీద్, పి వెంకట్ రావు, దోటి వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, బరిగల వెంకటేష్ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు ,వి లెనిన్‌పాల్గొన్నారు.

# కార్మిక వర్గానికి అన్యాయం

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట కార్యదర్శి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/కోదాడ: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని కార్పెంటర్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వతంత్రం వచ్చిన కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని, భారతదేశంలో 50 కోట్లమందికి పైగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు నాడు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు కోడ్‌లుగా విభజిస్తున్న చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అసంఘటితనంగా కార్మికులకు సమగ్ర కార్మిక విధానాలను రూపొందించాలని, కార్మికులకు భద్రత సౌకర్యం కల్పించాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఇన్సూరెన్స్ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రక్రియ ఆలోచనను విరమించుకోవాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేసుకుని గతంలో 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు విద్యాచారి, యూనియన్ అధ్యక్షులు రేవుల సత్యం, గౌరవ అధ్యక్షులు శ్రీధర్, సమన్వయ చైర్మన్ అంజి, వీరచారి, సత్యనారాయణ, వెంకటచారి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/నేరేడుచర్ల(గరిడేపల్లి): కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి సార్వత్రిక సమ్మెను గరిడేపల్లి మండలంలో విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు షేక్ యాకుబ్ లు కార్మికులకు, రైతులకు అన్ని వర్గాల ప్రజలను కోరారు. శనివారం గరిడేపల్లి మండలం కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో మండల టిడిపి అధ్యక్షులు కీసర నాగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఎం నాయకులు దోసపాటి బిక్షం, బేల్లేపల్లి శ్రీనివాస్, మండల ఏఐటియుసి నాయకులు బెజ్జం రమేష్, నాయకులు పంగ సైదులు, వెంకటరెడ్డి,ప్రతాని సైదులు పాల్గొన్నారు.







## బాలసదనం పనుల్లో వేగం పెంచండి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని పానగల్ రహదారిలో కోటి 34 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాలసదనం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.శనివారం ఆమె బాలసదనం నిర్మాణ పనులను పరిశీలించారు. బాలసదనం ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అన్నారు.బాల సదనం పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా ఈ బాలసదనంలో అదనపు బ్లాకులనిర్మాణానికి గాను 60 లక్షల రూపాయల అదనపు బడ్జెట్ కావాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి జిల్లా కలెక్టర్ ను కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆమె ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముజాబ్ అహ్మద్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: చేపల ప్రత్యుత్తి కారణంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్, దిగువ ప్రాంతం, వాడపల్లి వరకు ఈనెల 1 నుండి ఆగస్టు 31 వరకు చేపల వేటను నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు చరిత తెలిపారు.అందువల్ల మత్స్యకారులు ఈ నెల 1 నుండి ఆగస్టు 31 వరకు పైన పేర్కొన్న నిర్దేశిత ప్రాంతంలో చేపల వేట చేయరాదని, ఒకవేళ ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి చే పల వేట కొనసాగించినట్లయితే చట్టపరమైన చ ర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఇద్దరు గంజాయి నిందితులు అరెస్టు

రూ.2.8 లక్షల విలువైన 11కేజీల గంజాయి సీజ్

జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా వెల్లడి

ప్రజాపక్షం/సూర్యాపేట: నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సూర్యాపేట జిల్లా సిసిఎస్ పోలీసులు, కోదాడ రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి రూ.2.8 లక్షల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.నర్సింహా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కోదాడ మండలంలోని దొరకుంట గ్రామశివారులో ఉన్న ఇండ్రస్టియల్ ఏరియాలో ఐషర్ ట్రాక్టర్ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలోని పొదల్లో నమ్మదగిన సమాచారం ప్రకారం సూర్యాపేట జిల్లా సిసిఎస్, కోదాడ రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఇద్దరు నిందితులను పట్టుకుని, 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. అనంతరం వారిని విచారించగా కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన అడప రాజేష్, కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురకు చెందిన వనపర్తి సాయి, అలియాస్ సాయికుమార్ లుగా గుర్తించారు. అడప రాజేష్ ఇంటర్ చదివే సమయంలోనే తన స్నేహితుల గంజాయి సేవించే అలవాటు ఉందని, అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువు మానేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023లో కోదాడ రూరల్‌పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అతని గంజాయితో పట్టుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత కొద్ది రోజులు గంజాయి సేవించడం మానేశాడు. గత పదిరోజుల క్రితం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులో హాజరుకావడానికి అక్కడకి ఓరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అతనికి పరిచయమయ్యాడు. రాజేష్ తనకు గంజాయి తాగడానికి, అమ్మడానికి కావాలని అడగ్గ గత నెల 29వతేదీన ఓరిస్సా రాష్ట్రంలోని కళిమేళలో శివమందిర్ గుడివద్దకు రమ్మని చెప్పగా అక్కడకు వెళ్లి 11 కేజీల గంజాయిని 11వేల రూపాయలకు కొనుగోలు చేసి అక్కడనుండి పట్టుబడకుండా తన స్వగ్రామం దొరకుంటకు తీసుకవచ్చారు. తన ఇంట్లో పెడితే పోలీసులు పట్టుకుంటారని గ్రామ శివారులోని ఇండ్రిస్టియల్‌లోకి వెళ్లే దారిలో ఐషర్ ట్రాక్టర్ షోరూం వెనుక ఖాళీస్థలంలోని చెట్ల పొదల్లో దానిని దాచిపెట్టాడు. మరో నిందితుడు వనపర్తి సాయికుమార్ కూడా ఇతనికి జంటగా కలిశాడు. దీనికి ప్యాకెట్లుగా చేసి అమ్మేదుకు సిద్ధం చేయడంతో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా చేధించిన కోదాడ రూరల్ సిఐ రజితారెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ తో పాటు సిబ్బందిని ఎస్పి అభినందించారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.



## ప్రభుత్వం నాణ్యమైన విద్యపై దృష్టి

జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు నాణ్యమైన విద్య వాతావరణంపై దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. శనివారం గద్వాల్ మండలంలోని దౌదర్‌పల్లి, పరుమాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థినిలు ఉన్నా రు? వారికి సరిపడా బెడ్స్ (మంచాలు), మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా?లేదా? అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు. ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు నిద్రించే గదుల్లోకి వెళ్లి బెడ్స్, ఆహార పదార్థాలు వంట గదులు, మరుగుదొడ్లు, పాఠ్యపుస్తకాలు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, అట్టి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. పాఠశాలలో నాణ్యమైన క్రీడా సామాగ్రి, అవసరమైన సౌకర్యాలు, అన్ని క్రీడలకు అనుకూలమైన మైదాన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. హాస్టల్లో డైట్ ప్లాన్ అమలును పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అలివేలు, అనిల, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే ప్రభుత్వం భర్తీ చేయాలి

విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు

ప్రజాపక్షం/సూర్యాపేట: నిరుద్యోగులు సంఘటితమై శాంతియుతమైన పోరాటం ద్వారానే నిరుద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బిసి ఇంటలెక్స్‌వల్ ఫోరం వ్యవస్థాపకులు, విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు, తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకులు, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పృధ్వీరాజ్ యాదవ్, అశోక్ అకాడమి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పాలకూరి అశోక్ లు అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల సాధనకై అనుములపూరి జనార్ధన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిననిరుద్యోగ విద్యార్థి మహాసభకు వారు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. నిరుద్యోగులు సంఘటితం కావాలని, తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగ సమస్య తాండవిస్తుందని,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపే అన్ని ఖాళీలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. భవిష్యత్‌లో బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వాలు వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, మండల్ కమిషన్ ఓబిసిలకు 27శాతం రిజర్వేషన్లు కాకుండా కేవలం 22 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుందని దుయ్యబట్టారు. సేవాలాల్ సేన వ్యవస్థాపకులు సంజీవ్‌నాయక్, ఓయు జెఎసి నాయకులు వేణుకుమార్, చామకూరి రాజు, జివిగౌడ్, ఇంద్రనాయక్, అర్జున్, దామోదర్‌రెడ్డి, నర్సింహానాయక్, ఎల్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# జానకినగర్ తండాలో ఉద్రిక్తత

తమ భూముల్లో నుండి రోడ్డును పోనివ్వమని తండావాసుల ఆగ్రహం

పెట్రోల్ పోసుకుని తహసీల్దార్ కారును అడ్డగించిన తండావాసి

ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు): చిలుకూరు మండలంలోని జానకినగర్ తండా గ్రామంలో గత కొన్ని రోజులుగా వివాదస్పదంగా మారిన డొంకదారి భూమి సర్వే శనివారం రెండోసారి కూడా నిలిచిపోయింది. డొంక దారిని సర్వే చేసేందుకు సర్వే అధికారులు ముందస్తుగా రైతులకు నోటీసులు జారీ చేశారు. ఇరువర్గాలకు చెందిన రైతులు సర్వేకు వచ్చారు. కలెక్టర్ అదేశాల మేరకు ఉదయం 11 గంటలకు పోలీస్ బందోబస్తుతో డొంక భూమిని సర్వే చేసేందుకు రెవిన్యూ, సర్వే అధికారులు స్థలం వద్దకు వచ్చారు. సర్వేకు వచ్చిన అధికారులు ఇరు వర్గాల రైతులతో మాట్లాడారు. ఒక వర్గం వారు ఇచ్చిన దరఖాస్తు మేరకు డొంకదారి ఒక్కటే సర్వేచేస్తామంటే ఒప్పుకొమని, గ్రామంలో అక్రమణలు ఇంకా ఉన్నాయని వాటికి కూడా దరఖాస్తులు ఇచ్చామని, మొత్తం ఒకేసారి సర్వే చేయాలని సర్వే అధికారులతో వాగ్వివాదంకు దిగారు. ఇరువర్గాల రైతులతో అధికారులు చాలా సేపు చర్చలు జరిపారు. ఆ తర్వాత ఇరువర్గాల మధ్య సమన్వయం లేకపోవడంతో సర్వేను అధికారులు నిలిపివేశారు. సర్వే చేసేందుకు ఇరు వర్గాల వారు సహకరిస్తేనే చేస్తామని లేకపోతే సాధ్యం కాదని సర్వే అధికారులు ఘటన స్థలం నుండి వెళ్లిపోయారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని గిరిజనవాసి ఆందోళన

సర్వే అధికారులు వెళ్లిపోతుండటంతో ఘటన స్థలం నుండి రెవిన్యూ అధికారులు వెళ్లిపోయేందుకు సిద్ధం కాగా సర్వే చేయకుండా ఇక్కడ నుండి వెళ్లిపోవడానికి వీలు లేదంటూ ఒక వర్గంకు చెందిన బట్టు అమృనాయక్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని తమ వర్గం వారితో తహసిల్దార్ కారు ముందు కూర్చోని నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. జిల్లా అధికారులతో మాట్లాడి మరోమారు పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య తాత్కలికంగా సద్దుమణిగింది. సర్వే వివాదస్పదంగా ఉండటంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు చిలుకూరు ఎ స్ఐ రాంబాబుగౌడ్ భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దృవకుమార్, డిఐవోలు వంశీధర్, మంచ్యానాయక్, మండల సర్వేయర్ నాగార్జునరెడ్డి, ఆర్ఐ లు శ్వేత, మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు, సర్వే అధికారులు, రైతులు పాల్గొన్నారు.







# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## సిఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ పథకం వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల రైతు బంధు, సమితి మాజీ అధ్యక్షులు రావుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురంలో ఇటీవల అనారోగ్యంతో బాధఫడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన కాశీవిశ్వనాథ సంధ్యకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన రూ.40వేల చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు రావుల నారాయణరెడ్డి, వల్లభపురం మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఇవిఎం గోడౌన్ కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ఇవిఎం గోడౌన్‌ను శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతినెల ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేయాల్సిన నిబంధన ఉందని తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం తనిఖీలను కచ్చితంగా అమలుచేస్తున్నారని చెప్పారు. ఇవిఎంల భద్రతకు ఎన్నికల ప్రక్రియలో అత్యంత ప్రాధాన్యత ఉన్నదన్నారు. అందువల్ల ప్రతినెల నిర్ధేశిత తేదికి ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తూ భద్రత ఏర్పాట్లను సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ ఇవిఎంల నిల్వ పరిస్థితులు, గోడౌన్‌లో ఏర్పాటు చేసిన భద్రత వ్యవస్థలను స్వయంగా పరిశీలించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు, గోడౌన్‌లో ఉన్న సీల్స్ వివరాలు, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించేందుకు తీసుకున్న చర్యలు తదితర అంశాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో కూడా భద్రతకు ఏమాత్రం లోటులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌వెంట నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరిండెంట్ రవికుమార్, బాలకృష్ణ, ఎండి. హుస్సేన్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పాఠశాలకు కుర్చీల వితరణ



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పట్టణంలోని శిశు మందిర్ విద్యాలయానికి ప్రముఖ వ్యాపారవేత్త, వట్టం రవి కన్వెన్షన్ హాల్ అధినేత వట్టం రతన్‌కుమార్ గుప్తా తన 46వ జన్మదినం సందర్భంగా కుర్చీలు, విద్యార్థులకు నోట్‌ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. తొలుత వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని, ఆ తర్వాత తాను చదువుకున్న శిశుమందిర్ విద్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శిశుమందిర్ సిబ్బంది, వాసవి, వనితా క్లబ్ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వట్టం పుష్పవతి, వట్టం అనూష, వట్టం నిక్షయ, అంజయ్య, ఆచారి, వెంకటేశ్ ఆచారి, ప్రతాప్ రెడ్డి, బి.రవీందర్, మనసాని నాగరాజు, వనితా క్లబ్ అధ్యక్షురాలు మనసాని సరళ, సెక్రెటరీ లంకాల సుజాత, ప్రసన్న, శిశుమందిర్ ప్రధానోపాధ్యాయులు కుర్మయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, శ్రీనాథ్, శివన్న, సత్యం, పండు, రఘు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సమ్మేళనం పోస్టర్‌ను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి. వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, ఫయాజ్, సుధాకర్ రెడ్డి, గోవింద్ యాదవ్, ఉమ్మడి పురుషోత్తం, రాజు, రాషెద్ ఖాన్, తిరుమల వెంకటేష్, జాజి మొగ్గ నర్సింహులు, లీడర్ రఘు, పీర్ మహ్మద్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేందర్‌రెడ్డి సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఐక్యత ఫౌండేషన్ శంకర నేత్రాలయవారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం సేవలు స్థానిక ప్రముఖ డాక్టర్ దామోదర్‌రెడ్డి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా సీనియర్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. ఎక్కడ చూసిన సుంకిరెడ్డి సామాజిక సేవలు గమనిస్తున్నానని వాటికి సంబంధించిన సేవా కార్యక్రమాల గురించి నేను తెలుసుకున్నానని అన్నారు. ప్రజలకు ఏదో చేయాలనే సేవా దృక్పథానికి అభినందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీసబాలరాజు, యువజన నాయకులు రమేష్, ఐక్యతఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గమ్యంవైపు అడుగులు వేయాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** వ్యక్తిగత సామర్థ్యాన్ని నిర్ధేశించుకొని లక్ష్యంవైపు అడుగులు వేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అమరేందర్ విద్యార్థినిలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, ఏకలవ్య విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విద్యాలయాల్లో పలు రికార్డులను పరిశీలించి ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, భాస్కర్‌ను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను అధిగమించి లక్ష్యంవైపుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు లక్ష్యాలను తెలుసుకొని సాధించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, జానకి, శ్రీలత, విజయ, శోభారాణి, సాహిత్రి, మురళి ఉన్నారు.

# ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు

కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లాకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆయిల్‌పామ్ సాగు కోసం నిర్దేశించిన 3500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్యసాధనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉద్యానశాఖ అధికారులు, వ్యసాయ విస్తరణ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయిల్‌పామ్ సాగుపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాకు నిర్దేశించిన 3500 ఎకరాలకు ఇప్పటి వరకు 54 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలను నాటడం జరిగిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను గుర్తించడంతో పాటు వారికి ఆయిల్‌పామ్ తోటల సాగుతో వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఒక్కో మండల వ్యవసాయ అధికారికి 50 ఎకరాల టార్గెట్‌ను కలెక్టర్ నిర్దేశించారు. ఉద్యాన శాఖ పథకం అనుసంధానంతో మొక్కల సరఫరా, మొదటి 4 సంవత్సరాల అంతర పంటలకు, రసాయన ఎరువులకు సబ్సిడీ ఉంటుందని ఆమె చెప్పారు. వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వారానికి మూడు రోజుల చొప్పున రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ కొరకు రైతు వాటా డీడీ కట్టించి జిల్లాకు కేటాయించిన




ఆయిల్ ఫామ్ తోటల సాలక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి , రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ నుండి ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన, పట్టు పురుగుల పెంపకం అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యానవన అధికారులు, విస్తరణ అధికారులు, ఆయిల్ ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలల్లో కలెక్టర్ తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** శనివారం జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా, మౌలిక సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక దృషితో ఈ తనిఖీలు చేపట్టారు. అప్పన్నపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను, పిల్లలమర్రిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలను సందర్శించి తరగతుల గదుల్లో విద్యార్థులు చదువుతున్న తీరును, మౌలిక వసతులను పరిశీలించారు. అలాగే డార్మెటరీలు, టాయిలెట్లు తదితర వసతులపై ఆరా తీశారు. అవసరమైన అభివృద్ధి పనులపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. గిరిజన మహిళ శిశు సంక్షేమ శాఖలో హాస్టల్ రూంలలో డార్మెటరీ కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని, డోర్‌లు, కిటికీలు రిపేర్లు చేపట్టాలని సూచించారు. విద్యార్థినులకు సరి పడా డబుల్ కాట్ బెడ్‌లు, లేవని ప్రిన్సిపాల్ తెలిపారు. బాత్రూంలలో గాని వెళ్లేందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్‌తో ఏర్పాటు చేయాలని సూచించారు. కిచెన్ రూం పరిశీలించారు. కూరగాయలు తాజాగా తీసుకొని వండించాలని సూచించారు. పిల్లల మర్రిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ తనిఖీల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విద్యార్థుల భద్రత, అభ్యాసం, మౌలిక వసతుల మెరుగుదల కోసం అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, కళాశాలల ప్రిన్సిపాల్ లు ఉన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** భారత కమ్యూనిస్టుపార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా మూడో మహాసభలను ఆగస్టు 1,2తేదిలలో నిర్వహించబడుతున్నాయని ఈమహాసభలను విజయవంతం చేయాలని సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు ఎస్‌ఎండి ఫయాజ్, వార్లవెంకటయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు కొమ్ము భరత్, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జీ పులిజాలపరుషరాములు, సిపిఐ జిల్లానాయకులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు ఏసారపు అశోక్‌గౌడ్, దారదాసు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 1న పట్టణంలో భారీ ప్రదర్శన గొప్ప బహిరంగసభను నిర్వహిస్తున్నామని ఈ బహిరంగసభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడవెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా హాజరవుతారని తెలిపారు.

# కాంట్రాక్టర్ల గురించి నేను మాట్లాడాను

నా మాటలను వక్రీకరిస్తే సహించేది లేదు

విపక్ష నేతలకు ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి వార్నింగ్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నాయుడు కోవర్ట్‌లు తెలంగాణలో ఉన్నారని తాను చేసిన వాఖ్యలు కేవలం కాంట్రాక్టర్లను ఉద్దేశించి మాత్రమే తాను చెప్పానని, నాయకులను గురించి తాను ఎలాంటి కామెంట్స్ చేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంగా తనకు సంబంధించిన వీడియోను చూడకుండానే కొందరు విపక్ష నేతలు తాను నాయకుల ఉద్దేశించి కోవర్టులంటూ మాట్లాడానని తప్పుడు ప్రచారం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుకి సంబంధించినటువంటి వ్యక్తులు కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నారని, వారు ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెద్ద రోడ్డు కాంట్రాక్టర్లు, హైదరాబాదులో దండాలు చేస్తున్నారని వారిని టైట్ చేస్తే వారే వెళ్లి చంద్రబాబునాయుడి కాళ్లు పట్టుకొని బనకచర్ల ప్రాజెక్టు అవుతారని మాత్రమే తాను చెప్పానని, ఇంకా కూడా తాను ఏ నాయకుడు గురించి మాట్లాడలేదని ఈ సందర్భంగా అనిరుద్‌రెడ్డి చెప్పారు. మీడియాకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుద్‌రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. అయితే కేటీఆర్‌తో సహా కొంత మంది వివక్ష నాయకులు తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ చంద్రబాబు నాయుడు కోవర్ట్ అని తాను సీఎం రేవంత్‌రెడ్డిని పరోక్షంగా వ్యాఖ్యానించినట్లు చెప్పడం పట్ల ఆయన ఆక్షేపణ తెలిపారు. ఈ విషయంగా తాను చేసిన వీడియోను చూసి ఆ తర్వాత దాని గుర్తించే మాట్లాడాలని తన వీడియోను చూడకుండా మాట్లాడడం సబబు కాదని ఆయన హితవు చెప్పారు. ఈ వివాదంలో సీఎంను లాగకండి అని ఆయన కోరారు. ఈ వీడియోను చూడకుండా తప్పుడు వ్యాఖ్యలను చేస్తే సహించేది లేదని అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు.



## 300 మంది విద్యార్థులకు ఒకే గణిత ఉపాధ్యాయురాలు

గణితంలో వెనుకబడిపోతున్నా పట్టించుకోని విద్యాశాఖ

**ప్రజాపక్షం/ధన్వాడ:** విద్యాపరంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తున్నామంటు సర్కార్ చెబుతున్నప్పటికి ఆచరణలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో దాదాపుగా 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. తరగతులు 6 నుంచి 10 వరకు ఉండగ కొన్ని తరగతులు ఏ,బీ సెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ ముగ్గురు గణితం ఉపాధ్యాయులు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికి విద్యాశాఖ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. దీంతో ఒకే గణితం ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు ఒక్కరే చెప్పడం ఇబ్బందిగా మారింది. దీని వల్ల విద్యార్థులు గణితం పూర్తిగా వెనుకబడిపోతున్నారు. గత విద్యా సంవత్సరంలో ముగ్గురు గణితం ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే విద్యా సంవత్సరం మధ్యలో ఒక ఉపాధ్యాయురాలు డీసీడీఓగా ప్రమోషన్లో వెళ్లారు. మరో ఉపాధ్యాయురాలు బదిలీపై వెళ్లారు. ఇక మిగిలింది ఒక్క ఉపాధ్యాయురాలే ఉండటం విద్యార్థులకు అనుకున్నంతలో గణిత బోధన కొనసాగడం లేదని విద్యార్థులే అంటున్నారు. గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో దాదాపుగా 20 మందిగాపైగా విద్యార్థులు గణితంలో ఫెయిల్ అయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి గణితం ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డిగ్రీ చదువుతో అనేక కొలువులు

బొటానికల్ గార్డెన్‌కు స్వచ్ఛందంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి రూ.25 వేలు విరాళం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వుంద్యాల బాలకిష్టా రెడ్డి శనివారం స్థానిక డా.డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.డి.నర్మద మొక్కతో స్వాగతం పలికారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఒరియెంటేషన్ కార్యక్రమంలో విద్యార్థుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. డిగ్రీ చదువుతో ఉన్నత ఉద్యోగాలు అనేకం ఉన్నాయని కాకపోతే విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశం కొరకు వేచిచూస్తున్న విద్యార్థులకు శుభవార్తను అందించారు. ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత మరొకమారు డిగ్రీ కళాశాలలో ప్రవేశించడానికి అవకాశమిస్తామన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎంత మంది విద్యార్థులు చేరారు అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు స్వచ్ఛందంగా 25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా, గార్డెన్ అభివృద్ధికి కృషి చేస్తున్న డా.సదాశివయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.డి.నర్మద, అధ్యాపకులు శ్రీనివాసులు, రాఘవేందర్ రెడ్డి, డా.సదాశివయ్య, సూలేమాన్, దోస్త్ కన్వీనర్ సురయ జబీన్, నరసింహులు, నాగలక్ష్మి , వేణు, లెఫ్టినెంట్ రాజేశ్వరి, పుష్పలత, నరసింహా రావు, వెంకటయ్య, ఆంజనేయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మైనర్లు వెహికల్స్ నడపటం చట్టరీత్యా నేరం




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** మోటార్ వెహికల్ యాక్సిడెంట్ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాల బాలికలు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్/న్యాయవాది ఎం.రఘు అన్నారు. ఈ చట్ట ప్రకారం ఎవరైనా వాహనాలు నడిపితే రూ.25వేల జరిమానా మూడు సంవత్సరాల జైలు శిక్ష తల్లిదండ్రులకు విధించబడుతుందని తెలియజేశారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, ఆదేశాలనుసారం శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో మాస్టర్ మైండ్ విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ అదేవిధంగా బాల్య వివాహాల చట్టం, సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌతమ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొహరం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు



డీఎస్పీ నల్లపు లింగయ్య

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మొహరం పండుగ సందర్భంగా ఉట్కూర్‌తో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. మొహరం పండుగకు నారాయణపేట జిల్లా ఫోర్స్‌తో పాటు ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన మొత్తం 100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉట్కూర్‌లోని రైతు వేదికలో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు డీఎస్పీ నల్లపు లింగయ్య భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ఉట్కూర్ టౌన్‌లో బందోబస్తుడు మూడు సెక్టార్లుగా విభజించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. అని బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది సంయమానం పాటించాలని, ఎవరికి ఎక్కడ కేటాయించిన స్థలంలో వారు అక్కడే ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. పిర్ల చావడి, మజీద్‌ల దగ్గర, ప్రధాన చౌరస్తాలో పోలీస్ పికెట్స్, పీర్ల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ డైవర్షన్, మొబైల్ పెట్రోలింగ్, ఫుట్ పెట్రోలింగ్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున దొంగతనాలు జరగకుండా, ఆకతాయి నుండి మహిళల రక్షణ గురించి మఫ్టిలో పోలీసులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలంతా కుల మతాల కతీతంగా ఉత్సాహంగా పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలు పోలీసు వారికి సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. అలాగే సోషల్ మీడియాపై (ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్) పూర్తి నిఘా ఏర్పా టు చేయడం జరిగిందని ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ఎలాంటి అనుచిత పోస్టులు వైరల్ చేయరాదని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రామ్‌లాల్, ఎస్‌ఐలు రమేష్, శివ శంకర్, మద్దయ్య , రేవతి, గాయత్రి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విస్తరణ పనుల్లో విగ్రహాలు లభ్యం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అమ్రాబాద్ మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా శనివారం దేవత విగ్రహాలు బయటపడ్డాయి. ఈసందర్భంగా స్థానికులు వచ్చి ఈవిగ్రహాలు ఈదమ్మ విగ్రహాలుగా స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇక్కడ ఈదమ్మ దేవాలయం ఉండేదని తెలిపారు. ఈసందర్భంగా స్థానికులు విగ్రహానికి పూజలు చేసి ఇక్కడే తాత్కాలికంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విగ్రహాన్ని చూడటానికి తండోపతండాలుగా ప్రజలు వస్తున్నారు. ఈవిషయం తెలియడంతో వెంటనే పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

## గత ప్రభుత్వంలో యార్డులు నిర్వీర్యం

మార్కెట్ పాలకవర్గం వార్షికోత్సవ వేడుకల్లో చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు మార్కెట్ యార్డుల రూపురేఖలు మార్చడం జరిగిందని గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మార్కెట్ యార్డులు నిర్వీర్యం అయ్యాయని, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా తనకు రెండోసారి అవకాశం, రైతులకు సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం వనపర్తి మార్కెట్ యార్డు పాలక వర్గం వార్షికోత్సవ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మార్కెట్ యార్డ్ పాలక వర్గ సభ్యులను రైతులు, మార్కెట్ యార్డ్ వ్యాపారస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2007 నుంచి 2010 వరకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశానని, తిరిగి ఇటీవల వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో రెండవసారి చైర్మన్‌గా తాను బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పాలక వర్గ సభ్యులు, కొత్త గొల్ల కృష్ణయ్య, చీపుర్ల శ్యాంసుందర్ రెడ్డి, రాములు నాయక్, గోపాల్ నాయక్, ఉమేష్ కుమార్, సురేష్, ఆగు పోగుల లతీఫ్ హుద్దీన్, బండారు రాజేందర్, సదుర్ల శారదతో పాటు వనపర్తి మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, దళిత నాయకుడు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ధనలక్ష్మి , ఎస్‌ఎల్‌ఎన్ రమేష్, యాపర్ల రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం, కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్యుతాపురం తిరుపతయ్య, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.






## '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' ఫస్ట్ లుక్ విడుదల




సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్ రావు, తాజాగా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' అనే టైటిల్‌తో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో పుష్ప చిత్రంలో అలరించిన నటుడు డాలీ ధనుంజయ నటిస్తుండగా.. కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. జె.ఫిలమ్స్ పతాకంపై వైశాక్ గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుండి డాలీ ధనుంజయ్ న్యూ లుక్‌ను విడుదల చేసారు. డిఫరెంట్ లుక్‌లో ఉన్న ధనుంజయ్ లుక్ కు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. పుష్ప 12 చిత్రాలతో పాపులర్ అయిన డాలీ ధనుంజర్ 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ చిత్రంలో డిఫరెంట్ రోల్‌లో నటించారు. జైలర్ 2, పెద్ది చిత్రాల్లో నటిస్తోన్న శివరాజ్ కుమార్ ఈ సినిమాలో మరో విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. చరణ్ రాజ్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాకు అద్వైత గురుమూర్తి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. విశ్వాస్ కశ్యప్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమోషన్స్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్ '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' చిత్రం కన్నడతో పాటు తెలుగులో ఒకేసారి విడుదల కాబోతోంది.

## 'బకాసుర రెస్టారెంట్' టైటిల్ ర్యాప్ సాంగ్ ఆవిష్కరణ






తన నటనతో, డైలాగ్ డెలివరితో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలోని బకాసుర టైటిల్ ర్యాప్ సాంగ్‌ను బ్లాక్‌బస్టర్ మాస్ దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. వికాస బడిస సంగీతం సమకూర్చిన ఈ పాటను ర్యాప్ సింగర్ రోల్ రైడ్, వికాస బడిస ఆలపించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ '' బకాసుర రెస్టారెంట్ టైటిల్‌తో పాటు ఈ పాట కూడా బాగుంది. చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమా ఐడియా బాగుంది. నటుడు ప్రవీణ్ నాకు మొదట్నుంచి తెలుసు. ప్రవీణ్ హీరోగా రాబోతున్న ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలి. తొలి చిత్ర దర్శకుడు ఎస్‌జే శివతో పాటు అందరికి ఈ చిత్రం మంచి పేరును తీసుకరావాలి' అన్నారు.

## మరో ఆఫర్ పట్టేసిన పూజా హెగ్డే !



టాలీవుడ్‌లో కొన్నాళ్ల కితం వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో అదరగొట్టిన స్టార్ హీరోయిన్స్‌లో పూజా హెగ్డే కూడా ఒకరు. మరి పూజా హెగ్డే హీరోయిన్‌గా మళ్ళీ కొంత కాలం తర్వాత సిల్వర్ స్క్రీన్ పై బిజీగా మారింది. అయితే ఎక్కువగా తమిళ్ లోనే సినిమాలు చేస్తున్న పూజా హెగ్డే రీసెంట్ గానే 'రెట్రో' సినిమాలో సూర్య సరసన కనిపించింది. ఇక ఇవి కాకుండా తమిళ్ లోనే కూలీ, ఇంకా జన నాయగన్ లాంటి భారీ సినిమాల్లో కూడా ఆమె నటించిన సంగతి తెలిసిందే. మరి ఈ ప్రాజెక్ట్‌లు కాకుండా మరో సాలిడ్ ప్రాజెక్ట్‌ని ఆమె పట్టేసినట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. దీని ప్రకారం పూజా హెగ్డే నెక్స్ట్ హీరో ధనుష్ సరసన కనిపించనున్నట్టుగా తెలుస్తుంది. ధనుష్ లేటెస్ట్‌గా కుబేరతో హిట్ కొట్టాడు అలాగే తన హిందీ సినిమా ఒకటి పూర్తి చేసుకున్నాడు. మరి ఫైనల్‌గా తన నెక్స్ సినిమా కోసం కూడా సిద్ధం అవుతుండగా అందులో పూజా నటించనున్నట్టు ఇపుడు తెలుస్తుంది. ఇక దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.


## 11న వస్తున్న 'మై బేబీ'




తమిళ నటుడు అథర్వ, నిమిష సజయన్ హీరో హీరోయిన్లుగా నెల్సన్ వెంకటేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన మై బేబీ సినిమాను తెలుగులో విడుదల హేస్తున్నారు. కుటుంబంలో ఉండే సమస్యల నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమాను ఈనెల 11న విడుదల చేయనున్నామని నిర్మాత సురేష్ కొండేటి తెలిపారు. ఫ్యామిలి ఉండే ఎమోషన్స్ ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కించారని అన్నారు. తమిళంలో నిర్మించిన ఈ సినిమాను తెలుగులో విడుదల చేయడానికి హక్కులు కొనుగోలు చేశానని సురేష్ కొండేటి అన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సినిమా అవుతుందని చెప్పారు. ప్రేమిస్తే సినిమా తరువాత అంతటి ఫీల్ గుడ్ మూవీ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నటుడు ఫిష్ వెంకట్‌కు సహాయం చేయండి


– కుమార్తె వేడుకోలు



రెండు కిడ్నీలు పాడయిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు ఫిష్ వెంకట్‌కు సహాయం చెయ్యాలని ఆయన కుమార్తె స్రవంతి విజ్ఞప్తి చేశారు. గత కొద్ది కాలంగా ఫిష్ వెంకట్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు కిడ్నీలు పాడైపోయి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో చికిత్స కోసం ఎవరైనా సహాయం చెయ్యాలని స్రవంతి తెలిపారు. అయితే ప్రభాస్ సాయం చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఆయన కూతురు చెబుతున్నారు. ప్రభాస్ పిఎ అని ఒకరు కాల్ చేశారు. వివరాలు తెలుసుకొని సాయం చేస్తా అన్నారు కానీ, ఇప్పటి వరకు వారి నుంచి ఎలాంటి సాయం అందలేదు. తమకు వచ్చిన నెంబర్‌కు కాల్ చేసినా ఎవరు లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఫేక్ కాల్స్‌తో కాలయాపన చేసే సమయం కాదని, తండ్రి ఫిష్ వెంకట్ ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తుందని ఆమె అన్నారు. సాయం చేసేవాళ్లు ఎవరైనా సహాయం చెయ్యాలని ఆమె వేడుకున్నారు. ఈ మేరకు ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు.

## వైరల్ వయ్యారి నేనే వయసొచ్చిన అణుబాంబు నేనే

జూనియర్ నుంచి పాట రిలీజ్




ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న సినిమా జూనియర్. రాధా కృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ జూలై 18న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'వైరల్ వయ్యారి నేనే వయసొచ్చిన అణుబాంబు నేనే' అనే పాటను ఆవిష్కరించారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. దేవిశ్రీ హరిప్రియ ఇద్దరూ పాడిన స్టైల్ సాంగ్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లింది. ఈ పాటను కళ్యాణ్ చక్రవర్తి రాశారు. యూత్‌ను బాగా ఆకట్టుకునేలా ఈ పాత సాగుతుంది. కిరీటి రెడ్డి, శ్రీలీల కలిసి డాన్స్ అదరగొట్టారు. కిరీటి స్టెప్పుల్లో గ్రేస్ చూపిస్తే, శ్రీలీల తన అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకుంది. అందమైన సెట్స్‌లో షూట్ చేసిన వైరల్ వయ్యారి పాట క్యాచి మ్యూజిక్, ట్రెండీ లిరిక్స్, కలర్ ఫుల్ విజువల్స్‌తో ఈ సాంగ్ ఈ ఏడాది వైరల్ చార్ట్‌బస్టర్ హిట్ కానుందని నిర్మాత రజని కొర్రపాటి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సినిమాకి కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని డైలాగ్ అందిస్తున్నారు.

## ఓ భామ అయ్యో రామ ట్రైలర్ విడుదల



సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు' టీజర్ రిలీజ్



రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, మీనింగ్ ఫుల్ ఎంటర్ టైనింగ్ సినిమాలకి సపోర్ట్ తో తెరకెకించిన సినిమా 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మనోజ్ చంద్ర అనే పాత్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపిస్తాడు. అతను డ్యాన్స్ పార్ట్నర్ కోసం వెతుకుతున్నప్పుడు ఊహించని సమస్యలలో చిక్కుకుంటాడు. ఇలాంటి కథతో కొత్తదనంగా చెప్పే ప్రయత్నం చేసిన సినిమా ఇది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఈ చిత్రమని దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెలిపారు. ఈ చిత్రంలో మోనికా, ఉషా బోనెల కూడా ప్రముఖ పాత్రల్లో నటించారు. గురుకిరణ్ బత్తుల కథ, సంభాషణలను అందించారు. దాదాపుగా అన్ని పనులు పూర్తి కావచ్చిన ఈ సినిమాను జూలై 18న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇతర పాత్రల్లో రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్ నటిస్తున్నారు.

## సుప్రీంకోర్టుకు 'ఎడిఆర్'

**(మొదటి పేజీ తరువాయి)**

స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు అంతరాయం కలిగించగలదని పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఆర్డర్‌లోని డాక్యుమెంటేషన్ అవసరాలు, తగిన ప్రక్రియ లేకపోవడం, బిహార్‌లో ఓటర్ల జాబితా నిర్దిష్ట ఇంటెన్సివ్ సవరణకు అసమంజసంగా తక్కువ సమయం ఉండటం వల్ల ఈ కసరత్తు లక్షలాది మంది నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని, ఇది వారి ఓటు హక్కును కోల్పోయేలా చేస్తుందని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. బిహార్‌లో ఇటువంటి సవరణ 2003లో జరిగింది. ఎన్నికల సంఘం ప్రకారం.. శరవేగంగా నగరీకరణ, తరచూ వలసలు, యువ పౌరులు ఓటుకు అర్హులైన వారి వివరాలు, మరణాలకు సంబంధించిన వివరాలు, విదేశాలకు అక్రమ వలసదారుల పేర్లను చేర్చడం వల్ల ఈ కసరత్తు చేయడం తప్పనిసరి అవసరమైంది.ఈ కసరత్తుతో దోషరహిత ఓటర్ల సమగ్ర జాబితాను తయారుచేయాలనుకుంటున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ధృవీకరణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించేందుకు బూత్ అధికారులచే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించబడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, 1950 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16లో పేర్కొన్న రాజ్యాంగ చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని ఎన్నికల సంఘం తెలియజేసింది.



## 2036 ఒలంపిక్స్ పతకాలే లక్ష్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒలంపిక్స్ పతకాలే లక్ష్యంగా అధికారులు కార్యచరణ రూపొందించుకుని పనిచేయాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశ్యం చేశారు. సచివాలయంలో శనివారం ఆయన తన చాంబర్లో క్రీడా శాఖపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా అధికారులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. క్రీడలను శిఖర స్థాయికి చేర్చాలన్న సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ పనితనంలో కొత్తదనం కనిపించాలన్నారు. గతంలో జరిగిన వైఫల్యాలను అలసత్వాన్ని పక్కనపెట్టి నూతన వొరవడితో క్రీడా శాఖ పనిదానంలో కొత్తదనం కనిపించాలని సూచించారు. 2036 ఒలంపిక్స్‌లో పతకాలు లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ పనిచేయాలని, చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించడం సులభతరమైనేన్నారు. క్రీడారంగంలో సమూల మార్పు కొరకు కార్యాలయాల్లో కూర్చుంటే సాధ్యం కాదని కార్య క్షేత్రంలోకి వెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు .విద్యాశాఖ తో సమన్వయం చేసుకొని పాఠశాల స్థాయి నుండే క్రీడాకారులను గుర్తించాలని గురుకుల విద్యాలయల్లో ఉన్న ప్రతి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన అభివృద్ధి పర్యాటక, క్రీడలు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు ఇంజనీరింగ్ విభాగం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కెసిఆర్, కెటిఆర్ ఇద్దరూ నేరస్తులే

ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేసిన ఘటన మర్చిపోయారా..? : ఎం.కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులను నమ్మించి మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మాజీ ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు ఇద్దరూ నేరస్తులేనని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రికెటిఆర్ వ్యాఖ్యలపై కోదండరెడ్డి స్పందిస్తూ బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులు తమకు మార్కెట్‌లో న్యాయమైన ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసిన రైతులకు బేడీలు వేశారని, అలాంటి నాయకులు ఇప్పుడు రైతులపై కపట ప్రేమ నటించడం ఆశ్చర్యకరమని కోదండరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దరిద్రపు ధరణితో 30 లక్షల కుటుంబాలకు భూమి హక్కు ఉన్నప్పటికీ వారు పట్టాలను కూడా పొందలేక, అనేక రకాలుగా నష్టపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్న సమయంలోనే భూదాన బోర్డును రద్దు చేసి, అర్ధ రాత్రి దర్వాజలు పగులగొట్టి దస్త్రాలు ఎత్తుకెళ్లారని ఆయన ఆరోపించారు. ఇందిరా గాంధీ పేదలకు అసైన్డ్ చేసిన భూములను రియల్ ఎస్టేట్ వారికి వేలం వేసి అమ్మిన ఘనత కెసిఆర్‌దేనని అన్నారు. తెలంగాణకు చెందిన భూముల వివరాలను కెటిఆర్ ఒక దివాళా తీసిన అమెరికు చెందిన క్వాంటెలా కంపెనీకీ అప్పంగించారని, బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ కార్డు వివరాలను కూడా అప్పగించారని కోదండరెడ్డి గుర్తు చేశారు.

## సిఎంను ప్రశ్నించే స్థాయి కెటిఆర్‌కు లేదు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించే, సవాల్ చేసే హక్కు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు లేదని, కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు సెకండ్ బెంచ్ లీడర్లని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని కెటిఆర్ ప్రశ్నించాలనుకుంటే ఆయన తండ్రి కెసిఆర్‌ను ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయించి, ప్రతిపక్ష నాయకుడి పదవి కెటిఆర్ తీసుకుని మాట్లాడాలని, కెటిఆర్ మాటలను పరిగణలోకి తీసుకుంటామని జగ్గారెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ మాట్లాడకుండా సెకండ్ బెంచ్ లీడర్స్ మాట్లాడుతున్నారన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబు అని కెటిఆర్ పదే పదే అంటున్నారని, అయితే కెటిఆర్ తండ్రి కెసిఆర్‌కు గురువు కూడా చంద్రబాబు కదా అన్నారు. ఎన్‌టిఆర్‌ను సిఎం పదవి నుండి దించడానికి వైస్రాయ్ హోటల్ ఇంచార్జిగా పనిచేసినందుకు కెసిఆర్‌కు రవాణా శాఖ మంత్రి పదవిని చంద్రబాబు ఇచ్చారన్నారు. అసెంబ్లీకి రావాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరుతుంటే బోట్స్ క్లబ్‌కు, ప్రెస్ క్లబ్‌కు రావాలని కెటిఆర్ అంటున్నారని, బయట చర్చించేందుకని, అంతదానికి అసెంబ్లీ ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై చర్చించడానికి అసెంబ్లీ పెట్టాలని అధికార పార్టీని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేస్తుంది. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని, ప్రతిపక్ష నాయకుడు రావాలని కోరుతున్నారన్నారు' అని జగ్గారెడ్డి అన్నారు.

## బ్రిక్స్ ప్లస్ గ్రూప్ దేశాల భేటీ

**(మొదటి పేజీ తరువాయి)**

వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల జాబితాలో ఒకటిగా భారతదేశం బ్రిక్స్‌లో కీలకపాత్ర వహిస్తోంది. జి–20 ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇప్పటికే అనుభవం సంపాదించుకుంది. ''ప్రతి ఒక్కరితోస్నేహం'' అనే ప్రాతిపదికపై బ్రిక్స్ తన వ్యూహాన్ని ముందుకు తీసువెళుతున్నది. పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలకు బ్రిక్స్ వేదిక వ్యూహాత్మకమైన పట్టువిడుపుల ధోరణితో సభ్యత్వాలు ఇస్తున్నది. రష్యాతో ఎంపిక చేసిన సమస్యలపై భారత్ తన సహకారాన్ని కొనసాగిస్తుండగా, క్వాడ్ కూటమిలో సభ్యదేశంగా అమెరికాతో కూడా స్నేహాన్ని భారత్ కొనసాగిస్తున్నది. క్వాడ్ గ్రూపులో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలు ఉన్నాయి. ఇటీవలి నెలల్లో భారత్–పాకిస్థాన్ మధ్య తాజా సంఘర్షణ అనిశ్చితి తర్వాత మోదీ ప్రపంచ నాయకత్వ ఆశలకు బ్రిక్స్ ఒక ప్రధానవేదికగా అవకాశం ఇచ్చింది. అదేవిధంగా బ్రెజిల్ దేశాధినేత లులా డసిల్వా కూడా అంతర్గతంగా ఉన్న సమస్యల నుండి తాత్కాలిక ఉపశమనం పొందుతారు. ప్రపంచ వాతావరణ సమస్యల వేదిక కాప్–30 సమావేశ నిర్వహణకు సన్నాహాలు చాలా నత్తనడకన జరుగుతున్నాయని డసిల్వాపై దేశంలో ప్రతిపక్షం ఆరోపణలు చేస్తున్నది. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారో ఈ విమర్శలు చేయడంలో ముందున్నారు. ఈ పరిస్థితుల్లో లులా డసిల్వాకు ఈ సమావేశాల ద్వారా కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక శరవేగంగా విస్తరిస్తున్నది. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు 2024లో బ్రిక్స్ వేదికలో సభ్యులుగా చేరడంతో దీనికి కొత్తబలం చేకూరింది. అదే విధంగా ఆగ్నేయ ఆసియాలో ప్రఖ్యాతదేశం ఇండోనేసియా కూడా ఈ ఏడాదిలోనే బ్రిక్స్ సభ్యత్వం తీసుకుంది. 2011లో దక్షిణాఫ్రికా బ్రిక్స్‌లో చేరింది. ఇప్పుడు 10 సభ్యదేశాల వేదికగా అవతరించిన బ్రిక్స్‌గ్రూపు 2024 నుండీ మరో పది సభ్యదేశాల గ్రూపుతో కలిసి నడుస్తోంది. బెలారస్, బొలీవియా, క్యూబా, కజఖస్థాన్, మలేసియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం దేశాలు దీనికి జత కలిశాయి. 11వ శతాబ్దం నాటి దేశం సౌదీ అరేబియా కూడా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్–2025 సమావేశ జాబితాలో ఉన్నట్లు సంబంధిత వెబ్‌సైటు తెలియజేసింది. ఐతే సౌదీ అరేబియాకు ఇంకా సభ్యత్వం ఇచ్చారా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. అభివృద్ధి చెందుతున్న దేశబూలు ఒక బలమైన వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నాయి. 2001లో గోల్డ్‌మన్ సాచ్ ఇచ్చిన నివేదిక ప్రకారం, 21వ శతాబ్దం పూర్తిగా అభివృద్ధి చెందతున్న దేశాలదేనని పేర్కొన్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు ఒక రాజకీయ ఉద్యమంగా రూపుదిద్దుకున్నాయి. వీరు ఐక్యరాజ్యసమితి సమావేశాల సందర్భంగా కలిసి కూర్చుని ప్రపంచ ఆర్థిక పరిస్థితుల గురించి మాట్లాడుకోవడం ప్రారంభించారు. 2008 నాటికి అమెరికా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రుణాల సామూహిక ఎగవేతల కారణంగా ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం సంభవించింది. ఈ పరిస్థితుల్లో బ్రిక్స్ వేదిక దేశబూలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ వృద్ధి తిరిగి పుంజుకోవడంలో ఒక చోదకశక్తిగా పనిచేశాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలపై బ్రిక్స్ దేశాలు చాలా నిశితమైన నిర్మాణాత్మకమైన విమర్శలు చేయడం ప్రారంభించాయి. ప్రత్యేకించి బ్రెట్టన్ ఉడ్స్ ఇనిస్టిట్యూషన్స్, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకులపై విమర్శలు చేస్తున్నాయి. 2008లో ఆర్థిక సంక్షోభాన్ని సామూహికంగా నిలబడి నివారించడంలో విఫలమయ్యాయని 2009 జూన్‌లో మొదటిసారి బ్రిక్స్ ఆవిర్భావ సమావేశంలో నాయకులు విమర్శించారు. ఈ సమావేశం ఆనాడు రస్యాలోని యెకటెరింబర్గ్‌లో జరిగింది.




## బిజెపిని అడ్డుకుంటాం

**(మొదటి పేజీ తరువాయి)**

కాలేదని, అమిత్ షా కమ్యూనిజాన్ని లేకుండా చేయగలరా..? అని ప్రశ్నించారు. దేశంలో వామపక్షాలకు సిపిఐ పెద్దన్న పాత్ర పోషిస్తుందని, 1951 వరకు తాము సాయుధపోరాటం చేసామని, పరిస్థితులను బట్టి ఆయుధాలను జమ్మిచెట్టు మీద పెట్టామని, వాటిని తిరిగి తీసే అవసరం రాకూడదనే కోరుకుంటున్నామన్నారు. మావోయిస్టులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నామని, మావోయిస్టులు కూడా తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు అంటే మనవాడేనని, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మనవాడేనని, ఎర్రజెండా పట్టుకున్న ప్రతివాడు మనవాడేనని చెప్పారు. కమ్యూనిస్టులను పురిటిలోనే చంపాలని చూసిన కంసుని లాంటి బూర్జువాలు, పెత్తందార్లు, కార్పోరేట్ శక్తులు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. కమ్యూనిజం సజీవం.. శాశ్వతం.. అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా కమ్యూనిస్టులు ప్రజలకోసం పోరాడుతారని, తప్పు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. పదవులు తమకు ముఖ్యం కాదని, మమ్మల్ని, ప్రజల్ని కాదనుకొని బిఆర్‌ఎస్ ఫాంహౌస్‌కు పోయిందని, ప్రజలకు నష్టం చేస్తే రేపు కాంగ్రెస్ గతైనా అంతేనని స్పష్టం చేశారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాన ఆవిర్భావ ఉత్సవాలు జరుపుతున్నామని, ఖమ్మంలో డిసెంబర్ 26న వంద సంవత్సరాల వేడుకను లక్షలాదిమందితో నిర్వహించబోతున్నామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టింది మనిషి కోసమేనని, మనుషులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని చెప్పారు.

### జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కండి

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు**

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని చెప్పారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ రాలేదని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభం కాలేదని చెప్పారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసిన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### కురవిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

సిపిఐ మహబూబాబాద్ జిల్లా తృతీయ మహాసభల సందర్భంగా కురవిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ఓం ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఎర్ర చొక్కాలతో యువకులు, ఎర్ర చీరలతో మహిళలు కదం తొక్కారు. ఈ ర్యాలీ, బహిరంగ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమెర విశ్వేశ్వర్ రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్, రాష్ట్ర సమితి సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, రేశపల్లి నవీన్, కనకం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్ రావు, పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న,జంపాల వెంకన్న,చొప్పరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com